Crime News
# క్రైమ్ న్యూస్
తెలుగు దినపత్రిక

శుక్రవారం 10 జనవరి 2025 / సంపుటి: 24 సంచిక: 08 పేజీలు: 12 వెల: రూ.4.00


TELANGANA & ANDHRA PRADESH





# అమల్లోకి వచ్చిన భూభారతి చట్టం

- బిల్లుకు ఆమోద ముద్ర వేసిన గవర్నర్
- సత్వరం చట్టం అమలుకు చర్యలు తీసుకుంటాం
- రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి వెల్లడి



మిగతా 2లో..

హైదరాబాద్,జనవరి9 : 'భూ భారతి-2024' చట్టానికి గవర్నర్ ఆమోద ముద్ర వేశారు. దీంతో ఇది చట్టరూపం దాల్చింది. గవర్నర్ ఆమోదం తెలపటంతో వీలైనంత త్వరగా చట్టాన్ని అమల్లోకి తెస్తామని రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ప్రకటించారు. గవర్నర్ ఆమోదించిన భూ భారతి చట్టం బిల్లు కాపీని సచివాలయంలో రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి నవీన్ మిత్తల్ మంత్రి పొంగులేటికి అందజేశారు. ప్రజలకు మెరుగైన రెవెన్యూ సేవలు అందిస్తామని ఈ సందర్భంగా మంత్రి పేర్కొన్నారు. చరిత్రాత్మక భూ భారతి చట్టాన్ని గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ ఆమోదించడంతో వీలైనంత త్వరగా ఈ చట్టాన్ని అమల్లోకి తీసుకువచ్చేలా చర్యలు తీసుకోవాలని మంత్రి పొంగులేటి అధికారులను ఆదేశించారు. తెలంగాణ ప్రజానీకానికి మెరుగైన, సమగ్రమైన రెవెన్యూ సేవలను సత్వరమే అందించాలన్న ఆశయంతో భూ భారతి చట్టాన్ని తీసుకొచ్చామని తెలిపారు. రాష్ట్రంలో భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేలా ఈ చట్టాన్ని రూపొందించామని పేర్కొన్నారు. ఇందులో పాలుపంచుకున్న ప్రతి ఒక్కరికీ మంత్రి కృతజ్ఞతలు తెలిపారు. ప్రజలందరి అభిప్రాయాలను క్రోడీకరించి సామాన్యుల సంక్షేమమే ధ్యేయంగా భూ భారతి చట్టాన్ని తీసుకొచ్చినట్లు వివరించారు. ఈ చట్టానికి సంబంధించిన విధి విధానాలను రూపొందించడంపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులకు

## సుప్రీంలో కెటిఆర్‌కు చుక్కెదురు

క్వాష్ పిటిషన్ అత్యవసర విచారణకు నో

15న విచారిస్తామన్న చీఫ్ జస్టిస్ ఖన్నా

మిగతా 2లో..

న్యూఢిల్లీ,జనవరి9 : బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు సుప్రీం కోర్టులో ఊరట లభించలేదు. ఆయన వేసిన క్వాష్ పిటిషన్‌ను శుక్రవారం విచారణకు తీసుకునేందుకు చీఫ్ జస్టిస్ నిరాకరించారు. ఈనెల 15న సుప్రీంలో కేటీఆర్ క్వాష్ పిటిషన్‌పై



మిగతా 2లో..

## ప్రవాసీ భారతీయ ఎక్స్‌ప్రెస్ రైలును ప్రారంభించిన ప్రధాని మోదీ

భువనేశ్వర్,జనవరి 9 : విదేశీ భారతీయుల కోసం కేంద్ర ప్రభుత్వం ప్రవాసీ భారతీయ ఎక్స్‌ప్రెస్ రైలును ప్రారంభించింది. భువనేశ్వర్‌లో జరుగుతున్న 18వ ప్రవాసీ భారతీయ దివస్ సందర్భంగా ఈ రైలును

## ఫార్ములా కేసులో ముగిసిన కెటిఆర్ విచారణ

- ఆరున్నర గంటలపాటు విచారించిన అధికారులు
- నిధుల మళ్లింపుపై ముగ్గురు అధికారుల ఆరా
- విచారణ సమయంలో హాజరైన అడ్వకేట్ రామచంద్రరావు
- రేవంత్ ప్రశ్నలనే ఎసిబి అడిగిందన్న కెటిఆర్



మిగతా 2లో..

హైదరాబాద్,జనవరి9 : ఫార్ములా ఈ కార్ రేసింగ్ కేసులో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ గురువారం ఏసీబీ విచారణకు హాజరు కాగా..దాదాపు ఆరున్నర గంటలపాటు ఎసిబి అధికారులు చేసిన విచారణ ముగిసింది. ఫార్ములా కేసులో నిధుల మళ్లింపుపై కేటీఆర్‌ను విచారించేం దుకు ఏసీబీ అధికారులు ఆయనను నడిపించి విచారణ కోసం తీసుకొచ్చారు. ఈ కేసు

## మోహన్‌బాబుకు సుప్రీంలో ఊరట

బెయిల్ విచారణ ముగిసేవరకు అరెస్ట్ చేయొద్దని ఆదేశం



మిగతా 2లో..

హైదరాబాద్,జనవరి9 :సినీనటుడు, దర్శక, నిర్మాత మంచు మోహన్‌బాబుకు సుప్రీంకోర్టులో ఊరట లభించింది. ముందస్తు బెయిల్ పై విచారణ జరుగుతోందని, ఆ విచారణ ముగిసేంతవరకు మోహన్‌బాబును అరెస్ట్ చేయవద్దని సుప్రీం ధర్మాసనం ఆదేశించింది. జర్నలిస్టుపై



మిగతా 2లో..

## మా నాయకుల రక్తం కళ్ల చూశారు

మీరు లోకల్- మేము నేషనల్ జాగ్రత్త అని బీజేపీ నేతల హెచ్చరికలు

- ఎంపీ ఈటల రాజేందర్

హైదరాబాద్ , జనవరి 9: మా నాయకుల రక్తం కళ్ల చూసే నీచ ప్రయత్నం చేస్తున్నారు. రేవంత్ నీకు అధికారం ఉంది అనుకుంటున్నావు. నువ్వు అధికారంలో ఉంది అక్కడక్కడే కానీ మేము దేశమంతా ఉన్నామని మల్కాజ్ గిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు, ఆయన బీజేపీ పార్టీ రాష్ట్ర నాయకుల తో కలిసి పార్టీ కార్యాలయం లో జరిగిన మీడియా సమావేశంలో మాట్లాడారు, మేం పథకం వేస్తే మీరు ఎవరు మిగలరు. దేశ స్వతంత్రం కోసం రక్త తర్పణం చేసిన వాళ్ళం. మేము తలుచుకుంటే తుక్కుతుక్కు అవుతారని ఆయన ఘాటుగా వ్యాఖ్యానించారు,దాడులే మీ అజెండా అయితే మేముంకూడా రెడీ అని ఆయన సవాల్ విసిరారు, కాంగ్రెస్ కి పోయే కాలం వచ్చింది. ఒక పార్టీ ఆఫీసు మీద ఇంకో పార్టీ దాడి చేసిన చరిత్ర లేదు. రేవంత్ ప్రభుత్వం ఇంత బలహీనంగా ఉందా ? సీఎం మీరే... హోమ్ మంత్రి మీరే.. అనుభవజ్ఞులైన సీపీ ఉన్నారు, మీ

## మాజీ మంత్రి హరీశ్‌రావు గృహ నిర్బంధం

కోకాపేటలోని ఆయన గృహం వద్ద భారీగా మోహరించిన పోలీసులు



మిగతా 2లో..

హైదరాబాద్, జనవరి 9 : బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులపై కాంగ్రెస్ ప్రభుత్వం అక్రమ నిర్బంధాలు కొనసాగిస్తున్నది.

## ఛత్తీస్‌గఢ్‌లో మరోసారి ఎన్‌కౌంటర్

ముగ్గురు నక్సల్స్ హతం

ఛత్తీస్‌గఢ్, జనవరి 9 : ఛత్తీస్‌గఢ్‌లో మరోసారి ఎన్‌కౌంటర్ చోటు చేసుకుంది. సుక్మా జిల్లాలో బీజాపూర్ సరిహద్దు వద్ద భద్రతా బలగాలు, నక్సలైట్ల కు మధ్య గురువారం ఎదురుకాల్పులు

మిగతా 2లో..

## మొన్న లడ్డూ.. ఇప్పుడు తొక్కిసలాట

- వైకుంఠ ద్వారం కాదు.. వైకుంటానికే పంపారు
- తిరుపతి ఘటనపై మండిడ్డ పిసిసి చీఫ్ షర్మిల
- మృతుల కుటుంబాలకు కోటి పరిహారం ఇవ్వాలని డిమాండ్

మిగతా 9లో..



## తొక్కిసలాట ఘటనపై జగన్ దిగ్భ్రాంతి

మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి



మిగతా 2లో..

అమరావతి,జనవరి 9 : తిరుపతి తొక్కిసలాట ఘటనపై మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, వైఎస్ జగన్మోహన్‌రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. శ్రీవారి భక్తులు మృతి

## సంక్రాంతికి టీజీఎస్ ఆర్టీసీ సన్నద్ధం

తెలంగాణ రాష్ట్ర రోడ్ రవాణా సంస్థ

మిగతా 2లో..

హైదరాబాద్ జనవరి 9: సంక్రాంతి నేపథ్యంలో సొంతూళ్లకు వెళ్లే వారిని క్షేమంగా గమ్యస్థానాలకు చేరవేసేందుకు తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ(టీజీఎస్‌ఆర్టీసీ) పూర్తి




## తిరుపతి ఘటనకు ఇవో, ఎఇవోలదే బాధ్యత

- బాధ్యతల నిర్వహణలో ఈ ఇద్దరూ విఫలం
- వీరి తప్పిదాలకు మేం తిట్లు తింటున్నాం
- మృతులు కుటుంబాల ఇళ్లకు వెళ్లి క్షమాపణలు చెప్పండి
- భక్తులకు గంటలోనే దర్శనం అయ్యేలా చర్యలు తీసుకోవాలి
- తిరుపతిలో మీడియాతో డిప్యూటి సిఎం పవన్ కళ్యాణ్





మిగతా 9లో..

తిరుపతి,జనవరి9 : తొక్కిసలాట ఘటనకు తితిదే ఈవో, ఏఈవో బాధ్యత తీసుకోవాలని, ఘటనా స్థలిలో ఉన్న పోలీసులు కూడా బాధ్యత తీసుకోవాలని, తిరుపతిలో తొక్కిసలాట ఘటనపై ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సీరియస్ అయ్యారు. అధికారులు చేసిన తప్పులకు మేం తిట్లు తింటున్నాం. తొక్కిసలాట జరిగితే సహాయక చర్యలు ఎలా ఉండాలనే ప్రణాళిక లేదు. వ్యక్తులు చేసిన తప్పులు రాష్ట్ర ప్రభుత్వంపై పడుతున్నాయి. భవిష్యత్తులో దుర్ఘటనలు జరగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలి. ఆ క్రమంలో టీటీడీ ఈవో శ్యామలరావుతోపాటు జేఈవో వెంకయ్య చౌదరిపై మండిపడ్డారు. బాధ్యతలు నిర్వర్తించడంలో టీటీడీ ఈవో శ్యామలరావు, జేఈవో వెంకయ్య చౌదరి విఫలమయ్యారన్నారు. ఈ ఘటనను బాధ్యతగా తీసుకోవాలని.. వారిద్దరికి ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ సూచించారు. అధికారులు చేసిన తప్పిదానికి ప్రభుత్వం నిందలు

## తిరుపతి ఘటనపై చంద్రబాబు సీరియస్

- అధికారుల తీరుపై మండిపడ్డ సిఎం
- కొత్త ప్రదేశం ఎంపిక చేస్తే జాగ్రత్తలు తీసుకోరా
- అంబులెన్స్ ఆలస్యంపైనా అధికారులపై అసహనం
- బాధ్యతలు తీసుకున్నప్పుడు సక్రమంగా నెరవేర్చరా
- బైరాగిగడ్డ ఘటనా స్థలిని పరిశీలించిన చంద్రబాబు
- అధికారుల అలసత్వంపై తీవ్ర ఆగ్రహం



మిగతా 2లో..



## క్షతగాత్రులకు సిఎం చంద్రబాబు పరామర్శ

- ఘటన ఎలా జరిగిందో భక్తుల నుంచి ఆరా
- వైద్య సేవలపై అధికారులకు సూచన
- టోకెన్ల జారీ ప్రక్రియలో మార్పు చేస్తామని సూచన
- భక్తులకు ఇబ్బంది కలగకుండా చర్యలు తీసుకుంటామని వెల్లడి
- క్షతగాత్రులకు వైకుంఠద్వార దర్శనం చేయిస్తామని హామీ

## సంక్రాంతికి టీజీఎస్ ఆర్టీసీ సన్నద్ధం

స్థాయిలో సన్నద్ధమైంది. ఈ పండుగకు 6432 ప్రత్యేక బస్సులను నడపాలని యాజమాన్యం ఇప్పటికే నిర్ణయించింది. ప్రధానంగా ఈ నెల 10, 11, 12 తేదిల్లో ప్రయాణికుల రద్దీ ఎక్కువగా ఉండే అవకాశం ఉంది. ఆయా రోజుల్లో రద్దీ మేరకు ప్రత్యేక బస్సులను అందుబాటులో ఉంచేలా ప్లాన్ చేసింది. అలాగే, ఈ నెల 19, 20 తేదిల్లో తిరుగు ప్రయాణ రద్దీకి సంబంధించి తగిన ఏర్పాట్లు చేసింది. హైదరాబాద్ లో రద్దీ ప్రాంతాలైన ఎంజీబీఎస్, జేబీఎస్, ఉప్పల్ క్రాస్ రోడ్స్, ఆరాంఘర్, ఎల్బీనగర్ క్రాస్ రోడ్స్, కేపీహెచ్‌బీ, బోయిన్‌పల్లి, గచ్చిబౌలి, తదితర ప్రాంతాల నుంచి ప్రత్యేక బస్సులను సంస్థ నడుపుతోంది. ఆయా ప్రాంతాల్లో ప్రయాణికుల సౌకర్యార్థం పండల్స్, షామియానాలు, కుర్చీలు, పబ్లిక్ అడ్రస్ సిస్టం, తాగునీటి సదుపాయం, మొబైల్ టాయిలెట్లను ఏర్పాటు చేయనుంది. సంక్రాంతి పండుగకు నడిపే ప్రత్యేక బస్సులకు రాష్ట్ర ప్రభుత్వ జీవో ప్రకారం 1.50 వరకు టికెట్ ధరలను టీజీఎస్ఆర్టీసీ యాజమాన్యం సవరించింది. తెలంగాణతో పాటు ఇతర రాష్ట్రాలకు తిరిగే స్పెషల్ బస్సులకు మాత్రమే సవరించిన చార్జీలు వర్తిస్తాయి. ఈ నెల 10, 11, 12 తేదిలతో పాటు తిరుగు ప్రయాణ రద్దీ ఎక్కువగా ఉండే 19, 20 తేదిల్లో మాత్రమే సవరించిన చార్జీలు అమల్లో ఉంటాయి. స్పెషల్ బస్సులు మినహా రెగ్యూలర్ బస్సుల్లో సాధారణ చార్జీలే అమల్లో ఉంటాయి. రాష్ట్ర ప్రభుత్వ మహాలక్ష్మి పథకంలో భాగంగా సంక్రాంతికి నడిపే పల్లె వెలుగు, ఎక్స్ ప్రెస్, సిటీ ఆర్డినరి, మెట్రో ఎక్స్ ప్రెస్ బస్సుల్లో మహిళలకు ఉచిత బస్సు రవాణా సదుపాయం యథావిధిగా అమల్లో ఉంటుంది. ప్రధాన పండుగలు, ప్రత్యేక సందర్భాల్లో ప్రజలకు రవాణా పరంగా ఇబ్బందులు తలెత్తకుండా వారిని క్షేమంగా గమ్యస్థానాలకు చేరవేసేందుకు స్పెషల్ సర్వీసులను ఆర్టీసీ యాజమాన్యం నడుపుతోంది. తిరుగు ప్రయాణంలో స్పెషల్ బస్సుల్లో ప్రయాణికుల రద్దీ ఏమాత్రం లేనప్పటికీ.రద్దీ ఉన్న రూట్లలో ప్రయాణికులకు అసౌకర్యం కలగకుండా ఉండేందుకు ఖాళీ బస్సులను త్వరతగతిన సంస్థ వెనక్కి తెప్పిస్తుంది. ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా వాటిని ఆయా రూట్లలో నడిపిస్తుంది. ఆ స్పెషల్ బస్సులకు అయ్యే కనీస డీజిల్ ఖర్చులు, నిర్వహణ మేరకు టికెట్ ధరను సవరించుకోవాలని 2003లో జీవో నంబర్ 16 ను రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసింది. పండుగలు, ప్రత్యేక సందర్భాల్లో నడిచే స్పెషల్ బస్సుల్లో మాత్రమే 1.50 వరకు టికెట్ ధరలను సవరించుకునే వెసులుబాటును సంస్థకు ఇచ్చింది. రాష్ట్ర ప్రభుత్వ జీవో ప్రకారం ఈ సంక్రాంతికి కేవలం 5 రోజులు పాటు టికెట్ ధరలను టీజీఎస్ఆర్టీసీ సవరించింది. టీజీఎస్ఆర్టీసీ బస్సుల్లో ముందస్తు రిజర్వేషన్ ను www.tgsrtcbus.in వెబ్ సైట్ లో చేసుకోవాలని యాజమాన్యం తెలిపింది. సంక్రాంతి ప్రత్యేక బస్సులకు సంబంధించిన పూర్తి సమాచారం కోసం ఆర్టీసీ కాల్ సెంటర్ నంబర్లు 040-69440000, 040-23450033 సంప్రదించాలని సూచించింది.

# అమల్లోకి వచ్చిన భూభారతి చట్టం

(మొదటి పేజీ తరువాయి..)

సూచించారు. డిసెంబర్ 20వ తేదీన భూభారతి బిల్లును తెలంగాణ అసెంబ్లీ ఆమోదించిన విషయం తెలిసిందే. అనంతరం డిసెంబర్ 30వ తేదీన గవర్నర్ కార్యాలయానికి భూభారతి బిల్లు చేరింది. ఈరోజు భూభారతి చట్టానికి ఆమోదం తెలుపుతూ గవర్నర్ నిర్ణయం తీసుకున్నారు. దీంతో త్వరలోనే భూభారతి మార్గదర్శకాలను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేయనుంది. మార్గదర్శకాలపై సర్కార్ కసరత్తు చేస్తోంది. ఆర్వోఆర్ - 2020 వల్ల అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారని అన్నారు. వ్యక్తిగత ప్రయోజనాల కోసం గత ప్రభుత్వం రెవెన్యూ వ్యవస్థను పూర్తిగా విచ్ఛిన్నం చేసిందని విమర్శించారు. కొందరికి సేవ చేయడానికి మాత్రమే పరిమితమైన రెవెన్యూ సేవలను అందరికీ అందించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ పేర్కొన్నారు. కాగా... ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ధరణిని రద్దు చేసి భూభారతి పోర్టల్‌ను ఏర్పాటు చేసింది. ర్వోఆర్-2020ను కూడా పూర్తిగా ప్రక్షాళన చేస్తూ.. ప్రభుత్వం ఈ కొత్త చట్టాన్ని తీసుకువచ్చింది. ధరణి స్థానంలో కొత్తగా భూ భారతి చట్టం అమల్లోకి రానుంది. గత ఏడాది డిసెంబర్ 18న భూభారతి చట్టం బిల్లును మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలంగాణ అసెంబ్లీలో ప్రవేశపెట్టగా.. అదే నెల 20, 21 తేదీల్లో శాసనసభ, మండలి ఆమోదం తెలిపింది. ఆపై గర్నవర్‌కు ఈ బిల్లును పంపగా.. ఈరోజు భూభారతికి ఆమోదం తెలిపారు గవర్నర్. భూభారతితో రైతులకు ప్రయోజనం చూకూరుతుందని ఇది వరకే మంత్రి పొంగులేటి శ్రీనివాస్ తెలిపారు. గత ప్రభుత్వంలో కొందరి గుప్పిట్లోనే పరిమితమైన రెవెన్యూ సేవలను గ్రామస్థాయి వరకు విస్తరించడానికి తమ ప్రభుత్వం చర్యలు చేపట్టిందని వివరించారు. గ్రామాలలో రెవెన్యూ సేవలు అందించేందుకు ప్రతి రెవెన్యూ గ్రామానికి ఒక రెవెన్యూ అధికారిని నియమించబోతున్నామని, ఇప్పటికే కసరత్తు కొలిక్కి వచ్చిందని తెలిపారు. ప్రభుత్వ ఆలోచనల కు అనుగుణంగా రెవెన్యూ విభాగం పనిచేయాలన్నారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ఇందిరమ్మ ప్రభుత్వం పనిచేస్తోందని.. రెవెన్యూ వ్యవస్థను ప్రజలకు చేరువ చేయాలన్నదే తమ ప్రభుత్వ ఆకాంక్ష అని స్పష్టం చేశారు. ప్రత్యేక వెబ్‌సైట్‌ను మంత్రి మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ప్రారంభించారు. ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తుల పరిశీలన 95శాతం పూర్తయిందని మంత్రి తెలిపారు. జీహెచ్ఎంసీలో 88శాతం దరఖాస్తుల పరిశీలన పూర్తి అయ్యిందని వివరించారు.

## తిరుపతి ఘటనపై చంద్రబాబు సీరియస్

తిరుపతి,జనవరి 9 : తిరుపతి తొక్కిసలాట ఘటన నేపథ్యంలో అధికారులపై సీఎం చంద్రబాబు నాయుడు ఆగ్రహం వ్యక్తం చేశారు. బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. ఈ ఘటనలో నిర్లక్ష్యం వహించిన వారిని వదిలే సమస్యే లేదని హెచ్చరించారు. టీటీడీ అధికారులపైనా సీఎం సీరియస్ అయ్యారు. ఇంత జరుగుతున్నా ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. కొత్త ప్రదేశంలో పంపిణీకి సిద్ధమైనప్పుడు అధికారులు ఏం చర్యలు తీసుకున్నారని ప్రశ్నించారు. పలువురు అధికారులు సీఎంకి సమాధానం చెప్పారు. డీఎస్పీ వల్లే ఘటన జరిగిందని అధికారులు తెలిపారు. భక్తులు మొదట ప్రశాంతంగానే ఉన్నారని.. ఎలాంటి ముందు జాగ్రత్తలు తీసుకోకుండా డీఎస్పీ గేటు తెరవడంతో ఈ ఘటన చోటుచేసుకుందని అధికారులు సమధానమిచ్చారు. అనంతరం సీఎం బాధితులను కలిసేందుకు ఆస్పత్రికి వెళ్లారు. వాళ్ళు ఎవరో పెట్టారని మీరు కూడా అదే ఫార్ములాను పాటించడమేంటని సీఎం ఫైర్ అయ్యారు. 'ఘటన జరకముందు చేస్తే అడ్మినిస్ట్రేషన్ జరిగాక చేస్తే గుడ్ అడ్మినిస్ట్రేషన్ ఎలా అవుతుంది? టెక్నాలజీని వాడుకుని టికెట్లు ఇవ్వడం తెలియదా? జేఈవోగా మీరు చేయాల్సిన బాధ్యత గుర్తులేదా? భక్తుల రద్దీనీ దృష్టిలో పెట్టుకుని టికెట్లు ఇవ్వాలని తెలియదా? భక్తుల నుంచి ఫిర్యాదు వస్తే మీరేం చేశారు? ఘటన తరువాత మీరు చేసింది ఏంటి? కనీసం వాట్సాప్ గ్రూప్ ద్వారా మీ సిబ్బంది అదేశాలు ఇవ్వలేరా?' అని సీఎం చంద్రబాబు ప్రశ్నించారు. తిరుపతిలో తొక్కిసలాట జరిగిన ప్రాంతాలను ఏపీ సీఎం చంద్రబాబు పరిశీలించారు. విజయవాడ నుంచి బయల్దేరి రేణిగుంట విమానాశ్రయానికి చేరుకుని అక్కడి నుంచి తిరుపతి వచ్చారు. నగరంలోని బైరాగిపట్టెడ వద్ద ఘటనాస్థలాన్ని పరిశీలించి అధికారులతో మాట్లాడారు. ఘటనకు గల కారణాలు, ప్రభుత్వం తరఫున బాధితులకు అందిస్తున్న సహాయ కార్యక్రమాల గురించి సీఎం అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా టీటీడీ ఈవో శ్యామలరావు, జిల్లా కలెక్టర్, ఎస్పీ, ఇతర అధికారులపై సీఎం ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ఘటన ఎందుకు జరిగిందో సమాధానం చెప్పాలన్నారు. 'భక్తుల రద్దీ పెరుగుతుంటే టీటీడీ అధికారులు ఏం చేస్తున్నారు? ప్రతి ఒక్కరికీ చెబుతున్నా.. బాధ్యత తీసుకున్నప్పుడు దాన్ని నెరవేర్చాలి. తమాషా అనుకోవద్దు' అని వ్యాఖ్యానించారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అనంతరం అంబులెన్స్‌ల లభ్యత గురించి సీఎం ఆరా తీశారు. బైరాగిపట్టెడలో తొక్కిసలాట జరిగిన ప్రాంతాన్ని పరిశీలించిన ఆయన.. కలెక్టర్, ఎస్పీపై, అలాగే టీటీడీ అధికారులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. విధులు కేటాయించిన పోలీసు అధికారికి ఎలాంటి జాగ్రత్తలు చెప్పారని అడిగారు. ఇది క్షమించాల్సిన తప్పు కాదన్నారు. టికెట్లు పంపిణీ కేంద్రంలో తొక్కిసలాటల నియంత్రణకు ముందస్తుగా ఎలాంటి చర్యలు తీసుకున్నారని అధికారులను ప్రశ్నించారు. ఇంతమంది అధికార యంత్రాంగం ఉండి టికెట్ల పంపిణీ ఎందుకు సవ్యంగా చేయలేకపోయారు?.. ఆఫ్‌లైన్, ఆన్‌లైన్‌లో ఎన్ని టికెట్లు జారీ చేశారు... ఘటనా స్థలానికి అంబులెన్స్ ఎన్ని గంటలకు వచ్చిందంటూ వరుసగా సీఎం ప్రశ్నలు సంధించారు. భక్తుల రద్దీ పెరుగుతుంటే అధికారులు ఏం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. భవిష్యత్‌లో ఇలాంటివి జరగకుండా చర్యలు తీసుకోవాలని.. పద్ధతి ప్రకారం పనిచేయడం నేర్చుకోవాలని హెచ్చరించారు. బాధ్యత తీసుకున్నవారు సక్రమంగా నిర్వర్తించాలన్నారు. పరిమితికి మించి భక్తులను లోపలికి ఎందుకు పంపించారని అడిగారు. భక్తులను బయటకు వదిలేటప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలి కదా అంటూ చంద్రబాబు ఫైర్ అయ్యారు. ఈ కేంద్రం వద్ద ఎందుకు ఫెయిల్యూర్ అయ్యారు. భక్తులను ఉంచేందుకు కొత్త ప్లేస్ ఎంపిక చేసుకున్నప్పుడు జాగ్రత్తగా ఉండాలి కదా. ఇక్కడ నియమించిన పోలీస్ ఆఫీసర్‌కు జాగ్రత్తలు చెప్పారా. ఆ గేటు తీస్తే తొక్కిసలాట జరుగుతుందని ఎందుకు ఊహించలేదు' అంటూ కలెక్టర్‌పై చంద్రబాబు తీవ్రస్థాయిలో మండిపడ్డారు. చంద్రబాబు వెంట మంత్రులు అనగాని సత్యప్రసాద్, వంగలపూడి అనిత, ఆనం రామనారాయణరెడ్డి, నిమ్మల రామానాయుడు తదితరులు ఉన్నారు.

### క్షతగాత్రులకు సిఎం చంద్రబాబు పరామర్శ

తిరుపతి తొక్కిసలాటలో తాము తీవ్రంగా గాయపడ్డామని.. ఈ నేపథ్యంలో తనకు వైకుంఠ ద్వార దర్శనం కల్పించాలంటూ సీఎం చంద్రబాబును క్షతగాత్రులు కోరారు. వారి కోరికపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సానుకూలంగా స్పందించారు. తిరుపతిలో చోటు చేసుకొన్న తొక్కిసలాటలో గాయపడి.. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రలను సీఎం చంద్రబాబు గురువారం పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అలాగే తోపులాట ఎలా జరిగిందో.. భక్తులను సీఎం చంద్రబాబు అడిగి తెలుసుకున్నారు. ధైర్యంగా ఉండాలంటూ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న భక్తులకు ఈ సందర్భంగా ఆయన సూచించారు. అలాగే గతానికి.. ఇప్పటికి ఉన్న తేడా ఏమిటని ఈ సందర్భంగా భక్తులను అడిగి ఆయన తెలుసుకున్నారు. ఎలా చేస్తే బాగుండేదని కూడా ఆరా తీసారు. దీంతో ప్రస్తుత విధానం తప్పని, కొండపైన క్యూలైన్లలో ఉంటేనే మేలని పలువురు సూచించారు. అదే విధంగా ఈ ఘటన గల కారణాలపై భక్తుల నుంచి ఆయన మరింత సమాచారాన్ని సేకరించారు. తిరుపతిలో తాము ఉన్న ప్రదేశంలో కనీసం లైట్లు కూడా లేవని ఈ సందర్భంగా సీఎం దృష్టికి భక్తులు తీసుకు వెళ్లారు. గేట్ తీయ్యడంతో ఒక్క సారిగా భక్తులు లోపలికి చొచ్చుకు రావడంతోనే తోపులాట జరిగిందంటూ సీఎంకు భక్తులు వివరించారు. శ్రీవారి దర్శనానికి ఎలాంటి సిస్టం పెడితే బాగుంటుంది అనే విషయాలను భక్తులను ఆయన అడిగి.. వారి నుంచి ఫీడ్ బ్యాక్ తీసుకున్నారు. అయితే.. తమకు స్వామి వారి దర్శనం కల్పించాలని ఈ సందర్భంగా పలువురు భక్తులు.. సీఎం చంద్రబాబుని కోరారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న భక్తులందరికీ వైకుంఠ ద్వారా దర్శనం కల్పిస్తామని ఈ సందర్భంగా వారికి సీఎం చంద్రబాబు హామీ ఇచ్చారు. తిరుమలలో శ్రీవారి దర్శనానికి.. భక్తులందరికి ఆమోద్య యోగ్యంగా వుండే విధానాన్ని ప్రవేశ పెడతామని భక్తులకు ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు హామీ ఇచ్చారు. జనవరి 10వ తేదీన ముక్కోటి ఏక దశి. ఈ సందర్భంగా తిరుపతిలోని శ్రీవారి ఆలయంతోపాటు దేశంలోని అన్ని వైష్ణవ ఆలయాల్లో భక్తులకు ఉత్తర ద్వార దర్శనాన్ని ఏర్పాటు చేస్తారు. ఆ క్రమంలో తిరుమలలో శ్రీవారి దర్శనం కోసం తిరుపతిలో టోకెన్లు జారీ చేసేందుకు టీటీడీ అధికారులు చర్యలు చేపట్టారు. ఈ టోకెన్లు తీసుకొనేందుకు దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తిరుపతి చేరుకున్నారు. ఆ క్రమంలో బుధవారం తిరుపతిలో తొక్కిసలాట చోటు చేసుకుంది. ఈ ఘటనలో ఆరుగురు మరణించగా.. 40 మందికిపైగా గాయపడ్డారు. దీంతో క్షతగాత్రులు తిరుపతిలోని ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. వారిని సీఎం చంద్రబాబు పరామర్శించారు.

(మొదటి పేజీ తరువాయి..)

## సుప్రీంలో కెటిఆర్‌కు చుక్కెదురు

విచారణ జరగనుంది. 15వ తేదీన విచారణకు లిస్ట్ చేసినందున అదే రోజు విచారిస్తామని సీజే స్పష్టం చేశారు. అప్పటి దాకా కేటీఆర్ క్వాష్ పిటిషన్‌ను విచారించాల్సిన అవసరం లేదని అభిప్రాయపడ్డారు. ఫార్ములా ఈ కార్ రేస్ కేసుకు సంబంధించి తెలంగాణ హైకోర్టు... కేటీఆర్ వేసిన క్వాష్ పిటిషన్‌ను కొట్టివేసిన విషయం తెలిసిందే. అలాగే మధ్యంతర ఉత్తర్వులను కూడా హైకోర్టు కొట్టివేసింది. దీంతో హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ సుప్రీం కోర్టులో కేటీఆర్ పిటిషన్‌ను దాఖలు చేశారు. అత్యవసరంగా విచారణకు తీసుకోవాలని కేటీఆర్ తరపు న్యాయవాదులు కోరినప్పటికీ సుప్రీం కోర్టు సీజేఐ నిరాకరించారు. హైకోర్టులో క్వాష్ పిటిషన్‌ను కొట్టేసిన వెంటనే సుప్రీం కోర్టులో కేటీఆర్ క్వాష్ పిటిషన్‌ను దాఖలు చేశారు. అయితే దాన్ని అత్యవసరంగా విచారించాల్సిన అవసరం లేదంటూ 15 విచారణ జరుపుతామంటూ ఆరోజు లిస్ట్ చేశారు. అయితే ఈరోజు కేటీఆర్ తరపు న్యాయవాదులు సీజేఐ ధర్మాసనం ముందు హాజరై.. ఇది చాలా సున్నితమైన అంశమని.. కేటీఆర్ అరెస్ట్ అయ్యే అవకాశం ఉన్నందున్న ఈరోజు లేదా రేపు విచారణ జరపాలని కేటీఆర్ న్యాయవాదు కోరారు. అయితే ఇది అంత అత్యవసరంగా విచారించాల్సిన అవసరం లేదని అభిప్రాయపడుతూ ఈనెల 15న విచారణకు లిస్ట్ చేసినందున ఇక ఆరోజే విచారస్తామని సంజీవ్ కన్నా నేతృత్వంలోని ధర్మాసనం స్పష్టం చేసింది.

## మాజీ మంత్రి హరీశ్‌రావు గృహ నిర్బంధం

అక్రమ కేసులు, ముందస్తు అరెస్టులు, గృహ నిర్భంధాలు విధిస్తూ ప్రజల్లోకి వెళ్లకుండా అడ్డుకోవాలని చూస్తున్నది. ఇందులో భాగంగా సిద్దిపేట ఎమ్మెల్యే, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నేత హరీశ్‌రావును పోలీసులు గృహ నిర్బంధం చేశారు. గురువారం ఉదయంమే కోకాపేటలోని ఆయన నివాసం వద్ద పోలీసులు భారీగా మోహరించారు. ఇంట్లో నుంచి బయటకు రాకుండా అడ్డుకున్నారు. హరీశ్‌రావును కలవడానికి కూడా ఎవరినీ అనుమతించడం లేదు. ఫార్ములా-ఈ కార్ రేస్ కేసులో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ గురువారం ఏసీబీ విచారణకు హాజరు కానున్నారు. ఈ నేపథ్యంలో పార్టీ నేతలను పోలీసులు హౌస్ అరెస్టులు చేస్తున్నారు. కాగా, ఏసీబీ విచారణకు న్యాయవాదితో వెళ్లేందుకు హైకోర్టు అనుమతించిన విషయం తెలిసిందే. రెండు రోజుల క్రితం కేటీఆర్ వెంట న్యాయవాదిని అనుమతించకపోవడాన్ని హైకోర్టు తప్పుపట్టింది. కేటీఆర్‌ను విచారించే ఏసీబీ కార్యాలయంలో దర్యాప్తు గదికి పకనే ఉన్న గ్రంథాలయ గదిలో న్యాయవాది ఉండేందుకు అనుమతించాలని స్పష్టం చేసింది. దర్యాప్తు ప్రక్రియను ఆడియో, వీడియో రికార్డింగ్ చేయాలన్న ప్రతిపాదన పట్ల సానుకూలంగా స్పందించలేదు. గురువారం జరిగే విచారణ తీరును బట్టి అవసరమైతే పిటిషనర్ మళ్లీ కోర్టుకు రావచ్చని తెలిపింది. ఈ మేరకు జస్టిస్ కే లక్ష్మణ్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నెల 6న ఏసీబీ దర్యాప్తుకు న్యాయవాదిని వెంటబెట్టుకుని వెళ్తే పోలీసులు అనుమతించకపోవడాన్ని సవాలు చేస్తూ కేటీఆర్ దాఖలు చేసిన లంచ్ మోషన్ పిటిషన్‌పై బుధవారం భోజన విరామ సమయంలో హైకోర్టు అత్యవసర విచారణ జరిపింది.

## ఛత్తీస్‌గఢ్‌లో మరోసారి ఎన్‌కౌంటర్

చోటు చేసుకున్నాయి. భద్రతా సిబ్బంది గురువారం ఉదయం సుక్మా-బీజాపూర్ సరిహద్దులోని అటవీప్రాంతంలో నక్సలైట్ వ్యతిరేక ఆపరేషన్ చేపట్టారు. ఈ క్రమంలో అక్కడ ఎన్‌కౌంటర్ చోటు చేసుకుంది. ఈ ఘటనలో ముగ్గురు నక్సలైట్లు హతమయ్యారు. ప్రస్తుతం ఆ ప్రాంతంలో సెర్చ్ ఆపరేషన్ కొనసాగుతున్నట్లు సుక్మా ఎస్పీ కిరణ్ చావన్ తెలిపారు. కాగా, మూడు రోజుల క్రితం ఛత్తీస్‌గఢ్‌లో మావోయిస్టులు దుశ్చర్యకు పాల్పడిన విషయం తెలిసిందే. జవాన్ల వాహనాన్ని లక్ష్యంగా చేసుకుని మావోయిస్టులకు పేలుళ్లకు పాల్పడ్డారు. బీజాపూర్ జిల్లా భేద్రే కుట్రు రహదారిలో ఐఈడీ పేలుళ్లకు మావోయిస్టులు పాల్పడ్డారు. ఐఈడీ పేలిన సమయంలో పోలీసుల వాహనంలో 15 మంది డీఆర్జీ జవాన్లు ఉన్నారు. ఈ దుశ్చర్యలో 8 మంది జవాన్లతో పాటు డ్రైవర్ అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోగా, మరో ముగ్గురు జవాన్లకు తీవ్ర

# ఫార్ములా కేసులో ముగిసిన కెటిఆర్ విచారణ

దర్యాప్తు అధికారి డీఎస్పీ మజీద్ ఖాన్.. కేటీఆర్‌ను విచారించారు. ఈ విచారణను జాయింట్ డైరెక్టర్ రితిరాజ్ పర్యవేక్షించారు. విచారణను వేరే గది నుంచి చూసేందుకు కేటీఆర్ న్యాయవాది రామచంద్రరావును అనుమతించారు. ఎప్పుడు పిలిచినా విచారణకు హాజరుకావాలని ఏసీబీ అధికారులు సూచించారు. ఫార్ములా ఈ కార్ రేసింగ్ కేసులో పెద్ద మొత్తంలో నిధుల చెలామణీ, అన్యాయంగా ఆర్థిక లావాదేవీలు జరగడం వివాదంగా మారింది. ఈ వివాదంలో కేటీఆర్ ప్రధాన నిందితుడిగా ఉన్నారు. ఈ నేపథ్యంలో విచారణకు ఎప్పుడు పిలిచినా కూడా రావాలని ఏసీబీ తెలుపగా, కేటీఆర్ వస్తానని చెప్పారు. కేటీఆర్‌కు ఈ కేసులో అనేక ఆరోపణలు వచ్చాయి, అవి నిరూపించడానికి ఏసీబీ అధికారులు విచారణ చేపట్టారు. గత కొన్ని రోజులుగా ఈ కేసు చుట్టూ కీలక పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. కేటీఆర్‌ను ముగ్గురు ఏసీబీ అధికారులు ప్రశ్నించారు. అరవింద్ కుమార్, దానకిషోర్ ఇచ్చిన స్టేట్‌మెంట్స్ ఆధారంగా ఈ విచారణ జరిగింది. ఫార్ములా ఈ కార్ రేసింగ్ ప్రాజెక్టులో నియమాలను ఉల్లంఘించి రూ.55 కోట్లు ఎఫ్ఈవోకు బదిలీ చేసినట్లుగా ఆరోపణలు ఉన్నాయి. ఈ అంశంపై ఏసీబీ కేటీఆర్‌ను విచారించింది. అయితే కేటీఆర్ విచారణ సందర్భంగా న్యాయవాదికి అనుమతి ఇవ్వాలని హైకోర్టు ఇప్పటికే ఆదేశించింది. ఈ ఆదేశం ప్రకారం కేటీఆర్ విచారణను అనుసరించి, న్యాయవాది లైబ్రరీలో కూర్చోవడం ద్వారా ఏసీబీ చర్యలు తీసుకుంది. కేటీఆర్-న్యాయవాది సంభాషణలకు విజిబుల్ డిస్టెన్స్‌లో ఉండేలా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఈ విచారణ తర్వాత కేటీఆర్ స్టేట్‌మెంట్‌ను రికార్డ్ చేసేందుకు ఏసీబీ అధికారులు కేటీఆర్‌ను ఆఫీస్‌లో విచారించారు. ఆయనను ప్రధాన నిందితుడిగా పేర్కొనడం, స్టేట్‌మెంట్ రికార్డు చేయడం తదితర చర్యలు తీసుకున్నాయి. దీంతో ఈ కేసు విషయంలో తర్వాత ఎలాంటి పరిణామాలు ఉంటాయేనని రాజకీయ వర్గాలతోపాటు అనేక మంది ఆసక్తితో ఉన్నారు. ఏసీబీ విచారణ అనంతరం కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. 'పూర్తి స్థాయిలో ఏసీబీ విచారణకు సహకరించా. నాకున్న అవగాహన మేరకు ఏసీబీ అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పా. విచారణకు ఎప్పుడు పిలిచినా, ఎన్ని సార్లు పిలిచినా వచ్చి సహకరిస్తానని చెప్పా. మళ్లీ ఎప్పుడు పిలుస్తారో తెలియదు. ఇది ఒక చెత్త కేసు. రాజకీయ ఒత్తిడితో మీరు ఏం చేస్తున్నారో కూడా మీకే




తెలియడంలేదు, పూర్తిగా అసంబద్ధమైన కేసు అని అధికారులకు చెప్పాను. నాలుగైదు ప్రశ్నలనే 40 రకాలుగా అడిగారు.. కొత్తగా అడిగిందేమీ లేదు. పైసలు పంపాను అని నేనే చెబుతున్నాను.. డబ్బులు వచ్చాయని వాళ్ళు చెబుతున్నారు. ఇందులో అవినీతి ఎక్కడ జరిగిందని అడిగా' అని కేటీఆర్ తెలిపారు. కేటీఆర్ మీడియాతో మాట్లాడుతుండగా డీసీపీ విజయ్‌కుమార్ అభ్యంతరం తెలిపారు. మీడియాతో మాట్లాడితే భయమెందుకని కేటీఆర్.. డీసీపీని ప్రశ్నించారు. ట్రాఫిక్‌కు ఇబ్బంది కలుగుతుందని, ఇక్కడ మీడియా సమావేశం పెట్టవద్దని సూచించారు. పార్టీ కార్యాలయంలో ప్రెస్‌మీట్ పెట్టుకోవాలన్నారు. మీడియా ప్రతినిధులను పోలీసులు తోసేయడంతో... కేటీఆర్ అక్కడి నుంచి వెళ్లిపోయారు.అయితే పలు రకాల ప్రశ్నలనే 40 విధాలుగా అడిగారని కేటీఆర్ వ్యాఖ్యానించారు. అధికారులు అడిగిన ప్రశ్నలకు తాను చెప్పాల్సినది చెప్పినట్లు కేటీఆర్ తెలిపారు. అంతేకాదు ఈ కేసు పూర్తిగా రాజకీయ ప్రేరేపితమని, రేవంత్ చెప్పిన ప్రశ్నలనే అధికారులు అడిగారని కేటీఆర్ అన్నారు. మరోవైపు కేటీఆర్ విచారణ నేపథ్యంలో అరెస్ట్ అవుతారా అని బీఆర్ఎస్ వర్గాలు భయాందోళన చెందాయి.

## మోహన్‌బాబుకు సుప్రీంలో ఊరట

దాడి కేసులో మోహన్‌బాబుపై హత్యాయత్నం కేసు నమోదైంది. ఈ కేసుపై ముందస్తు బెయిల్ మంజూరుకు తెలంగాణ హైకోర్టు నిరాకరించింది. దీంతో ఆయన ముందస్తు బెయిల్ కోసం సుప్రీంకోర్టును ఆశ్రయించారు. దీనిపై గురువారం జస్టిస్ సుధాంశు ధులియా నేతృత్వంలోని ధర్మాసనం ముందు విచారణ జరిగింది. ఈ నేపథ్యంలో మోహన్‌బాబు ముందస్తు బెయిల్‌పై విచారణ పూర్తయ్యే వరకు ఆయనను అరెస్టు చేయవద్దంటూ న్యాయస్థానం ఆదేశాలు జారీ చేసింది. మోహన్ బాబు బెయిల్ కోసం సుప్రీం కోర్టును ఆశ్రయించారు. జర్నలిస్ట్ పై దాడి కేసులో ఆయనకు ముందస్తు బెయిల్ ఇవ్వడానికి తెలంగాణ హైకోర్టు నిరాకరించింది. హైకోర్టు నిర్ణయాన్ని సవాలు చేస్తూ మెహన్ బాబు సుప్రీంకోర్టులో పిటిషన్ వేశారు. తన వయసు 78 ఏళ్లని, గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతున్నానని అందుచేత తనకు ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని ఆయన తన పిటిషన్‌లో పేర్కొన్నారు. ఈ క్రమంలో సుప్రీం కోర్టు నుంచి తనకు సానుకూల తీర్పు వస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఆయన అనుకున్నట్టుగానే గురువారం విచారణ జరిపిన సుప్రీం కోర్టు ఈ మేరకు తీర్పు ఇచ్చింది.

## తొక్కిసలాట ఘటనపై జగన్ దిగ్భ్రాంతి

చెందడంపై ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు ఓ పత్రిక ప్రకటన విడుదల చేశారు. మృతుల కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఇలాంటి ఘటనలు చోటు చేసుకోవడం అత్యంత దురదృష్టకరమని అన్నారు. ఈ దుర్ఘటనలో గాయపడ్డవారికి మెరుగైన వైద్య సేవలు అందించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. వైకుంఠ ఏకాదశి దర్శనం కోసం వచ్చిన భక్తులు ఇలా ప్రాణాలు కోల్పోవడం అత్యంత విచార కరమని అన్నారు. తక్షణం అక్కడ పరిస్థితులను చక్కదిద్దడానికి యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న భక్తులు త్వరగా కోలుకోవాలని వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఆకాంక్షించారు. తొక్కిసలాట జరిగి భక్తులు మరణించడం తిరుపతి ఆలయ చరిత్రలోనే ఇది తొలిసారి. గాయపడ్డవారికి మెరుగైన వైద్యసేవలు అందించాలని అధికారులను కోరారు.

# మా నాయకుల రక్తం కళ్ల చూశారు

పార్టీ నాయకులు చేస్తున్న దాడి మీకే తెలియదా ? అంటూ ఎంపీ రాజేందర్ ప్రశించారు,ఇంటెలిజెన్స్ వైఫల్యమా లేక పథకం ప్రకారం చేశారా చెప్పాలి.. లేదంటే మిమ్మల్ని వదిలేది లేదని హెచ్చరించారు, పీఎం స్వయంగా అన్నారు.మీ తిట్లే మా ఆశీర్వాదాలు. మీ తిట్లకు జవాబు అభివృద్ధితో చూపిస్తామన్నారు. పరిపక్వత అంటే అది. మీలాగా చిల్లర పనులు చేసే చిల్లర నాయకులు కాదన్నారు, ఛీ ఈయననా మా సీఎం అని భావన వచ్చింది ,దీనిని డైవర్ట్ చేయడానికే ఇలాంటి దాడులు.మీ మీద ఢిల్లీ నాయకులు కూడా ఏవగింపు వచ్చింది. అపాయింట్మెంట్ కూడా ఇవ్వడంలేదట. వారి మెప్పుకోసం చిల్లర పనులు చేస్తూ చిల్లర గాడిలా వ్యవహరించవద్దని హితవు పలికారు,మా వాళ్ళు కాసం వెంకటేశ్వర్లు, ఆనంద్, నందు గాయపడ్డారు. సంపూర్ణ భాద్యత ప్రభుత్వం వహించాలి. బహిరంగ క్షమాపణ చెప్పాలి. లేదంటే నిన్ను నిలువరించడం మాకు లెక్క కాదని రాజేందర్ అన్నారు,ఈ రాష్ట్రం అభివృద్ధి కోసం.. ఇక్కడ ఏ ప్రభుత్వం ఉన్నా నిధులు మంజూరు చేస్తున్నారు. 2 వేల కోట్లతో రైల్వే స్టేషన్ అభివృద్ధి చేస్తున్నారు. కానీ చర్లపల్లి టెర్మినాల్ ఇనాగిరేషన్ కి పీఎం మీటింగ్ కి రాకుండా ఒవైసీ బ్రదర్స్ పక్కన కూర్చోపెట్టుకొని ఫ్లై ఓవర్ ఓపెనింగ్ పోవడమే కాదు.. మోడీ గారిని విమర్శస్తున్నాడు. కూట్లో రాయి తీయలేనివాడు ఏట్లో రాయి తీస్తాడట. బిఆర్ ఎస్ కూడా పోస్టర్స్ వేశారు ఏమైపోయారు. ఢిల్లీకి వెళ్లి నిధులు అడుగుతారు ఇక్కడ ఉత్తర కుమార ప్రగల్భాలు పలుకుతున్నారు. ప్రజలారా కాంగ్రెస్ వెకిలి చేష్టలు అర్థం చేసుకోండి అని బీజేపీ నేతలు అన్నారు,మేం సహనంతో ఉన్నాం. రాజ్యాంగ విలువలు పాటిస్తున్నాము. దాడులే మీ అజెండా అయితే మేముంకూడా రెడీ. బేషరుతుగా సీపీ, సీఎం క్షమాపణ చెప్పాలి సీపీ మీకు మంచి పేరుంది.. పోగొట్టుకోకండి. ఇదేనా మీ అనుభవం అని వారు ప్రశ్నిం చారు మేము దాడి చేయం.కానీ మామీద దాడి చేస్తే మాత్రం ఊరుకోమని హెచ్చరించారు,ఈ మీడియా సమావేశంలో ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి,మాజీ ఎంపీ సీతారాం నాయక్ ,మాజీ ఎంఎల్సీ రాంచందర్ రావు ,బీజేపీ ప్రధాన కార్యదర్శి ప్రేమేందర్ రెడ్డి,కళ్యాణ్ నాయక్ ,మల్లారెడ్డి ,గోలి మధుసూదన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు,

# ప్రవాసీ భారతీయ ఎక్స్‌ప్రెస్ రైలును ప్రారంభించిన ప్రధాని మోదీ

(మొదటి పేజీ తరువాయి..)

వర్చువల్‌గా ప్రధాని మోదీ ప్రారంభించారు. ఎన్‌ఆర్ఐ టూరిస్టుల కోసం ఈ రైలును స్టార్ట్ చేశారు. ఢిల్లీలోని నిజాముద్దీన్ రైల్వే స్టేషన్ నుంచి ఈ రైలు బయలుదేరింది. మూడు వారాల జర్నీ ఉంటుంది. దేశంలోని పలు సంప్రదాయ, మతపరమైన ప్రదేశాలను ఆ రైలు చుట్టివస్తుంది. ప్రవాసీ భారతీయ ఎక్స్‌ప్రెస్‌ను.. ప్రత్యేక టూరిస్టు రైలును రూపొందించారు. విదేశాల్లో ఉన్న భారతీయుల కోసం ఈ టూరిస్టు రైలు కాన్సెప్ట్‌ను డెవలప్ చేశారు. 45 ఏండ్ల నుంచి 65 ఏండ్ల మధ్య ఉన్నవారు ఈ రైలులో ప్రయాణం చేయవచ్చు. తమ చారిత్రాత్మక మూలాలను టచ్ చేసే రీతిలో ఈ రైలు రూట్‌ను క్రియేట్ చేశారు. ఢిల్లీ నుంచి బయలుదేరిన రైలు.. ఆ తర్వాత అయోధ్య చేరుకుంటుంది. అక్కడ నుంచి పాట్నా, గయా, వారణాసి, మహాబలిపురం, రామేశ్వరం, మధురై, కొచ్చి, గోవా, ఎక్తా నగర్(కేవడియా), అజ్మీర్, పుష్కర్, ఆగ్రా పట్టణాలను ఆ రైలు చుట్టువస్తుంది. ఈ రైలులో 156 మంది ప్రయాణికుల ట్రావెల్ చేసే అవకాశం ఉంటుంది. విదేశాంగ శాఖ, భారతీయ రైల్వే, ఐఆర్సీటీసీ కలిసి .. ప్రవాసీ రైలును స్టార్ట్ చేశారు. వివిధ దేశాల్లోని భారతీయ ఎంబసీల నుంచి ఈ రైలు ప్రయాణికుల కోసం దరఖాస్తు చేశారు. తక్కువ ఆదాయం ఉన్న వారికి ఈ రైలులో ప్రయాణించే అవకాశం కల్పిస్తున్నారు. విదేశాంగ శాఖ ప్రకారం.. రైలు టూరుకు చెందిన అన్ని ఖర్చులను కేంద్ర ప్రభుత్వమే భరిస్తుంది. ఆయా దేశాల నుంచి ఇండియాకు వచ్చే ప్రవాసీల రిటర్న్ విమాన ఖర్చులో 90 శాతం కూడా ప్రభుత్వమే పెట్టుకోనున్నది. ప్రయాణికులు కేవలం 10 శాతం ఛార్జీ మాత్రమే చెల్లించాల్సి ఉంటుంది. ఈ రైలులో టూర్ చేసే వారికి 4స్టార్ హొటల్ అకామిడేషన్ ఇవ్వనున్నారు. రైలు ఆవిష్కరణ గురించి మంత్రి అశ్వినీ వైష్ణవ్ ఓ ట్వీట్ చేశారు.

## సంపాదకీయం

## టిటిడి నిర్లక్ష్యానికి పరాకాష్ట !



తిరుపతిలో దారుణం జరిగింది. వైకుంఠ ఏకాదశి దర్శన టిక్కెట్ల కోసం వచ్చిన ఆరుగురు భక్తులను టిటిడి నిర్లక్ష్యం ఏకంగా వైకుంఠం చేర్చారు. వేలకోట్ల ఆదాయం..వందల్లో ఉద్యోగులు..వేలమంది పోలీసులు.. ఇంతమంది ఉన్నా కనీసం టోకెన్లు సక్రమంగా అందించడం కూడా రాని దౌర్భాగ్యం కనిపించింది. మొన్నటికి మొన్న పుష్ప సినిమా సందర్భంగా హైదరాబాద్ సంధ్య థియేటర్‌లో ఓ మహిళ మృత చెందింది. ఆమె కుమారుడు చావుబతుకుల్లో ఆస్పత్రి బెడ్‌పై పోరాడుతున్నాడు. గతంలో ఆలయాల్లో కూడా తొక్కిసలాట ఘటలను చూశాం. ఇవన్నీ గుణపాఠాలు. ఇలాంటివి చూసినప్పుడు ఎలా ఉండకూడదో నేర్చుకోవాలి. తిరుమల లాంటి ప్రదేశాల్లో మరీ అవసరం. కానీ అలా జరగడం లేదు. సాధారణ రోజుల్లో తొక్కిసలాటలే..పర్వదినాల్లో కూడా అలాగే జరిగితే ఎలా అన్నది ఆలోచన చేయాలి. అయితే వైకుంఠ ద్వార దర్శనం కోసం ముందే టిక్కెట్లు అమ్మడం లేదా, టోకెటన్లు ఇవ్వడం అన్న దౌర్భాగ్యం ఏమిటో అర్థం కాదు. ఇంతగా ప్రచారం చేసి భక్తులను రప్పించి, సరిగా ఏర్పాట్లు చేయకుండా తొక్కిసలాటకు కారణమైన టిటిడి అధికారుల నిర్లక్ష్యం ఏ మాత్రం క్షంతవ్యం కాదు. పోలీసుల ప్రేక్షక పాత్ర ఇక్కడ స్పష్టంగా కనిపించింది. ఇప్పుడు కూడా అదే కనిపించింది. టిటిడి ఛైర్మన్, ఇవో, అదనపు ఇవో ఇలా అనేకమంది నెలరోజుల ముందునుంచే అనేక రకాలుగా సమీక్షలు చేశారు. అట్టహాసం ప్రకటించారు. కానీ జరగాల్సిన నష్టం జరిగింది. వైకుంఠ ఏకాదశి సర్వదర్శన టోకెన్ల జారీలో తొక్కిసలాట జరిగి ఆరుగురు భక్తులు ప్రాణాలు కోల్పోవడం దారుణమైన ఘటనగానే భావించాలి. టోకెన్ల జారీకి తిరుపతిలోని తొమ్మిది ప్రాంతాల్లో 90 కౌంటర్లు ఏర్పాటు చేయగా... బైరాగిపట్టెడ వద్ద ఈ దారుణం జరిగింది. దైవదర్శనం కోసం వచ్చే భక్తులు రెండు రోజులముందే టోకెన్లు పొందాలని నిబంధన పెట్టడమే దారుణం. అలా కాకుండా తిరుమలలో క్యూలైన్లలో వచ్చిన వారికే దర్శనం కల్పించివుంటే ఈ దారుణం జరిగివుండేది కాదు.

తిరుపతిలో టోకెటనలు పొందాలనడమే దారుణం. క్యూలైన్లో ఉన్న భక్తులను ఒక్కసారిగి విడిచిపెట్టడంతో తోపులాట జరిగిందని, ఒకరినినొకరు తోసుకుంటూ పోవడంతో ఈ ఘటన జరిగిందని అక్కడ ఉన్నవారు చెబుతున్నారు. సరిగా భద్రత లేదని 3, 4గురు పోలీసులు ఉన్నారని.. తొక్కిసలాట జరిగినప్పుడు 20 మంది వరకు వచ్చారని తెలిపారు. నాలుగు లైన్లలో ఉన్నవారిని ఒక్కసారి వదలడంతో ఈ సమస్య వచ్చిందని అంటున్నారు. ప్రతి ఏడాది తాము వైకుంఠ ఏకాదశికి తిరుమల వస్తామని, ఇలా జరగడం ఇది మొదటిసారని భక్తులు తెలిపారు. నిజానికి ఆన్‌లైన్‌లో టిక్కెట్లు జారీ చేసినా, లేకుంటే దర్శనం కోసం నేరుగా వచ్చిన వారికి మాత్రమే టోకెన్లు జారీ చేసినా ఈ దుర్ఘటన జరిగివుండేది కాదు. కానీ అలా కాకుండ రెండ్రోజుల ముందే భక్తులు వచ్చేలా చేసి, క్యూలైన్ల వద్ద పడిగాపులు కాచేలా చేయడం ఎంతవరకు సమంజసమో టిటిడి పెద్దలు చెప్పాలి. శ్రీవారిమీద భక్తితో వేలకోట్లు టిటిడికి భక్తులు చెల్లిస్తున్నా విఐపిల సేవలు తరిస్తున్నారు. వారికే దర్శనం విషయంలో పెద్దపీట వేస్తున్నారు. కొండపైనే ఏర్పాట్లు చేసి, టోకెన్లు ఇచ్చి ఉంటే ఈ తొక్కిసలాట జరిగేదికాదు. తిరుపతిలో టిక్కెట్లు ఇవ్వడంతో భక్తుల సంఖ్య పెరిగిందని దానికి తగ్గట్టుగా పోలీసు భద్రత లేదని అరథం అవుతోంది. భక్తులను క్యూలో ఒక్కసారిగి విడిచిపెట్టకూడదని.. ఒక్కొక్క క్యూలైన్ విడిచిపెడితే తొక్కిసలాట జరిగేది కాదని కూటా అంటున్నారు. ఒకటో కంపార్టుమెంట్ నుంచి వదిలితే బాగుండేదని, అలా కాకుండా 4, 5 క్యూలైన్లు విడిచిపెట్టారని దీంతో అంతా ఒకేసారి రావడంతో తోపులాట జరిగిందని భక్తులు తెలిపారు. ఒక్కసారిగా గేట్ తీసినప్పుడు భక్తులంతా తోసుకుని వచ్చారని.. తెలిపారు. పురుషులు కూడా మహిళలు, పిల్లలు ఉన్నారని చూసుకోవడం లేదని తోసుకుంటూ వచ్చారని అర్థం అవుతోంది. నిజానికి శ్రీవారి దర్శనం కోసం వచ్చే భక్తుల విషయంలో ఆదినుంచీ టిటిడిది నిర్లక్ష్యమే. వేలమంది వస్తుంటే అందుకు తగ్గట్లుగా ఏర్పాట్లు చేయకుండా..విఐపిలను ప్రసన్నం చేసుకునే పనిలో ఉంటున్నారు. గురువారం అర్ధరాత్రి నుంచి తిరుమలలో వైకుంఠ ద్వారాలు తెరుచుకోనున్నాయి. దీని కోసం టీటీడీ విస్తృత ఏర్పాట్లు చేసిందని చెబుతోంది. తిరుపతిలో ఏర్పాటు చేసిన కేంద్రాల్లో గురువారం తెల్లవారుజామున 5 గంటల నుంచి టోకెన్లను జారీ చేయాలని టీటీడీ యంత్రాంగం తొలుత నిర్ణయించింది. అయితే... బుధవారం మధ్యాహ్నం నుంచే కేంద్రాల వద్దకు భారీగా భక్తులు తరలి రావడం మొదలైంది. రాత్రి 8 గంటలకు ఒత్తిడి మరింత పెరిగింది. క్యూలైన్లలోకి రాత్రి 9 గంటల నుంచి భక్తులను పంపించడం మొదలుపెట్టారు. దీంతో కేంద్రాల వెలుపల నిరీక్షిస్తున్న భక్తులు క్యూలైన్లలో ప్రవేశించడానికి ప్రయత్నించే క్రమంలో తొక్కిసలాటలు జరిగాయి. మరీ ముఖ్యంగా... బైరాగిపట్టెడ, విష్ణు నివాసం, ఇందిరా మైదానం కేంద్రాల వద్ద తొక్కిసలాటలు జరిగాయి. ఈ ఘటనలో ఆరుగురు భక్తులు మృతిచెందగా.. పలువురు గాయపడ్డరు. వారిని రుయా ఆస్పత్రికి తరలించారు. నిజానికి ఇక్కడ భక్తులను అదుపు చేయడానికి అవసరమైన ఏర్పాట్లు కానీ, తగిన పోలీసు సిబ్బంది కానీ లేదని అర్థం అవుతోం. వైకుంఠద్వార దర్శనం టోకెన్ల కోసం పెద్ద సంఖ్యలో భక్తులొస్తారని తెలిసీ.. అందుకు తగ్గట్లు ఎందుకు ఏర్పాట్లు చేయలేదని స్పష్టంగా తెలుస్తోంది. విధుల్లో అత్యంత అప్రమత్తంగా ఉండాల్సిన బాధ్యత లేకుండా టిటిడి అధికారులు వ్యవహరించారు. ఉన్నతస్థాయి దర్యాప్తు జరిపి, బాధ్యతారాహిత్యంగా వ్యవహరించిన అందరిపైనా కఠిన చర్యలు తీసుకోవాల్సి ఉంది. ఇకపోతే సాధారణ రోజుల్లో కూడా తిరుమలలో కంపార్టుమెంట్లలో కూచోబెట్టడం, ఒక్కసారిగా వదలడం, తోపులాట జరిగేలా చేస్తున్నారు. తిన్నగా భక్తులు స్వామిని దర్శించుకునే పరిస్థితి లేదు. తిరుమల విధానాల్లో సంస్కరణలు రావాలి. నేరుగా వచ్చే భక్తులు దర్శనం చేసుకునే వెసలుబాటు ఉండాలి. ఆన్‌లైన్‌తో పాటు, ఆఫ్‌లైన్ విధానం బలపడాలి. శ్రీవాణి టిక్కెట్లు పొందిన భక్తులను కూడా క్యూలో తోసేస్తున్నారు. వారు టిక్కుట్లు పొందాక సరైన వసతి కల్పించడం లేదు. వసతి కోసంమరోచోటికి పరుగెత్తాలి. అక్కడ రాజముద్ర వేసుకున్నాక మరోచోటికి పరుగెత్తాలి. ఇలాంటి గందరగోళం లేకుండా సింగిల్ విండో విధానంలో దర్శనం, వసతి టిక్కెట్లు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలి. అలాగే తాజా దుర్ఘటన నేపథ్యంలో తిరుమలలో సంస్కరణలకు శ్రీకారం చుట్టాలి.

# తిరుపతి ఘటనపై భిన్న వాదనలు

### డిఎస్పీ అత్యుత్సాహంతోనే ఘటన

### తగినంత మంది పోలీస్ సిబ్బంది లేకపోవడంతో దుర్ఘటన



తిరుపతి,జనవరి 9 : పవిత్ర వైకుంఠ ఏకాదశి రోజున తిరుమల శ్రీవారిని దర్శించుకోవాలని భావించిన వారు టోకెన్లు తీసుకునే లోపే తొక్కిసలాటలో ప్రాణాలు కోల్పోయారు. గతంలో ఎన్నడూ లేని విధంగా తిరుపతిలో జరిగిన తొక్కిసలాట ఘటన అందరినీ తీవ్రంగా కలిచివేసింది. అసలు ఈ దుర్ఘటనకు సంబంధించి తప్పు ఎవరిదనే దానిపై భిన్న వాదనలు వినిపిస్తున్నాయి. టోకెన్లు తమ వరకూ రావేమో అని కొందరు భక్తులు అత్యుత్సాహం ఓ కారణమంటూ కొందరు వాదిస్తున్నారు. అయితే, అధిక సంఖ్యలో భక్తులు వస్తారని తెలిసినా తగిన రీతిలో అధికారులు, పోలీసులు ఏర్పాట్లు చేయలేదని కొందరు విమర్శిస్తున్నారు. పోలీసుల అత్యుత్సాహం కూడా దీనికి కారణమని భావిస్తున్నారు. ఓ సెంటర్ వద్ద భక్తురాలు అస్వస్థతకు గురి కావడంతో డీఎస్పీ గేట్లు తెరవడంతోనే తోపులాట జరిగిందని ఇప్పటికే టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు ప్రకటించారు. మరోవైపు, ఈ ఘటనపై సీఎం చంద్రబాబుకు అధికారులు నివేదిక అందజేశారు. 'తొక్కిసలాట జరిగినా డీఎస్పీ సరిగా స్పందించలేదు. ఎస్పీ వెంటనే సిబ్బందితో వచ్చి భక్తులకు సాయం చేశారు. అంబులెన్స్ వాహనాన్ని టికెట్ కౌంటర్ బయట పార్క్ చేసి డ్రైవర్ వెళ్లిపోయాడు. 20 నిమిషాలైనా అతను అందుబాటులోకి రాలేదు. డీఎస్పీ, అంబులెన్స్ డ్రైవర్ నిర్లక్ష్యం వల్లే భక్తులు చనిపోయారు.' అని అధికారులు నివేదికలో పేర్కొన్నారు. ఈ ఘటనలో గాయపడ్డ క్షతగాత్రులను టీటీడీ ఛైర్మన్ సహ ఈవో, జేఈవో, ఇతర అధికారులు పరామర్శించారు. బాధితులకు మెరుగైన వైద్యం అందించేలా అక్కడే ఉండి పర్యవేక్షిస్తున్నారు. 48 మంది గాయపడగా.. 40 మందిని డిశ్చార్జి చేసినట్లు తెలుస్తోంది. మిగిలిన 8 మంది చికిత్స పొందుతున్నారు. తిరుపతిలోని 8 కేంద్రాల వద్ద స్లాటెడ్ సర్వదర్శనం టోకెన్ల జారీకి అధికారులు ఏర్పాట్లు చేయగా.. ఈ నెల 10, 11, 12 తేదీలకు సంబంధించి మొత్తం 1.20 లక్షల టోకెన్లు జారీ చేయనున్నట్లు ప్రకటించారు. గురువారం ఉదయం 5 గంటలకు టోకెన్లు జారీ చేస్తామని తెలపగా.. బుధవారం ఉదయం నుంచే రాష్ట్రంతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో క్యూలైన్లలో వేచి ఉన్నారు. బైరాగిపట్టెడలోని రామానాయుడు పాఠశాల వద్ద తాకిడి తక్కువగా ఉంటుందని భావించిన భక్తులు బుధవారం ఉదయం పదింటికే అక్కడికి చేరుకున్నారు. రాత్రికి పరిసర ప్రాంతాలన్నీ రద్దీగా మారాయి. దీంతో పోలీసులు పక్కనే ఉన్న పద్మావతి పార్కులోకి భక్తులను వదిలి.. రాత్రి 8:20 గంటలకు క్యూలైన్‌లోకి అనుమతించారు. ఈ క్రమంలో తోపులాట జరగ్గా.. కొంతసేపు భక్తులను నిలిపేసి సహాయ చర్యలు చేపట్టారు. దీంతో ప్రాణనష్టం తగ్గింది. గాయపడ్డ భక్తులను అంబులెన్సులో పోలీసులు రుయా, స్విమ్స్ ఆస్పత్రులకు తరలించారు. ఈ కేంద్రం వద్ద బారికేడ్లు ఏర్పాటు చేయకపోవడంపైనా విమర్శలు వస్తున్నాయి. భక్తులను పార్కులో ఉంచి ఒకేసారి అనుమతించడంతో ప్రాణనష్టం జరిగిందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. టీటీడీ అధికారులు ఏర్పాట్లలో విఫలమయ్యారని భక్తులు ఆరోపిస్తున్నారు. మధ్యాహ్నం 2 గంటలు – భక్తులతో నిండిన పార్కు అదుపు చేసేందుకు పోలీసులు అక్కడికి భారీగా చేరుకున్నారు. ÷ాయంత్రం 7 గంటలకు – పార్కు పూర్తిగా నిండిపోవడంతో ఎవరూ ఎటూ కదల్లేని పరిస్థితి నెలకొంది. ÷ాత్రి 8:20 – పార్కు నుంచి టికెట్ల జారీ కౌంటర్లోకి అనుమతించడంతో భక్తుల మధ్య తోపులాట జరిగింది. ఒక్కసారిగా తోసుకుని రావడంతో ప్రాణ నష్టం జరిగింది. రాత్రి 8:40 – సంఘటన స్థలానికి చేరుకున్న అంబులెన్సులు.. తిరుపతి స్విమ్స్, రుయా ఆస్పత్రులకు క్షతగాత్రులను తరలించారు. ఎస్పీ సుబ్బారాయుడు సిబ్బందితో అక్కడికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. తిరుపతి తొక్కిసలాట ఘటనతో తీవ్ర విషాదం నెలకొంది. బుధవారం రాత్రి ఎటుచూసినా బాధితుల ఆర్తనాదాలు, బాధితులకు పోలీసులు, స్థానిక భక్తులు సీపీఆర్ చేసిన దృశ్యాలే కనిపించాయి. వైకుంఠ ద్వార దర్శన టోకెన్ల కేంద్రాల వద్ద జరిగిన దుర్ఘటనలో ఆరుగురు మృతి చెందగా.. 48 మందికి గాయాలయ్యాయి. అయితే, ఘటనకు పోలీసుల, అధికార యంత్రాంగం నిర్లక్ష్యం కూడా కారణమని.. సరైన ఏర్పాట్లు చేయలేదని భక్తులు ఆరోపిస్తున్నారు. తిరుపతిలోని 8 కేంద్రాల వద్ద స్లాటెడ్ సర్వదర్శనం టోకెన్ల జారీకి అధికారులు ఏర్పాట్లు చేశారు. ఈ నెల 10, 11, 12 తేదీలకు సంబంధించి మొత్తం 1.20 లక్షల టోకెన్లు జారీ చేయనున్నట్లు ప్రకటించారు. గురువారం ఉదయం 5 గంటలకు టోకెన్లు జారీ చేస్తామని తెలపగా.. బుధవారం ఉదయం నుంచే రాష్ట్రంతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో క్యూలైన్లలో వేచి ఉన్నారు. బుధవారం సాయంత్రానికి భక్తుల రద్దీ మరింత పెరిగింది. జీవకోన, బైరాగిపట్టెడ, శ్రీనివాసం, అలిపిరి ప్రాంతాల్లో తొక్కిసలాట జరిగింది. తొలుత జీవకోన వద్ద ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వద్ద స్వల్ప తోపులాట జరగ్గా.. రాత్రి 7 గంటల సమయంలో భక్తులు క్యూలైన్లలోకి ప్రవేశించబోయారు. పోలీసులు అడ్డుకునేందుకు యత్నించినా ఒకరినొకరు తోసుకుంటూ లోపలికి వెళ్లే క్రమంలో తోపులాట జరిగింది.

ఎస్పీ సుబ్బారాయుడు అక్కడికి వెళ్లి పరిస్థితి అదుపులోకి తెచ్చారు. ఇక్కడ పరిస్థితి అదుపులోకి వచ్చిందని భావిస్తుండగానే.. ఎక్కువ మంది భక్తులుండడంతో అధికారులు వారిని పక్కనే ఉన్న శ్రీ పద్మావతి పార్కులోకి అనుమతించారు. బుధవారం రాత్రి 8:15 గంటల సమయంలో పార్కులో ఉన్న ఓ వ్యక్తి అస్వస్థతకు గురి కావడంతో ఆయనకు వైద్యం అందించేందుకు అధికారులు గేట్లు తెరవబోయారు. అయితే, క్యూలైన్లలోకి వదిలేందుకే గేట్లు తెరుస్తున్నారని భావించిన కొందరు ఒక్కసారిగా దాన్ని బలంగా తోసుకుని ముందుకెళ్లే ప్రయత్నం చేశారు. దీంతో చాలామంది భక్తులు కింద పడిపోయారు. ఈ క్రమంలో ఊపిరాడక పలువురు తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. పోలీసులు క్షతగాత్రులను అంబులెన్సులో రుయా, స్విమ్స్ ఆస్పత్రులకు తరలించారు. ఆస్పత్రికి వెళ్లే సమయానికే నలుగురు మృతి చెందినట్లు వైద్యాధికారులు తెలిపారు. బైరాగిపట్టెడ వద్ద జరిగిన ఘటనలోనే ఆరుగురు చనిపోయారు. అటు, సమాచారం అందుకున్న వెంటనే టీటీడీ ఈవో శ్యామలరావు, జేఈవోలు వీరబ్రహ్మం, గౌతమి, ఎస్పీ సుబ్బారాయుడు, నగరపాలక సంస్థ కమిషనర్ మౌర్య ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు పర్యవేక్షించారు. గతంలో బారికేడ్లను ఏర్పాటు చేసి అక్కడ పరిస్థితిని అనుసరించి భక్తులను క్యూలైన్లలోకి అనుమతించేవారు. ఎన్నడూ లేని విధంగా బైరాగిపట్టెడ టోకెన్ల కేంద్రం వద్ద ఉన్న పార్కులోకి భక్తులను అనుమతించారు. బుధవారం మధ్యాహ్నం నుంచి అక్కడే కూర్చుని ఉండడంతో పలువురు అస్వస్థతకు గురయ్యారు. పార్కులో ఎక్కువ మంది ఉండడం.. వారంతా ఒక్కసారిగా వెలుపలికి వచ్చేందుకు గేటును తోయడంతో కిందపడిపోయారు. ఇదే తొక్కిసలాటకు దారి తీసిందని సమాచారం.



## తొక్కిసలాట ఘటనపై మంత్రుల విచారం

### ఆస్పత్రిలో క్షతగాత్రులకు పరామర్శలు

### మృతుల కుటుంబాలకు 25 లక్షల చొప్పన పరిహారం

తిరుపతి,జనవరి 9 : తిరుపతి తొక్కిసలాట ఘటనపై రాష్ట్ర మంత్రులు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. వైకుంఠ ఏకాదశికి ముందు ఇలాంటి ఘటన దురదృష్టకరమని మంత్రులు అన్నారు. తిరుపతి తొక్కిసలాటలో మృతిచెందిన వారికి ఏపీ ప్రభుత్వం ఎక్స్‌గ్రేషియా ప్రకటించింది. ఒక్కో కుటుంబానికి రూ.25 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా ఇవ్వనున్నట్లు రెవెన్యూ మంత్రి అనగాని సత్య ప్రసాద్ తెలిపారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యసేవలు అందిస్తామని మంత్రి వెల్లడించారు. తిరుపతి ఘటనలో మృతి చెందిన వారి కుటుంబసభ్యులను రుయా ఆస్పత్రి వద్ద రాష్ట్ర మంత్రులు అనగాని సత్యప్రసాద్, వంగలపూడి అనిత, పార్థసారథి, ఆనం రామనాయణ రెడ్డి పరామర్శించారు. అనంతరం స్విమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను మంత్రులు పరామర్శించారు. ఆపై మంత్రులు మీడియాతో మాట్లాడుతూ.. బాధితులకు ప్రభుత్వం అండంగా ఉంటుందని మంత్రులు భరోసా ఇచ్చారు. ఒక్కో కుటుంబానికి రూ.25 లక్షల పరిహారం ఇవ్వనున్నట్లు మంత్రి అనగాని తెలిపారు. హోంమంత్రి అనిత మాట్లాడుతూ.. తిరుపతి ఘటనలో కుట్ర కోణం ఉందా? అనే కోణంలోనూ పరిశీలిస్తున్నామని అన్నారు.

బాధ్యులపై కఠిన చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు. అలాగే బాధ్యతారాహిత్యంగా పనిచేసిన వారిపై చర్యలు తప్పవని హోంమంత్రి అనిత హెచ్చరించారు. ఈ ఘటనలో మృతి చెందిన వారి మృతదేహాలకు పోస్టుమార్టం పూర్తి అయిన అనంతరం సొంతూర్లకు పంపుతామని, అలాగే గాయపడిన వారికి మెరుగైన చికిత్సకు చర్యలు తీసుకుంటున్నామని మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి వెల్లడించారు. కాగా.. వైకుంఠ ఏకాదశి సందర్భంగా సాధారణ భక్తులకు వైకుంఠ ద్వార దర్శనం కల్పించేందుకు ఏర్పాటు చేసిన టోకెన్ కేంద్రాల వద్ద తొక్కిసలాట తీవ్ర విషాదాన్ని నింపింది. తొక్కిసలాటలో ఊపిరాడక అనేక మంది అల్లాడిపోయారు. ఈ ఘటనలో ఆరుగురు మృత్యువాత పడగా.. చాలా మంది గాయపడ్డారు. క్షతగాత్రులు ప్రస్తుతం రుయా, స్విమ్స్ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. మరోవైపు మృతదేహాలకు పోస్టుమార్టం పూర్తి అవడంతో.. వారి వారి స్వగ్రామాలకు ప్రత్యేక అంబులెన్స్‌లో పోలీసులు తరలించారు. అలాగే తొక్కిసలాటపై తిరుపతి పోలీసులకు తహసీల్దార్ ఫిర్యాదు చేశారు. బైరాగిపట్టడి రామానాయుడు స్కూల్ దగ్గర జరిగిన ఘటనపై సమగ్ర విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ కోరారు.

## తొక్కిసలాట క్షతగాత్రులకు ఇవో పరామర్శ

### ఘటనప విచారణ జరుగుతోందని వెల్లడి

తిరుపతి,జనవరి 9 : తిరుపతిలో జరిగిన తొక్కిసలాట ఘటనలో గాయపడి పద్మావతి మెడికల్ కళాశాలలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను టీటీడీ ఈవో శ్యామలారావు గురువారం ఉదయం పరామర్శించారు. క్షతగాత్రుల పరిస్తితిపై వైద్యుల బృందంతో ఈవో ఆరా తీశారు. అనంతరం ఈవో మీడియాతో మాట్లాడుతూ... తొక్కిసలాట ఘటనలో ఆరుగురు మృతి చెందారని.. దాదాపు 41 మంది గాయపడ్డారన్నారు. వారిలో ఇప్పటికే 21 మందిని డిశ్చార్జ్ చేశారని తెలిపారు. ఘటనకు కారణం ఏంటనేది విచారిస్తున్నామని తెలిపారు. డీఎస్పీ గేట్లు తెరవడం వల్లే ఘటన జరిగినట్లు ప్రాథమికంగా తెలిసిందన్నారు. పూర్తి వివరాలు విచారణలో తెలియాల్సి ఉందని అన్నారు. బాధితులను పరామర్శించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు రానున్నట్లు టీటీడీ ఈవో శ్యామలరావు వెల్లడించారు. భక్తుల ఆరోగ్యం పరిస్థితిని స్విమ్స్ సూపరింటెండెంట్ రవికుమార్ వివరించారు. అందరికీ చికిత్స అందిస్తున్నామని.. ఈ రోజు సాయంత్రానికి చాలా మందిని డిశ్చార్జ్ చేస్తామని తెలిపారు. ముగ్గురు మాత్రం మరో రెండు మూడు రోజుల పాటు అబ్జర్వేషన్‌లో ఉండాల్సి ఉంటుందని సూపరింటెండెంట్ రవికుమార్ పేర్కొన్నారు. వైకుంఠ ఏకాదాశి సందర్భంగా వైకుంఠ ద్వార దర్శనాల కోసం ఏర్పాటు చేసిన టోకెన్ కౌంటర్ల వద్ద తీవ్ర విషాదం చోటు చేసుకుంది. కౌంటర్ కేంద్రాల వద్ద అర్ధరాత్రి తొక్కిసలాట జరగడంతో ఆరుగురు భక్తులు మృతి చెందారు. వారిలో ఐదుగురు మహిళలే ఉన్నారు. బుధవారం రాత్రి గేట్లు తెరవగా భక్తులు ఒక్కసారిగా దూసుకొచ్చారు. దీంతో మూడు కౌంటర్ కేంద్రాల వద్ద తొక్కిసలాట చోటు చేసుకుంది. తొక్కిసలాటలో ఆరుగులు భక్తులు మృత్యువాత పడగా.. అనేక మంది గాయపడ్డారు. వెంటనే వారిని రుయా, స్విమ్స్ ఆస్పత్రులకు తరలించారు. తొక్కిసలాటలో ఊపరాడక అనేక మంది మహిళలు అల్లాడిపోయారు.

## టిటిడి నిర్లక్ష్యమే కొంప ముంచింది

### మృతుల కుటుంబాలకు కోటి పరిహారం ఇవ్వాలి

### మాజీ ఛైర్మన్ భూమన కరుణాకర్ డిమాండ్

తిరుపతి,జనవరి 9 : తిరుపతిలో జరిగిన తొక్కిసలాట ఘటనలో టీటీడీ విజిలెన్స్, పోలీసుల వైఫల్యమే కారణమని టీటీడీ మాజీ ఛైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి ఆరోపించారు . తిరుమలలో వైకుంట ద్వార దర్శనం సందర్భంగా తిరుపతిలో ఏర్పాటు చేసిన టోకెన్ల జారీ కేంద్రంలో జరిగిన తొక్కిసలాటలో ఆరుగురు చనిపోగా 48 మంది గాయపడ్డారు. ఈ ఘటనపై ఆయన గురువారం తిరుపతిలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. వేలాది మంది భక్తులు టోకెన్ల కోసం కేంద్రాలకు రాగా కొద్ది మంది మాత్రమే అక్కడ పోలీసులు ఉండడంతో భక్తులను నియంత్రించలేకపోయారని ఆరోపించారు. వైకుంఠ ఏకాదశికి ఏర్పాట్లపై నెలరోజులుగా రోజుకో సమీక్షను నిర్వహించి చివరకు చేతులెత్తేయడంతో ఘటన జరిగిందని విమర్శించారు. పనిచేసేవారు తక్కువై, పర్యవేక్షించే వారు ఎక్కువయ్యారని పేర్కొన్నారు. చంద్రబాబుకు ఆర్భాటం ఎక్కువ, ఆచరణ తక్కువ ఉంటుందని ఎద్దేవా చేశారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో టీటీడీ సమర్థవంతంగా పనిచేసిందని గుర్తు చేశారు. భక్తులకు మేలైన నిర్ణయాలే తీసుకున్నామని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా చర్యలు తీసుకున్నామని వివరించారు. ప్రస్తుత టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు టీటీడీని రాజకీయ క్రీడా మైదానంగా మార్చివేశారని దుయ్యబట్టారు. ఇది ముమ్మాటికి ప్రభుత్వ తప్పిదమేనని అన్నారు. మృతుల కుటుంబాలకు రూ. కోటి, క్షతగాత్రులకు రూ. 20 లక్షల పరిహారాని చెల్లించాలని డిమాండ్ చేశారు. సనాతన ధర్మాన్ని రక్షిస్తామన్న పవన్‌కల్యాణ్ ఇప్పుడేం సమాధానం చెబుతారని ప్రశ్నించారు.

# పవిత్ర పరమ దినం ముక్కోటి ఏకాదశి



ఏడాదికి 24 ఏకాదశులు వస్తాయి. సూర్యుడు ఉత్తరాయణానికి మారే ముందు వచ్చే ధనుర్మాస శుద్ధ ఏకాదశినే వైకుంఠ ఏకాదశి లేదా ముక్కోటి ఏకాదశి అంటారు. సూర్యుడు ధనుస్సులో ప్రవేశించిన అనంతరం మకర సంక్రమణం వరకు జరిగే 'మార్గం' మధ్య ముక్కోటి ఏకాదశి వస్తుంది. ఈ రోజున వైకుంఠ వాకిళ్లు తెరుచుకొని ఉంటాయని వైష్ణవాలయాలలో గల ఉత్తర ద్వారం వద్ద భక్తులు తెల్లవారుజామునే భగవద్దర్శనార్థం వేచి ఉంటారు. ఈ రోజు మహావిష్ణువు గరుడ వాహనారూఢుడై మూడు కోట్ల దేవతలతో భూలోకానికి దిగివచ్చి భక్తులకు దర్శనమిస్తాడు కనుక దీనికి ముక్కోటి ఏకాదశి అనే పేరు వచ్చిందంటారు. ఈ ఒక్క ఏకాదశి మూడు కోట్ల ఏకాదశులతో సమమైన పవిత్రతను సంతరించుకున్నందువల్ల దీన్ని ముక్కోటి ఏకాదశి అంటారని కూడా చెబుతారు. ముక్కోటి ఏకాదశి నాడే హాలాహలం, అమృతం రెండూ పుట్టాయి. ఈ రోజునే శివుడు హాలాహలం మింగాడు. మహాభారత యుద్ధంలో భగవద్గీతను కృష్ణుడు అర్జునునికి ఇదే రోజున ఉపదేశించాడని విశ్వాసం ఉంది. ఈ రోజున వైష్ణవ ఆలయాల్లో ప్రత్యేక పూజలు, హోమాలు, ప్రవచనాలు, ప్రసంగాలు ఉంటాయి. ఈ రోజున ముఖ్యమైనవి ఉపవాసం, జాగరణ. అటు తర్వాత జపం, ధ్యానం. విష్ణుపురాణం ప్రకారం ఇద్దరు రాక్షసులు తనకు వ్యతిరేకంగా ఉన్నా మహావిష్ణువు వారి కోసం తన వైకుంఠ ద్వారాలను తెరిచాడనీ, తమ కథ విని, వైకుంఠ ద్వారం గుండా వస్తున్న విష్ణు స్వరూపాన్ని చూసిన వారికి వైకుంఠం ప్రవేశం కల్పించాలనీ వారు కోరారు. అందుచేతనే ఆ రోజును వైకుంఠ ద్వారాన్ని తలపించే విధంగా వైష్ణవ ఆలయాల్లో ద్వారాలను ఏర్పాటు చేస్తారు. మామూలు రోజుల్లో దేవాలయాల ఉత్తర ద్వారాలు మూసి ఉంచుతారు. కానీ ఈ రోజు భక్తులు ఆ ఉత్తరద్వారం గుండా వెళ్ళి దర్శనం చేసుకొంటారు. తిరుపతిలో కూడా ఈ రోజును వైకుంఠద్వారం పేరిట ఉన్న ప్రత్యేక ద్వారాన్ని తెరిచి ఉంచుతారు. పద్మ పురాణం ప్రకారం విష్ణువునుంచి ఉద్భవించిన శక్తి ముర అనే రాక్షసుడిని సంహరించిన రోజు వైకుంఠ ఏకాదశి. ముర అనే రాక్షసుడి దురాగతాలు భరించలేక దేవతలు విష్ణువు శరణువేడగా ఆయన వాడితో తలపడి వాడిని సంహరించేందుకు ప్రత్యేక అస్త్రం కావాలని గ్రహించి బదరికాశ్రమంలోని హైమావతి గుహలోకి ప్రవేశించాడు. అక్కడ విశ్రమిస్తున్న విష్ణువును ముర సంహరించేందుకు ప్రయత్నించగా ఆయన నుంచి ఒక శక్తి ఉద్భవించి తన కంటి చూపుతో మురను కాల్చి వేసింది. అప్పుడు విష్ణువు సంతసించి ఆమెకు ఏకాదశి అని పేరు పెట్టి వరం కోరుకోమని చెప్పాడు. ఆ రోజున ఉపవాసం ఉన్న వారి పాపాలను పరిహరించాలని ఆమె కోరింది. ధనుర్మాస శుక్ల ఏకాదశి రోజున ఉపవాసం ఉన్న వారికి వైకుంఠప్రాప్తి కలుగుతుందని విష్ణువు వరమిచ్చాడు. వైకుంఠ ఏకాదశి రోజు ముర బియ్యంలో దాక్కుంటాడని, అందుకే బియ్యంతో చేసిన ఏ పదార్థం తినకుండా ఉండాలని అంటారు. ఈ రోజున ఉపవాసం ఉంటే మిగతా 23 ఏకాదశులు ఉపవాసం ఉన్నట్టే అని విష్ణుపురాణం చెబుతోంది. ముర అంటే తామసిక, రాజసిక గుణాలకు, అరిషడ్వర్గాలకు ప్రతీక. వీటిని ఉపవాస జాగరణల ద్వారా జయిస్తే సత్వ గుణం లభించి తద్వారా ముక్తికి మార్గం ఏర్పడుతుంది. వరి అన్నంలో ముర నివాసం ఉంటాడు కనుక మందబుద్ధిని ఇచ్చిని జాగురూకతను దెబ్బతీస్తాడని అంతరార్థం. ఏకాదశినాడు ఉపవాసం ఉండి, ద్వాదశినాడు అన్న దానం చేస్తారు. ఒకరోజు భోజనం చేయక తరువాతి రోజు చేయడం వలన జిహ్వకు భోజనం రుచి తెలుస్తుంది. గీతోపదేశం జరిగిన రోజు కనుక 'భగవద్గీత' పుస్తకదానం చేస్తారు. **వైకుంఠ ఏకాదశి పేరు:** వైకుంఠ ఏకాదశి అనే పేరులో వైకుంఠ, ఏకాదశి అని రెండు పదాలున్నాయి. వైకుంఠ శబ్దం ఆకారాంత పుంలింగం. ఇది విష్ణువునూ, విష్ణువుండే స్థానాన్ని కూడా సూచిస్తుంది. చాక్షుస మన్వంతరంలో వికుంఠ అనే ఆమె నుండి అవతరించినందున విష్ణువు "వైకుంఠః" (వైకుంఠుడు) అయ్యాడు. అదేకాక జీవులకు నియంత, జీవులకు సాక్షి, భూతముల స్వేచ్ఛావిహారాన్ని అణచేవాడు – అని అర్థాలున్నాయి.

## రెండేళ్ల నుండి యాక్సిడెంట్ ఫ్రీ డిపోగా మంథని బస్ డిపో

**–మంథని డిపో మేనేజర్ శ్రావణ్ కుమార్**



మంథని జనవరి 09: మంథని బస్సు డిపో గత 2 సంవత్సరాలుగా ఆక్సిడెంట్ ఫ్రీ డిపో గా గుర్తించారని మంథని డిపో మేనేజర్ శ్రావణ్ కుమార్ తెలిపారు. జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాలను పురస్కరించుకొని గురువారం మంథని ఆర్టీసీ డిపో లో మైంటెనెన్సు డే నిర్వహించారు. ఇందులో భాగంగా డిపో మేనేజర్ శ్రావణ్ కుమార్ మైంటెనెన్సు సిబ్బందిని ఉద్దేశించి బస్సులను స్టీరింగ్ మరియు బ్రేక్ విషయంలో లోపములు లేకుండా తగు జాగ్రత్తలను తీసుకొని నిర్వహించాలని దీని ద్వారా ఆక్సిడెంట్ లను నివారించ వచ్చని అన్నారు.మెరుగైన సేవలను అందించినందు కు ఆర్. రమేష్ మెకానిక్, కె. సంపత్ శ్రామిక్ లను సన్మానించారు ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ ఏంజెల్, ఆఫీస్ సూపరిడెంట్ ఎల్. ఆర్. రెడ్డి, ఎల్ హెచ్ శ్రీనివాస్, హెడ్ కాన్స్టేబుల్ వెంకటేశ్వర్లు, ఏ డి సి లు, మైంటెనెన్సు సిబ్బంది పాల్గొన్నారు.



# తెలుగు రాష్ట్రాల్లో చర్చ.. ఎవరు బెటర్...

హైదరాబాద్, జనవరి 9, : ఎన్నికల సమయంలో అన్నిరాజకీయ పార్టీలు అలివి కాని హామీలు ఇస్తాయి. ఆ హామీలను విని ప్రజలు పట్టం కడతారు. తర్వాత అధికారంలోకి వచ్చిన తర్వాత ఇచ్చిన హామీల అమలు విషయంలో అధికార పార్టీ గత ప్రభుత్వం పై నెపం నెట్టే ప్రయత్నం చేస్తుంది. అది ఆంధ్రప్రదేశ్ అయినా.. తెలంగాణ అయినా ఒక్కటే. గత ప్రభుత్వాలు చేసినఅప్పుల కారణంగా తాము సంక్షేమ పథకాలను అమలు చేయలేకపోతున్నామని అక్కడ చంద్రబాబు, ఇక్కడ రేవంత్ రెడ్డి పదే పదే చెబుతున్నారు. ప్రజలకు అవన్నీ అనవసరం. ఎన్నికలకు ముందు అప్పుల గురించి ముందే తెలిసినా ఎన్నికల ప్రచారంలో మాత్రం హామీలు ఇచ్చి ఇప్పుడు కోత పెట్టడం పై ప్రజలు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ ఎన్నికలకు ముందు టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు తాము అధికారంలోకి వస్తే రైతులకు అన్నదాత సుఖీభవ పథకం కింద ఏడాదికి ఇరవై వేల రూపాయల పెట్టుబడి సాయం అందిస్తామని చెప్పారు. అయితే కేంద్ర ప్రభుత్వం ఇచ్చే పది వేల రూపాయలతో కలిపి తాము పది వేలు కలిపి అన్నదాత సుఖీభవ పథకం కింద త్వరలోనే రైతులకు సాయం అందిస్తామని మంత్రివర్గ సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. గత వైసీపీ ప్రభుత్వం కూడా అదే మాదిరి నాడు కేంద్ర ప్రభుత్వం ఇచ్చే నిధులను కలిపి రాష్ట్ర నిధులను చేర్చిరైతులు సాయం అందచేసింది. ఇప్పుడు చంద్రబాబు కూడా అదే తరహాలో రైతు లకు పెట్టుబడి సాయాన్ని పదివేలు కేంద్రం ఇస్తే పది వేలు ప్రభుత్వం ఇస్తామని ప్రకటించడం ఎంతవరకూ సబబని ప్రశ్నిస్తున్నారు. ఇక్కడే పదివేల రూపాయలు కోత పెట్టారని రైతులు అంటున్నారు.నాడు వైసీపీ ప్రభుత్వం కూడా అప్పట్లో ఆరువేలు కేంద్ర ప్రభుత్వ నిధులు, రాష్ట్ర ప్రభుత్వం మరో ఆరు వేల రూపాయలను కలిపి పన్నెండు వేల రూపాయలను రైతులకు చెల్లించేది. కానీ చంద్రబాబు ఇరవై వేల రూపాయలు సాయం చేస్తామని ప్రకటించడంతో గత ఎన్నికల్లో రైతులందరూ కూటమి ప్రభుత్వం వైపు మొగ్గు చూపారు. దీంతో అధికారంలోకి వచ్చిన తర్వాత కేవలం చంద్రబాబు తమ ప్రభుత్వం నుంచి పదివేల రూపాయలను మాత్రమే రైతులకు ఇవ్వడమేంటన్న ప్రశ్నఎదురవుతుంది. పీఎం కిసాన్ సమ్మాన్ పథకం కింద కేంద్ర ప్రభుత్వం ఇటీవల ఒక్కసారిగా పదివేల రూపాయలకు పెంచింది. ఒకవేళ కేంద్ర ప్రభుత్వం పెంచకపోతే చంద్రబాబు ఇచ్చేవారు కాదా? అని రైతులు ప్రశ్నిస్తున్నారు. అయితే తమది కూటమి ప్రభుత్వం కాబట్టి రెండు పార్టీలూ కూటమిలో ఉన్నాయి కాబట్టి తాము కలసి సాయం అందచేస్తామని అధికార పార్టీ నేతలు చెబుతున్నారు.మరొక వైపు తెలంగాణలో మాత్రం రేవంత్ రెడ్డి రైతులకు పన్నెండు వేల రూపాయలు ప్రకటించారు. కేవలం రైతులకు మాత్రమే కాదు వ్యవసాయకూలీలకు కూడా సాయం అందచేస్తామని ప్రకటించారు. తెలంగాణలో రైతులకు అదనంగా రెండు వేల రూపాయలు అందుతున్నాయి. తెలంగాణలోని రైతులకు కూడా కేంద్ర ప్రభుత్వం పది వేల రూపాయలు ఇస్తుండగా, రేవంత్ రెడ్డి సర్కార్ పన్నెండు వేల రూపాయలు ఇస్తుంది. అంటే ఇక్కడ అదనంగా రెండు వేల రూపాయలు చెల్లిస్తుంది. ఇక్కడ కూడా తెలంగాణ కాంగ్రెస్ నేతలు ఎన్నికలకు ముందు పదిహేను వేల రూపాయలు రైతు భరోసా ఇస్తామని ప్రకటించింది. అయితే దానిని మూడు వేల రూపాయలు తగ్గించిందన్న విమర్శలు కూడా విపక్షాల నుంచి విమర్శలు వినిపిస్తున్నాయి. కానీ ఆంధ్రప్రదేశ్ తో పోల్చుకుంటే తెలంగాణ లో రైతులకు అదనంగా రెండు వేల రూపాయలు రైతు భరోసా నిధులు జమ అవుతుండటంతో ఏపీ కంటే తెలంగాణాయే బెటర్ అన్న కామెంట్స్ సోషల్ మీడియాలో వినిపిస్తున్నాయి. అంటే చంద్రబాబు కంటే రేవంత్ రెడ్డి బెటర్ అంటూ కొందరు నెట్టింట కామెంట్స్ పెడుతున్నారు.


# పక్కదారి పడుతున్న కందిపప్పు



నెల్లూరు, జనవరి 9,: పేదలకు అందాల్సిన కందిపప్పు పక్కదారి పడుతోంది. చాలా ప్రాంతాల్లో కందిపప్పు సరఫరా తక్కువ అవుతోంది. దీంతో డీలర్లు కొంతమందికే ఇచ్చి.. మిగతా పప్పును వ్యాపారులకు విక్రయిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. దాదాపు 40 శాతం వరకు లబ్ధిదారులకు కందిపప్పు అందడం లేదని తెలుస్తోంది.సంక్రాంతి పండగ వేళ పేదలు కందిపప్పు కోసం ఎదురుచూస్తున్నారు. రాష్ట్రంలో ప్రతి నెలా కార్డుదారులకు ఇచ్చే సరఫరాలో కోత విధిస్తున్నారు. డిసెంబర్ నెలలో కూడా అరకొరగా పంపిణీ చేశారు. ఈ నెలలో అయినా అందరికీ ఇస్తారని అనుకున్నారు. కానీ పూర్తి స్థాయిలో కిందిపప్పు రాలేదు. కార్డుదారులకు ప్రతినెలా బియ్యంతో పాటు అరకిలో పంచదార, కిలో కందిపప్పు ఇవ్వాల్సి ఉంది. కానీ.. రేషన్ షాపుల ద్వారా అవి సక్రమంగా అందడం లేదు.బియ్యం, పంచదార అందరికీ ఇస్తున్నా.. 50 నుంచి 60 శాతం మందికి మాత్రమే కంది పప్పు అందిస్తున్నారు. దీంతో 40 శాతానికిపై లబ్ధిదారులకు కందిపప్పు దక్కడం లేదు. రేషన్ దుకాణాలు ద్వారా రాయితీపోనూ రూ.67కే కందిపప్పు వస్తుంది. దీంతో పేదలు ఎదురుచూస్తున్నారు. ఇప్పటికే నిత్యావసరాల ధరలు భారీగా పెరగడంతో.. కందిపప్పు ఇవ్వకపోతే ఎలా అని పేదలు ప్రశ్నిస్తున్నారు.రేషన్ షాపుల నిర్వాహకులు బియ్యంతోపాటు పంచదార, కందిపప్పు ఇవ్వాలి. కానీ చాల చోట్ల బియ్యం, చెక్కర మాత్రమే అందిస్తున్నారు. కొంత మందికి మాత్రమే కందిపప్పు అందించి.. ఇక పప్పు అయిపోయిందని చెబుతున్నారు. అలా నొక్కేసిన పప్పును బ్లాక్ మార్కెట్‌కు తరలించి సొమ్ము చేసుకుంటున్నారనే ఆరోపణలున్నాయిపేద, మధ్యతరగతి కుటుంబాలకు ఆహార భద్రత కల్పించడానికి ప్రభుత్వం పలు చర్యలు చేపట్టింది. ఈ క్రమంలోనే రాష్ట్రంలోని రేషన్ షాపుల ద్వారా అనేక రకాల అవసరమైన సరుకులు అందజేస్తున్నారు. తెల్ల బియ్యం, గోధుమలు, ప్రోటీన్లు అధికంగా ఉండే కందిపప్పు, పంచదార, వంట నూనెను కూడా అందిస్తున్నారు. అప్పుడప్పుడు అవసరాలను బట్టి ఉప్పు, మిరపకాయలను పంపిణీ చేస్తున్నారు.అయితే.. కొన్ని చోట్ల కందిపప్పు సక్రమంగా పంపిణీ చేయడం లేదని, ఫిర్యాదులు వస్తున్నాయని అధికారులు చెబుతున్నారు. అలాంటి వారిపై ప్రత్యేక నిఘా ఉంచామని స్పష్టం చేస్తున్నారు. షాపుల్లో తనిఖీలు చేసి చర్యలు తీసుకోవాలని లబ్ధిదారులు కోరుతున్నారు.

## రైతుల పొలాలకు దారి లేకుండా సింగరేణి సంస్థ ఫెన్సింగ్

**–ఆర్డీవోకు వినతి పత్రం అందజేసిన రైతులు ప్రజా సంఘాల నాయకులు**



మంథని జనవరి 09: మంథని మండలంలోని బిట్టుపల్లి శివారులో 372సర్వే నంబర్ లోని దాదాపు 250 ఎకరాలు 47 సర్వే నంబర్ లోని 30 ఎకరాల ప్రభుత్వ భూమిని సింగరేణి సంస్థ తీసుకొని రచ్చపల్లి, అద్యాల, సిద్దపల్లి, అక్కేపల్లి,గ్రామాలు సింగరేణిలో పోగా భూ నిర్వాసితుల కింద బిట్టుపల్లి శివారులోని భూములను కొనుగోలు చేసి గ్రామాలకు ఇండ్ల ఫ్లాట్లు ఇచ్చినారు. మిగతా ఖాళీ స్థలంలో సింగరేణి సంస్థ చెట్లను నాటి బార్డర్ వేసి సిమెంటు పోల్లతో పెన్సింగ్ వేస్తున్నారు. క్రింది పొలాలకు వెళ్లడానికి దారి లేకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. సింగరేణి అధికారులను అడగగా మేము కొనుగోలు చేసిన భూముల్లో చుట్టూ ఫెన్సింగ్ వేసుకుంటున్నామని మీ భూముల దారితో మాకు ఎలాంటి సంబంధం లేదని చెప్తున్నారని రైతులు ఆవేదం వ్యక్తం చేస్తున్నారు. గురువారం ఆర్డీవోకు రైతులు ప్రజాసంఘాల నాయకులు కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ప్రజా సంఘాల నాయకులు మాట్లాడుతూ సింగరేణి సంస్థకు రైతుల భూముల ఇచ్చి రైతులకు దారి లేదు అనడం విడ్డూరమని సింగరేణి సంస్థ ఆలోచించి రైతులకు దారి ఇవ్వాలని డిమాండ్ చేశారు. సింగరేణి అధికారులు రైతు సమస్యలను దృష్టిలో ఉంచుకొని దారి ఇవ్వాలని కోరారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక జిల్లా కార్యదర్శి బూడిద గణేష్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ఆర్ల సందీప్, కెవిపిఎస్ నాయకులు మంథని లింగయ్య, రైతులు ముత్తినేని పోచయ్య, మాధవరావు సతీష్, పసునూటి కనుకయ్య, రాయినేని శివరాంజన్,ఆకుల శ్రీకాంత్, పాల్గొన్నారు.

## ఆరు ఎంపీటీసీ స్థానాలు పెంచాలని వినతి..!



కమాన్ పూర్, జనవరి 9: కమాన్ పూర్ మండలంలో ప్రస్తుతం ఉన్న ఏడు ఎంపీటీసీ స్థానాలకు తోడుగా అదనంగా మరో ఆరు ఎంపీటీసీ స్థానాలను పెంచాలని కోరుతూ ఎంపీడీవో లలితకు గురువారం మండల బీఆర్ఎస్ మండల శాఖ ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. పరిపాలన సౌలభ్యం రీత్యా పెరిగిన జనాభా, ఓటర్ల సంఖ్య నేపథ్యంలో కమాన్ పూర్ మండలంలో ఎంపీటీసీ స్థానాలను పెంచాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని ప్రభుత్వం ఆ దిశగా చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. కమాన్ పూర్, సిద్దిపల్లె గ్రామ పంచాయతీల్లో ప్రస్తుతం ఉన్న రెండు ఎంపీటీసీ స్థానాలకు అదనంగా మరో రెండు ఎంపీటీసీ స్థానాలు పెంచాలి. జూలపల్లి గ్రామ పంచాయతీలో గల రెండు ఎంపీటీసీ స్థానాలకు మరో ఎంపీటీసీ స్థానం అదనంగా పెంచాలి. మూడు గ్రామ పంచాయతీలైన గుండారం, పేరపల్లి, గొల్లపల్లిలకు ఒక్కటే ఎంపీటీసీ స్థానం ఉందని, ఇందులో గుండారం గ్రామ పంచాయతీలోని గుండారం, రాజాపూర్ గ్రామాలకు ఎంపీటీసీ స్థానం పరిమితం చేసి పేరపల్లి, గొల్లపల్లి రెండు గ్రామ పంచాయతీలకు కలిపి ప్రత్యేకంగా మరో ఎంపీటీసీ స్థానం ఏర్పాటు చేయాలి. అలాగే రొంపకుంటలో ప్రస్తుతం ఉన్న ఒక్క ఎంపీటీసీ స్థానానికి అదనంగా మరో ఎంపీటీసీ స్థానం ఏర్పాటు చేయాలి. పెంచికల్ పేట్, నాగారం రెండు గ్రామ పంచాయతీలకు కలిపి ఉన్న ఒక్కటే ఎంపీటీసీ స్థానం ఉండగా ఇందులో ప్రస్తుతం ఉన్న ఎంపీటీసీ స్థానాన్ని పెంచికల్ పేట్ కు పరిమితం చేసి నాగారం గ్రామ పంచాయతీలోని నాగారం, లింగాల, రేపల్లె వాడ, శాలపల్లెలకు ప్రత్యేకంగా మరో ఎంపీటీసీ స్థానాన్ని ఏర్పాటు చేయాలని కోరుతూ బీఆర్ఎస్ నాయకులు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ వినతి పత్రం అందజేసిన వారిలో బీఆర్ఎస్ మండల అధ్యక్షులు తాటికొండ శంకర్, యూత్ మండల అధ్యక్షులు బొమ్మగాని అనిల్ గౌడ్, మహిళ విభాగం మండల అధ్యక్షురాలు పొన్నం రాజేశ్వరి, ఏ. ఎం. సీ మాజీ వైస్ చైర్మన్ గుర్రం లక్ష్మీమల్లు, జూలపల్లి మాజీ ఉప సర్పంచ్ పోలుదాసరి సాయికుమార్, నాయకులు తోడేటి రాజేర్, ఎలాబోయిన రామ్మూర్తి, తోట రాజ్ కుమార్ లు పాల్గొన్నారు.

## జ్యోతిరావు పూలే హాస్టల్లో సందర్శించిన పెద్దపెల్లి ఎంపీ

**విద్యార్థులతో కలిసి భోజనం చేసిన ఎంపి**
**వాష్ రూమ్ శుభ్రంగా, నీటి సదుపాయం లేకపోవడంతో పాఠశాల సిబ్బందిపై ఆగ్రహం**

గోదావరిఖని : గోదావరిఖని ప్రశాంత్ నగర్ లోని జ్యోతిరావు పూలే బీసీ వెల్ఫేర్ హాస్టల్ ను గురువారం నాడుఆకస్మితంగా తనిఖీ చేసిన పెద్దపెల్లి ఎంపీ గడ్డం వంశీ. ఈ సందర్భంగా పెద్ద పెల్లీ ఎంపీ వంశీ మాట్లాడుతూ ఎడ్యుకేషన్ బాగుంటే దేశం బాగుంటుందని పిల్లలకు మంచి నాణ్యతమైన విద్యను అందించాలని, అలాగే పిల్లలకు మంచి నాణ్యతమైన భోజనం అందించాలని ఫుడ్ పాయిజన్ కేసులు పునరావృతం కాకుండా చూడాలని ఇబ్బందికి సూచించారు, హాస్టల్లో వాష్ రూమ్స్ లో నీటి సదుపాయాలు లేకపోవడంతో పాఠశాల యాజమాన్యం



పై ఆగ్రహం వ్యక్తం చేశారు. హాస్టల్ కు తన వంతు సహాయంగా ఎంపీ లాండ్స్ నుండి సహాయ సహకారాలు అందిస్తానని, అనంతరం హాస్టల్ పిల్లలతో భోజనం కలిసి చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## చెన్నూర్ వారియర్స్ టీం కు 30 వేల రూపాయలు విరాళం

చెన్నూర్: మంచిర్యాలలో జరుగ బోతున్న ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్న మెంట్ లో చెన్నూర్ వారియర్స్ జట్టుకు గురువారం బీజేవైఎం రాష్ట్రా కార్యవర్గ సభ్యులు ఎతం.శివకృష్ణ చెన్నూరు వారియర్స్ టీం సభ్యులకు 30 వేల రూపాయలు విరాళం అందించారు.ఈ సందర్భంగా క్రికెట్ టీం జెర్సీని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శివకృష్ణ మాట్లాడుతూ... మంచిర్యాలో జరగబోయే క్రికెట్ టోర్నమెంట్లో మంచిగా రానించి చెన్నూరుకి మంచి పేరు తేవాలని కోరారు. టీం సభ్యులు తమకు స్పాన్సరింగ్ చేసిన ప్రోత్సాహం ఇచ్చినందుకు గాను శివకృష్ణ ను శాలువాతో సత్కరించారు.

## నిబంధనలకు విరుద్ధంగా నిర్మిస్తున్న అక్రమ కట్టడంపై చర్యలు తీసుకోవాలి



మంథని మంథని పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ ముందు సర్వే నెంబర్ 1013 లో నిబంధనలకు విరుద్ధంగా నిర్మిస్తున్న అక్రమ కట్టడంపై హైకోర్టు రిట్ పిటిషన్ నెం. 41697/2022 తేది: 16.11.2022 నందు ఉత్తర్వులు ఇచ్చియున్నారని,ఈ యొక్క ఉత్తర్వులను గౌరవించకుండా వొల్లాల నవ్య తండ్రి సత్యనారాయణ అక్రమ నిర్మాణము మరల మొదలు పెడుతున్నారని పేర్కొంటూ మంథని పట్టణానికి చెందిన మేడగోని శ్రీనివాస్ గౌడ్ గురువారం మంథని మున్సిపల్ కార్యాలయంలో ఫిర్యాదు చేశాడు. ఇట్టి అక్రమ నిర్మాణము మీద హైకోర్టు ఇచ్చిన తీర్పు అమలు చేయాలని మున్సిపల్ కమిషనర్ను కోరారు. ఫిర్యాదు చేసినా గాని రెండవ అంతస్తు పైన గాని, సెట్ బ్యాక్ గాని ఇప్పటి వరకు దానిని కూల్చలేదని, . హైకోర్టు ఉత్తర్వులు జారీ జారీ చేసిన మున్సిపల్ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆరోపించారు.ఇప్పటికైన హైకోర్టు సూచన మేరకు సెట్ బ్యాక్ మీద, రెండవ అంతస్తు పైన చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో కోరారు.

# తమ్మినేని దారెటు...

శ్రీకాకుళం, జనవరి 9, : ఏపీ రాజకీయాల్లో పరిచయం అక్కర్లేని పేరు తమ్మినేని సీతారాం. ఇప్పటి వరకు 5సార్లు ఎమ్మెల్యేగా గెలిచిన తమ్మినేని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కీలక శాఖలకు మంత్రిగా బాధ్యతలు నిర్వర్తించిన అనుభవం ఉంది. వైసీపీ సర్కార్‌లో శాసన సభాపతిగా కూడా పనిచేశారు. రాజకీయాల్లో తలపండిన నేతగా పేరు తెచ్చుకున్నారు తమ్మినేని.. అలాంటి సీనియర్ నేతను ఇప్పుడు సోషల్ మీడియా ముప్పుతిప్పలు పెడుతుందనే గాసిప్ మొదలైంది.ఎంత అనుభవం ఉన్నా కాలం కలిసి రాకుంటే. ఎవరైనా డీలా పడాల్సిందే. అలా వైసీపీ ఓటమి తర్వాత తమ్మినేని కూడా ఇబ్బందులుపడుతున్నారు. 2024 ఎన్నికల్లో తమ్మినేని సీతారాం ఓటమి తర్వాత సైలెంట్ మోడ్‌లోకి వెళ్లిపోయారు. ఆమదాలవలస నియోజకవర్గ బాధ్యతల నుంచి తప్పించి శ్రీకాకుళం పార్లమెంట్ పరిశీలకులుగా బాధ్యతలు అప్పగించింది హైకమాండ్. ఆమదాలవలస అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా చింతాడ రవికుమార్‌ని నియమించారు.ఇక అప్పటి నుంచి తమ్మినేనితో పాటు ఆయన వర్గం అసంతృప్తిగా ఉన్నారనే టాక్ లోకల్‌లో రీసౌండ్ చేస్తోంది. నియోజకవర్గంలో పార్టీ కార్యక్రమాలు జరిగినా.. ఎక్కడా తమ్మినేని కనిపించడం లేదు. ఆమదాలవలస వైసీపీ పగ్గాలను తమ్మినేని వారసుడు వెంకట చిరంజీవి నాగ్‌కి అప్పగిస్తారని లోకల్‌లో తెగ ప్రచారం జరిగింది. కానీ చివరి నిమిషంలో అధిష్టానం చిరంజీవినాగ్‌ను కాదని చింతాడ రవికుమార్‌కు బాధ్యతల్ని అప్పగిచారు. దీంతో అప్పటి నుంచి వైసీపీ అధిష్టానంపై తమ్మినేని కుటుంబం కాస్త గుర్రుగానే ఉందని గాసిప్ వినిపిస్తోంది.సోషల్ మీడియా వచ్చి దూరం అనే మాటను చెరిపేసింది. ప్రపంచాన్ని సింగిల్ విలేజ్‌గా మార్చేసింది. ఎక్కడా ఏ మూలనా ఏం జరిగినా ప్రపంచమంతా చాటి చెబుతుంది. ఈ సోషల్ మీడియా ఓడలను బండ్లను చేయగలదు. బడ్లను ఓడలను చేయగలదు. చాలా మంది సోషల్ మీడియాను బ్రహ్మాస్త్రంగా వాడుకొని పొలిటికల్ లీడర్లుగా ఎదిగిపోయారు. అయితే అప్పుడప్పుడు సోషల్ మీడియాలో నిజాన్ని అబద్ధం డామినేట్ చేస్తోంది. సత్యం డిలేట్ అయిపోయి



అసత్యం ఫార్వర్డ్ అవుతుంది. ఇలా ఇప్పటి వరకు ఎంతోమంది నేతలు చిక్కుల్లో పడ్డారు.ఇది ఇలా సాగుతుంటే రెండు నెలలుగా వైసీపీ క్యాడర్‌కి సైతం తమ్మినేని టచ్‌లోకి రావడం లేదట. నిజం చెప్పాలంటే ఆయన అజ్ఞాతంలోకి వెళ్లిపోయారా అనే అనుమానం లోకల్ కార్యకర్తలకు కూడా కలిగింది. ఇక్కడే తమ్మినేనికి అసలు చిక్కువచ్చి పడింది. సీతారాం పార్టీ మారబోతున్నారనే ప్రచారం సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతోంది. కొన్ని సోషల్ మీడియా సంస్థలు ఒక్క అడుగు ముందుకేసి.. తమ్మినేని జనసేన వైపు చూస్తున్నారని కొందరు.. లేదు లేదు బీజేపీ ఆఫీస్ బాట పడతారని ఇంకొందరి తమ్మినెయిల్ తగిలించి వీడియోలు వదిలేశారు. ఇక ఆ వార్త సోషల్ మీడియాలో తెగ వైరల్ అయ్యింది. తమ్మినేని కూడా టచ్‌లో లేకపోవడంతో వైసీపీ క్యాడర్ కూడా ఇదే నిజమే అని ఫిక్స్ అయ్యారట.రెండు నెలల సుదీర్ఘ విరామం తర్వాత సిక్కోలు జిల్లాకు ఎంట్రీ ఇచ్చిన సీతారాం.. సోషల్ మీడియా ప్రచారం చూసి షాక్ ఐపోయారు. తానేంటి పార్టీ మారడం ఏంటని తల పట్టుకుంటున్నారట. ఇంతలో శాసనమండలి ప్రతిపక్షనేత బొత్స సత్యనారాయణ ఆమదాలవలసలో సీతారాం ఇంటికి వెళ్లడంతో ఏదో జరుగుతుందనే అనుమానం మరింత బలపడింది. తమ్మినేని పార్టీ మారబోతున్నారని.. ఆయన్ని బుజ్జగించేందుకే స్వయంగా బొత్స వచ్చారంటూ సిక్కోలు పొలిటికల్ సర్కిళ్లలో పుకార్లు షికార్లు చేశాయి.తాను పార్టీ మారడం లేదు మహా ప్రభో అంటూ తమ్మినేని క్లారిటీ ఇచ్చేశారు. తన కుమారుడి ఆపరేషన్ కోసం వేరే రాష్ట్రానికి వెళ్లాల్సిం వచ్చిందని వివరణ ఇచ్చారు. అందుకే పార్టీ క్యాడర్‌కి టచ్‌లోకి రాలేదని చెప్పుకువచ్చారు. పీకపోయినా ఎవరైనా పవన్‌కల్యాణ్ వైపు వెళ్తారా అంటూ వివరణ కూడా ఇచ్చారట. ఇటు బొత్స సత్యనారాయణ కూడా తమ్మినేని కుమారుడి ఆరోగ్యం గురించి తెలుసుకోవడానికే వచ్చానని చెప్పుకువచ్చారు.తమ్మినేని మనసులో ఏముందో గాని.. సోషల్ మీడియా మాత్రం ఆయనికి కంటిమీద కునుకులేకుండా చేసింది. వైసీపీ క్యాడర్‌నే నమ్మించేంతలా ప్రచారాన్ని ఊదర గొట్టింది. అయితే నిప్పు లేనిదే పొగ రాదనే ప్రచారం మళ్లీ మొదలైంది. మొత్తానికి ఈ ఎపిసోడ్‌లో సోషల్ మీడియా అంచనాలు తలకిందులవుతాయా. లేదంటే నిజమే అవుతాయా.? అన్నది కాలమే నిర్ణయించాలి.

## సంక్రాతి పండుగకి ఉరికెళ్తున్నారా... జాగ్రత్త..

### పోలీస్ వారి సూచనలు పాటించండి : రామగుండం పోలీస్ కమిషనర్..



మంచిర్యాల :సోషల్ మీడియాలో మీ లొకేషన్, ట్రావెల్స్ ప్లాన్స్, ఎప్పుడు ఎక్కడికి వెళ్తున్నాం అనే మీ అప్డేట్స్ పెట్టకండి స్వీయ రక్షణ కు ఇంట్లో సీసీ కెమెరా అమర్చుకోవటం మంచిది ఎవరైనా అనుమానస్పద వ్యక్తులు కనిపించినట్లయితే వెంటనే స్థానిక పోలీసులకి, సమాచారం అందించాలి లేని యెడల 100 డయల్ చేయండి అని రామగుండం కమిషనర్ సూచించారు. సంక్రాతి పండుగ సెలవులను పురస్కరించుకొని సొంత ప్రాంతాలకు, బంధువుల ఇండ్లకి, విహార యాత్రలకు వెళ్లే ఆయా గ్రామాల, కాలనీ, ఆపార్టుమెంట్ వాసులు దొంగతనాల పట్ల అప్రమత్తంగా ఉండాలని రామగుండం పోలీస్ కమీషనర్ శ్రీ ఎం. శ్రీనివాస్ ఐపిఎస్., (ఐజి) గారు ఓ ప్రకటనలో తెలిపారు. చోరీల నియంత్రణకు అన్ని చర్యలు చేపట్టామన్నారు. ఈ సమయం లో రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలోనీ ప్రజలు పోలీస్ శాఖ వారి సూచనలు పాటిస్తూ సహకరించగలరు అని తెలిపారు ఊరికి వెళ్లాల్సి వస్తే విలువైన బంగారు, వెండి, ఆభరణాలు, డబ్బులు, బ్యాంక్ లాకర్లలో భద్రపర్చుకోండి. లేదంటే మీ ఇంట్లోనే రహస్య ప్రదేశంలో దాచుకోండి. బీరువా తాళాలను ఇంట్లో ఉంచరాదు తమతో పాటే తీసుకెల్లాలని తెలిపారు సెలవుల్లో బయటికి వెళుతున్నప్పుడు మీ ఇంటికి సెంట్రల్ లాక్ సిస్టమ్ ఉండే తాళం, సెక్యూరిటీ అలారం, మోషన్ సెన్సర్ను ఏర్పాటు చేసుకోండం మంచిదాన్నారు తాళం వేసి ఊరికి వెళ్లాల్సి వస్తే తప్పనిసరి స్థానిక పోలీస్టేషన్ లో సమాచారం ఇవ్వండి. వారి వివరాలు నమోదు చేసుకొని వారి ఇళ్లపై నిఘా ఏర్పాటు చేస్తారు మీ వాహనాలను ఇంటి ఆవరణలోనే పార్కు చేసుకోండి ద్విచక్ర వాహనాలకు తప్పనిసరిగా చైన్స్ తో లాక్ వెయ్యడం మంచిదన్నారు నమ్మకమైన వ్యక్తులను మాత్రవే వాచ్ మెన్,సెక్యూరిటీ గార్డ్,సర్వెంట్ గా నియమించుకోవాలన్నారు. మీ ఇంట్లో స్వీయ రక్షణ సీసీ కెమెరాలను అమర్చుకోవాలని ఆన్ లైన్లో ఎప్పటికప్పుడు మొబైల్ లో మీ ఇంటిని, పరిసరాలను లైవ్ ప్రత్యేక్షంగా చూసుకొవచ్చని సెక్యూరిటీ సర్వేలైన్స్ కు సీసీ కెమెరాలు ఎంతో ఉపయోగపడతాయన్నారు. ఊరు వెళ్తున్నప్పుడు పక్కింటి వారికి ఇంటి పరిసరాలను గమనించాలని చెప్పాలిఇంటికి తాళం వేసిన తర్వాత తాళం కనబడకుండా డోర్ కర్టెన్ వేయాలి. ఇంట్లో ఏదో ఒక గదిలో లైట్ వేసి ఉంచాలన్నారు. ఇంట్లో లేనప్పుడు పని మనుషులు ఉంటే రోజు వాకిలి ఊడ్చమని చెప్పాలి. ఇంటి ముందు చెత్త చెదారం, న్యూస్ పేపర్స్, పాలప్యాకెట్లు జమ కానివ్వకుండా చూడాలి వాటిని కూడా గమనించి నేరస్థులు దొంగతనాలకు పాల్పడే అవకాశం ఉన్నదన్నారు. మీ గ్రామం, పట్టణం, కాలనీలో ఎవరైనా అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే స్థానిక పోలీసు స్టేషన్ కు తప్పనిసరిగా సమాచారం ఇవ్వండి డయల్ 100కు కాల్ చేయండి ప్రజలు పోలీస్ శాఖ వారి సూచనలు పాటిస్తూ సహకరిస్తే చోరీల నియంత్రించడం సులభం అవుతుంది అని సీపీ తెలిపారు.

## ఎమ్మెల్యే వినోద్ చొరవ తోనే తాండూర్ అభివృద్ధి

తాండూర్ : బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకటస్వామి చొరవతోనే తాండూరు మండలం లో అభివృద్ధి శరవేగంగా కొనసాగుతోందని కాంగ్రెస్ నాయకులు అన్నారు .గురువారం మండలంలోని జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ సల్వాజి మహేందర్ రావు నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు సూరం రవీందర్ రెడ్డి మాట్లాడుతూ ఎమ్మెల్యే గడ్డం వినోద్ స్థానికంగా ఉండడం లేదని, ప్రజల సమస్యలు పట్టించుకోవడంలేదని మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య చేసిన ఆరోపణలు అర్ధరహితమన్నారు. ఎమ్మెల్యే ప్రత్యేక చొరవతోనే మండలంలో కోట్లాది రూపాయల అభివృద్ధి పనులు నడుస్తున్నాయన్నారు. తాజాగా మహిళా శక్తి పేరిట సోలార్ ప్లాంట్ల ఏర్పాటుకు ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు సిద్ధ%శీ% చేసిందన్నారు తాండూర్ ఎంవీ కే-1 గని ప్రాంతంలో, రేచిని ,తాండూర్ గ్రామాల్లో పలుచోట్ల సోలార్ ప్లాంట్ల ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేయడం జరిగిందన్నారు . ఇప్పటికే మంజూరైన నాలుగు ఓపెన్ జిమ్ముల ఏర్పాటు కూడా త్వరలోనే చేపడం జరుగుతుందన్నారు . తాండూర్ లో స్టేడియం ఏర్పాటుకు నిధులు మంజూరు అయ్యాయని స్థల ప్రతిపాదన అనంతరం



స్టేడియం ఏర్పాటుతో ఎన్నో ఏళ్లుగా క్రీడాకారులు ఎదురుచూసిన వారి కల కూడా నెరవేరబోతుందన్నారు దీంతో పాటు ఎన్నో అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు జరుగుతున్నాయని త్వరలోనే మరిన్ని నిధులు తీసుకువచ్చి మండలాన్ని అభివృద్ధి పదం పైపు తీసుకెళ్లడమే ఎమ్మెల్యే వినోద్ ద్యేయమన్నారు ఈ సమావేశంలో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ సల్వాజి మహేందర్ రావు.మార్కెట్ కమిటీ మాజీ అధ్యక్షుడు గట్టు మురలీధర్,మాజీ జడ్పిటిసి సాలిగామ బానయ్య యువజన నాయకుడు గణపతి అంజి తదితరులు పాల్గొన్నారు.

## రైల్వే లైన్ కు అమరావతి రైతులు అడ్డు

విజయవాడ, జనవరి 9,: అమరావతి రాజధాని నిర్మాణం పై ఫోకస్ పెట్టారు చంద్రబాబు . గత అనుభవాల దృష్ట్యా పనులు వీలైనంతవరకు వేగవంతంగా పూర్తి చేయాలని భావిస్తున్నారు. అదే సమయంలో రోడ్డు, రైల్వే ప్రాజెక్టుల నిర్మాణానికి కేంద్రం ముందుకు వస్తోంది. ఒకవైపు అమరావతి రాజధాని పనులతో పాటు సమాంతరంగా కేంద్ర ప్రభుత్వ ప్రాజెక్టులను పూర్తి చేయాలన్నది చంద్రబాబు లక్ష్యం. ఈ విషయంలో కేంద్రం కూడా సానుకూలంగా ఉండడంతో పనులను పరుగులెత్తించాలని చంద్రబాబు భావిస్తున్నారు. కానీ దీనికి అమరావతి రైతులుఅడ్డుపడుతుండడం విశేషం. ఇన్ని రోజులు చంద్రబాబు కోసం పరితపించిన వారు ఇప్పుడు వ్యతిరేకిస్తుండడం ప్రాధాన్యత సంతరించుకుంది.అమరావతి రాజధాని నిర్మాణంలో భాగంగా గుంటూరు, విజయవాడ నగరాలను అనుసంధానం చేస్తూ రైల్వే లైన్ నిర్మాణానికి కేంద్రం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఖమ్మం జిల్లాలోని ఎర్రుపాలెం నుంచి అమరావతి మీదుగా నంబూరు వరకు ఈ లైను నిర్మించనున్నారు. నంబూరు జంక్షన్ గా చేయనున్నారు. తద్వారా అమరావతి రాజధాని నిర్మాణానికి రెండు నగరాలు అనుసంధానం కానున్నాయి. గుంటూరు వెళ్లే అవసరం లేకుండా చెన్నై తిరుపతి కూడా వెళ్ళిపోవచ్చు. ప్రస్తుతం ఈ రైల్వే లైన్ కు సంబంధించి సర్వే జరుగుతోంది. ఎన్టీఆర్ జిల్లాలో అధికారులు భూమిని సేకరించాల్సి ఉంది. దీనికి గాను నోటిఫికేషన్ జారీ చేశారు. స్థానికంగా సమావేశాలు ఏర్పాటు చేసి రైతుల నుంచి అభ్యంతరాలు స్వీకరిస్తున్నారు. అమరావతిని నిర్మించేందుకు 29 గ్రామాల పరిధిలో భూ సమీకరణ ఎలా జరిగిందో.. అలానే తమ భూములు తీసుకోవాలని ఇక్కడి రైతులు కోరుతున్నారు. ప్రస్తుతం ఎన్టీఆర్ జిల్లా కంచి కర్ల మండలంలో భూసేకరణ జరుగుతోంది. అయితే ఈ లైన్ ఏర్పాట్లు భాగంగా భూములు కోల్పోతున్నవారు తమ కుటుంబంలో ఒకరికి రైల్వే ఉద్యోగం కావాలని కోరుతున్నారు. అలాగే గ్రామాల్లో రోడ్ల మరమ్మతులతో పాటు కొత్త రహదారులు వేయాలని డిమాండ్ చేస్తున్నారు. దీంతో అధికారులకు షాక్ తగులుతోంది.ఒకవైపు వీలైనంత త్వరగా అమరావతి ప్రాజెక్టులను పూర్తి చేయాలని చంద్రబాబు కృతనిశ్చయంతో ఉన్నారు. ఎట్టి పరిస్థితుల్లో 2029 నాటికి పూర్తిస్థాయిలో అమరావతి నిర్మాణ పనులు పూర్తి చేయాలని భావిస్తున్నారు. ఒకవైపు రాష్ట్ర పాలనతో పాటు సమాంతరంగా అమరావతి పై ఫోకస్ పెట్టారు. సరిగ్గా ఇటువంటి సమయంలోనే అమరావతి రైతుల నుంచి కొత్త కోరికలు వస్తుండడంతో.. ప్రభుత్వానికి షాక్ తగిలినట్లు అవుతోంది. అయితే ఈ కొత్త రైల్వే లైన్ విషయంలో రైతుల నుంచి వస్తున్న అభ్యంతరాలపై ప్రభుత్వం ఎలా ముందుకెళ్తుందో చూడాలి.

## మన బ్రతుకులు మారేది ఎన్నడు!

**ప్రముఖ గాయకుడు, సంఘ సేవకులు,**
**గద్దల శశిభూషణ్ స్వరకల్పనలో**
**శశి రాగాలు, వీడియో ఆడియో ఆవిష్కరణ**
**,ఖని, కూరగాయల మార్కెట్లో ఆత్మీయుల సమక్షంలో**
**అంగరంగ వైభవంగా ఆడియో వీడియో రిలీజ్ ఫంక్షన్**

,గోదావరి ఖని :ప్రముఖ గాయకులు సంఘ సేవకులు, కోల్ బెల్ట్ ప్రాంత కళామతల్లి ముద్దుబిడ్డ, గద్దల శశిభూషణ్ స్వరకల్పనలో రూపొందించిన, మన బతుకులు మారేది ఎన్నడు,, ఆడియో వీడియో యూట్యూబ్ ఛానల్,శశి రాగాలు, పేరిట బుధవారం గోదావరిఖని పట్టణంలోని కూరగాయల మార్కెట్ హోల్ సేల్ అసోసియేషన్ అధ్యక్షులు దుండ మల్లేష్ ఆధ్వర్యంలో ఆత్మీయుల మధ్య అంగరంగ వైభవంగా ఆవిష్కరణ జరిగింది, ప్రముఖ జర్నలిస్టు స్వచ్ఛంద సంస్థల సలహాదారులు దయానంద్ గాంధీ అధ్యక్షతన జరిగిన ఆడియో వీడియో ఆవిష్కరణ కార్యక్రమంలో గోదావరిఖని హోల్ సేల్ కూరగాయల మార్కెట్ అసోసియేషన్ అధ్యక్షులు ప్రముఖ న్యాయవాది దు%శీ%డెమల్లేశం, ప్రముఖ బుల్లితెర వెండితెర దర్శకులు దామెర శంకర్, ప్రముఖ,సీనియర్ జర్నలిస్టు, ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు (గవర్నమెంట్ ఆఫ్ తెలంగాణ) ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బొంకూరి మధు,,లు, అతిథుల అందరి సమక్షంలో ఆవిష్కరించారు, సామాన్య ప్రజల బతుకులను కళ్ళకు అద్దినట్టు ఆడియో వీడియో రూపొందించిన, గాయకులు గద్దల శశి భూషణ్ ను, పలువురు అభినందించారు, ఈ ప్రాంతంలో పుట్టి పెరిగి ప్రజల ప్రధానంగా హోల్ సేల్, కూరగాయల మార్కెట్, చికెన్,మటన్, ఫిష్ మార్కెట్ వ్యాపారులతో అవినాభావ సంబంధంతోపాటు మార్కెట్ కి వచ్చే వినియోగదారులను ఆత్మీయంగా పలకరించే గద్దల శశిభూషణ్ మరిన్ని ప్రజల బతుకులకు సంబంధించిన వీడియో ఆడియోలు చేయాలని పలువురు అతిథులు కోరారు, మన బ్రతుకులు మారేది ఎన్నడు




వీడియోలో నటించిన దామెర రాజేష్ ను కూడా పలువురు అభినందించారు, ఎన్నో వ్యాయా ప్రయాసలకోర్చి ఆడియో వీడియో రిలీజ్ చేసిన గద్దల శశి భూషణ్ ను, కూరగాయల మార్కెట్ చికెన్ మార్కెట్, ఫిష్ మార్కెట్, మటన్ మార్కెట్ అసోసియేషన్ నాయకులు వ్యాపారస్తులు శాలువాతో ఘనంగా సన్మానించారు, రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ స్వచ్ఛంద సంస్థల గౌరవ అధ్యక్షులు దయానంద్ గాంధీ అధ్యక్షతన,జరిగిన కార్యక్రమంలో గోదావరిఖని హోల్ సేల్ కూరగాయల మార్కెట్ అసోసియేషన్ అధ్యక్షులు ప్రముఖ న్యాయవాది, దు%శీ%డే మల్లేశం, ప్రముఖ దర్శకులు దామెరశంకర్, ప్రముఖ జర్నలిస్టు, ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు బొంకూరి మధు, డైరెక్టర్ నగునూరి విజయ్ కుమార్ గోదావరి కళా సంఘాల సమైక్య గౌరవ సలహాదారులు కాశిపాక రాజమౌళి, ప్రధాన కార్యదర్శి మ్యాదరి వాసు, డాన్స్ మాస్టర్ బీరుక లక్ష్మణ్,ప్రముఖ మేకబిస్ట్ తిప్ప బత్తిని అంజి,, మటన్ మార్కెట్ అసోసియేషన్ అధ్యక్షులు గోలి కార్ రాము,చికెన్ మార్కెట్ అసోసియేషన్ అధ్యక్షులు ముజాహిద్, కూరగాయల మార్కెట్, మటన్ చికెన్ ఫిష్ హోల్ సేల్ మార్కెట్ వ్యాపారులు అసోసియేషన్ నాయకులు, నల్ల రవీందర్ ఆడెపు విటల్ కలవేని సంపత్, ఆడపు చంద్రశేఖర్ చందు మహమ్మద్ ఖలీమ్ ఆర్వి,, సాదిక్, మిట్టపల్లి మొగిలి ,వెంకటేష్ మల్లయ్య పల్లె మహేష్ తదితరులు పాల్గొన్నారు

# విశాఖ రైల్వే జోన్.. ఒడిస్సా అభ్యంతరం




విశాఖపట్టణం, : ఏపీలో కొత్తగా ఏర్పాటు కానున్న రైల్వే డివిజన్‌లో వాల్తేర్ డివిజన్ భాగం కానుంది. వాల్తేర్ రైల్వే డివిజన్‌ను ఈస్ట్ కోస్ట్ రైల్వే జోన్ నుంచి వేరు చేస్తూ కేంద్రం తీసుకున్న నిర్ణయం ఒడిశాపై తీవ్ర ఆర్థిక పరిణామాలకు దారి తీస్తుందని ఒడిశాలో ప్రధాన ప్రతిపక్షమైన బీజేడీ ఆందోళన వ్యక్తం చేసింది.వాల్తేర్ డివిజన్ విశాఖ కేంద్రంగా ఏర్పాటయ్యే జోన్‌లో కలిపే అంశంపై బీజేపీ ప్రభుత్వం మౌనం వహించడాన్ని ఆ పార్టీ ప్రశ్నించింది. రాయగడలో కొత్త రైల్వే డివిజన్ ఏర్పాటును బీజేడీ స్వాగతించింది.రాయగడలో కొత్త రైల్వే డివిజన్‌కు ప్రధాని నరేంద్ర మోదీ సోమవారం శంకుస్థాపన చేశారు.ఈస్ట్ కోస్ట్ రైల్వే నుంచి ఆదాయాన్ని ఆర్జించే భాగమైన వాల్తేరు డివిజన్ ను విడ దీయడం కేవలం ఆంధ్రప్రదేశ్ ను ప్రసన్నం చేసుకోవడమే లక్ష్యమని బీజేడీ నేత బ్రుగు బక్షిపాత్ర ఆరోపించారు.కేంద్ర ప్రభుత్వ నిర్ణయంపై వారు తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ ఈసీవోఆర్ పరిధిలో అత్యధిక ఆదాయాన్ని ఆర్జించే డివిజన్లలో వాల్తేరు రైల్వే డివిజన్ ఒకటని పేర్కొన్నారు.డివిజన్ ను విభజించి ఈసీఓఆర్ కు కీలకమైన ఆదాయాన్ని ఆర్జించే భాగాన్ని దక్షిణ కోస్తా రైల్వే జోన్ కు బదలాయించాలన్న నిర్ణయం ఆంధ్రప్రదేశ్ ను, ముఖ్యంగా దాని రాజకీయ నాయకత్వాన్ని ప్రసన్నం చేసుకునే ప్రయత్నం మాత్రమేనని బక్షిపాత్ర విమర్శించారు.దేశంలోనే అతిపెద్ద సరుకు రవాణా ఆదాయం ఆర్జిస్తున్న కొత్తవలస-కిరండూల్ (కేకే) లైన్ సహా 1,052 కిలోమీటర్లకు పైగా రైలు మార్గాలను కవర్ చేసే వాల్తేరు డివిజన్ ఇకపై కొత్త జోన్‌లో భాగం కానుంది.వాల్తేరు డివిజన్‌లో 300 డీజిల్ లోకోమోటివ్‌లను ఉంచే సామర్థ్యంతో భారతీయ రైల్వేలో అతిపెద్ద డీజిల్ లోకో షెడ్ ఉందని, లోడింగ్ లో 75 మిలియన్ టన్నుల మార్కును దాటిన డివిజన్ గా, 2024 మార్చి 31 నాటికి రూ.10,000 కోట్ల ఆదాయాన్ని దాటిన డివిజన్ గా గుర్తింపు ఉంది.వాల్తేరు జోన్ దేశంలోనే అత్యధిక ఆదాయాన్ని ఆర్జించే, సరుకు రవాణా విభాగాల్లో ఒకటిగా నిలిచిందని, రాష్ట్ర రైల్వే మౌలిక సదుపాయాలను మరింత బలోపేతం చేయడానికి ఒడిశా ప్రాంతాలైన జరీకెలా, బండముండా, రూర్కెలా, ఝార్సుగుడా, బెల్పహాడ్, కియోంఝర్, మయూర్భంజ్, బాలాసోర్ జిల్లాలను ఈస్ట్ కోస్ట్ రైల్వేలకు బదిలీ చేయాలని బీజేడీ డిమాండ్ చేసింది.ఈ మార్పు ఒడిశా ప్రయోజనాలను కాపాడుతుందని, రాష్ట్ర ఆర్థిక అవకాశాలను మెరుగు పరుస్తుందని బీజేడీ భావిస్తోంది. రాష్ట్రంలో రైల్వే జోన్లను సమగ్రంగా సమీక్షించాలని డిమాండ్ చేస్తూ, ప్రస్తుతం ఆగ్నేయ రైల్వే పరిధిలో ఉన్న బాలాసోర్, మయూర్భంజ్ మరియు కియోంఝర్ వంటి జిల్లాలను కలిగి ఉన్న ఉత్తర ఒడిశాలో కొత్త డివిజన్ను సృష్టించాలని ఆ పార్టీ ప్రతిపాదించింది.ప్రస్తుతం చక్రధర్పూర్ డివిజన్లో భాగంగా ఉన్న ఝార్సుగూడ మరియు సుందర్గఢ్లను కలుపుతూ కొత్త రూర్కెలా డివిజన్ను ఏర్పాటు చేయాలని పార్టీ ప్రతిపాదించింది. ఈ చర్యలు ఒడిశాలో మెరుగైన పరిపాలనకు, మెరుగైన రైల్వే సేవలకు దోహదం చేస్తాయని బీజేడీ నేతలు తెలిపారు.వాల్తేరు డివిజన్ ఈసీవోఆర్ నుంచి విడిపోయినప్పుడు బీజేపీ ఎంపీలు మౌనం వహించారని మాజీ ఎంపీ ప్రదీప్ మాఝీ విమర్శించారు.ఒడిశాను ప్రభావితం చేసే కీలక అంశాలపై రాష్ట్ర ప్రభుత్వం మౌనం వహిస్తోందని ఆరోపించారు.ఒడిశాలోని మల్కన్ గిరి ప్రాంతంపై ప్రతికూల పరిణామాలు ఉన్నప్పటికీ ఆంధ్రప్రదేశ్ లోని వివాదాస్పద పోలవరం ప్రాజెక్టుకు రూ.12,000 కోట్లు కేటాయించాలని గతంలో నిర్ణయం తీసుకున్నారు.ఆంధ్రప్రదేశ్, బీహార్ లలో రాజకీయ మిత్రపక్షాల ప్రయోజనాలకు బిజెపి నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తున్న ధోరణిపై బిజెడి అభ్యంతరం చెబుతోంది. 20 మంది లోక్ సభ ఎంపిలతో బిజెపి నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వానికి దోహదపడిన ఒడిశాను పక్కన పెట్టడాన్ని బీజేడీ నేతలు తప్పు పడుతున్నారు

# గంజాయిపై ఉక్కుపాదం



విశాఖపట్టణం, జనవరి : ఏపీలో గంజాయిపై ఉక్కుపాదం మోపుతున్నారు. గంజాయి తోట కనిపిస్తే కొట్టేయండి లేదా కాల్చేయండి అని ఈగల్ ఐజీ ఆకే రవికృష్ణ ప్రజలకు పిలుపునిచ్చారు. అల్లూరి సీతారామరాజు జిల్లాసాగు చేస్తున్న 8 ఎకరాల గంజాయి తోటల్ని అధికారులు ధ్వంసం చేశారు. అల్లూరి జిల్లాను గంజాయి రహిత జిల్లాగా మార్చుతామని పోలీసులు చెబుతున్నారు. ఎక్కడైనా గంజాయి సాగు చేస్తున్నట్లు కనిపించినా, గంజాయి అక్రమ రవాణా గురించి తెలిసినా, డ్రగ్స్ ఉన్నట్లు గుర్తించినా వెంటనే 1972 నెంబర్‌కు కాల్ చేసి సమాచారం అందించాలని ప్రజలకు సూచించారు. నేరాల నియంత్రణకు డ్రోన్లు, టెక్నాలజీ వినియోగించాలని ఏపీ సీఎం చంద్రబాబు అధికారులకు సూచించారు. ఈ క్రమంలో పెదబయలు మండలంలోని కంతుర్లకు చేరుకున్న అధికారులు డ్రోన్ల సాయంతో గంజాయి సాగు చేస్తున్నట్లు గుర్తించారు. గంజాయి సాగు నివారించేందుకు ఏర్పాటు చేసిన ఈగల్ ఐజీ రవికృష్ణ, ఎస్పీ అమిత్ బర్దార్ ఆధ్వర్యంలో రెవెన్యూ, పోలీస్, అటవీ శాఖ అధికారులు పాతపాడు గ్రామంలో 8 ఎకరాల్లో సాగవుతున్న గంజాయి (కానబిస్) తోటను ధ్వంసం చేశారు. జిల్లాలో కొన్ని రోజుల కిందట సైతం డ్రోన్ల ద్వారా పలుచోట్ల గంజాయి సాగు గుర్తించిన అధికారులు తోటల్ని ధ్వంసం చేశారు.ఇది అక్రమ సాగు నియంత్రణ కోసం చేపట్టిన ఆపరేషన్. ఈ ఆపరేషన్లో డ్రోన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా సేవలు, o1 టూల్స్ ను ఉపయోగించి ఈ గంజా సాగులను గుర్తించి, వాటిని నాశనం చేయడంలో సహకరించాయని రవికృష్ణ తెలిపారు. జిల్లాలో ఇప్పటివరకూ మొత్తం 2,000 ఎకరాలను డ్రోన్ సర్వే బృందం పర్యవేక్షించింది. డ్రోన్ల ద్వారా గంజాయి సాగును గుర్తించి, గంజాయి తోటల్ని నాశనం చేయడం తమ లక్ష్యమన్నారు. అనంతరం వ్యక్తిగతంగా పాతపాడు గ్రామ ప్రజలతో సమావేశమై గంజాయి సాగువల్ల కలిగే దుష్ప్రరిణామాలు వివరించారు. వీటి కేసులలో ఇరుక్కుని జైలుకు వెళితే జీవితం నాశనం అవుతుందని వారికి నష్టాలపై అవగాహన కల్పించారు. గిరిజనులు చేసే గంజా సాగు వల్ల గ్రామంతో పాటు సమాజం భవిష్యత్తుకు ఏర్పడే హానిని ప్రస్తావించారు. గిరిజనులు, గ్రామస్తులు ఇక నుంచి ఇలాంటి అసాంఘిక కార్యకలాపాల్లో పాల్గొనకుండా ప్రతిజ్ఞ చేయించారు. వారికి ప్రత్యామ్నాయ పంటలను అందించడానికి పోలీసులు, రెవెన్యూ, అటవీశాఖలు సాయం చేస్తాయని హామీ ఇచ్చారు. ఈ ఏడాది పాతపాడులో కింగ్ బీన్స్, రాజ్మ, మిల్లెట్ వంటి ప్రత్యామ్నాయ పంటలను అందజేసినట్లు తెలిపారు.అల్లూరి సీతారామరాజు పోలీస్ విభాగం, స్థానిక గ్రామాలతో కలిసి మరింత శాశ్వతమైన, చట్టబద్ధమైన వ్యవసాయ పద్ధతుల వైపు మారేందుకు సహాయం చేస్తామన్నారు. మెరుగైన భవిష్యత్తు దిశగా అడుగులు వేయాలని వారికి సూచించారు. ఈ ఆపరేషన్ లో భాగంగా ఈగల్ ఐజీ రవి కృష్ణ, ఈగల్ ఎస్పీ నాగేశ్ బాబు, జిల్లా ఎస్పీ అమిత్ బర్దార్, డీఎస్పీ ప్రమోద్, డీఈవో బ్రహ్మాజీరావు, ఫారెస్ట్ అధికారులు, జల్లా పంచాయతీ అధికారులు పాల్గొన్నారు.

# నిరుపేద కుటుంబాలకు బియ్యం అందజేత

కమాన్ పూర్ కమాన్ పూర్ గ్రామపంచాయతీ పరిధిలోని పలువురికి సుందరం ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు బోనాల వెంకటస్వామి ఆదేశాల మేరకు బియ్యాన్ని బుధవారం అందజేశారు. కమాన్పూర్ గ్రామపంచా యతీ పరిధిలో గల అంబేద్కర్ కాలనీకి చెందిన ఈదునూరి కొమరమ్మ కుమారుడు సదానందం అలాగే కల్వల రాయమల్లమ్మ అనారోగ్యంతో మృతి చెందారు. ఈ విషయాన్ని నక్క శంకర్ ద్వారా సమాచారం తెలుసుకున్న బోనాల వెంకటస్వామి తమ సభ్యుల ద్వారా వారికి ఒక్కొక్కరికి 25 బియ్యం కిలోల చొప్పున సాయంగా అందజేశారు. ఆపదలో ఆదుకునే తమ సుందరం పౌండేషన్ లక్ష్యమని వెంకటస్వామి పేర్కొన్నారు. ఈ కార్యక్రమం లో చిప్పకుర్తి అరవింద్, కన్నూరి నగేష్, చెన్నోజు చంద్రశేఖర్, ఆ రెల్లి పీరయ్య, కుక్క ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



# అన్నదాత సుఖీభవ పంపిణీకి ఏర్పాట్లు

గుంటూరు, : రైతులకు పెట్టుబడి సాయం అందించేందుకు ఏపీ ప్రభుత్వం అన్నదాత సుఖీభవ పథకం అమలు చేయనుంది. కేంద్రం అమలు చేస్తున్న పీఎం కిసాన్ పథకంతో కలిపి ఈ పథకాన్ని అమలు చేయాలని ప్రభుత్వం భావిస్తుంది. ఈ స్కీమ్ అమలుకు సర్కార్ ప్రయత్నాలు మొదలుపెట్టింది.ఏపీలో కూటమి ప్రభుత్వం...ఎన్నికల హామీల్లో ఒక్కొక్కటి అమలు చేసేందుకు ప్రయత్నిస్తుంది. తాజాగా అన్నదాత సుఖీభవ పథకంపై ప్రభుత్వం అప్డేట్ ఇచ్చింది. కొత్త సంవత్సరంలో రైతులకు శుభవార్త చెప్పింది. రైతుల సంక్షేమానికి సంబంధించిన అన్నదాత సుఖీభవ పథకం అమలుపై ఇటీవల కేబినెట్ లో చర్చించారు. కేంద్ర ప్రభుత్వం పీఎం కిసాన్ పథకం కింద రైతులకు పెట్టుబడి సాయంగా ఏడాదికి మూడు విడతల్లో రూ.6 వేలు ఇస్తుంది. పీఎం కిసాన్ నిధులతో కలిపి రూ.20 వేలు అందించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది.పీఎం కిసాన్ నిధులు తరహాలో మూడు విడతలుగా రాష్ట్ర ప్రభుత్వం అన్నదాత సుఖీభవ నిధులు విడుదల చేయాలని భావిస్తుంది. ఈ మేరకు కేంద్రం ఒక్కో విడతలో ఎంత మొత్తం నిధులు విడుదల చేస్తుంది, రాష్ట్ర ప్రభుత్వం ఎంత విడుదల చేయాలని విషయాలపై చర్చిస్తుంది. త్వరలోనే అన్నదాత సుఖీభవ విధి విధానాలను ఖరారు చేసి పథకాన్ని అమలు చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. ఈ పథకానికి సంబంధించిన మార్గదర్శకాలను త్వరలోనే విడుదల చేస్తామని ప్రభుత్వం చెబుతోంది. అర్హత ఉన్న ప్రతిరైతుకు ఏడాదికి రూ. 20వేలు అందిస్తామని కూటమి నేతలు చెబుతున్నారు. ఈ మేరకు ఇటీవల బడ్జెట్ లో అన్నదాత సుఖీభవ పథకానికి రూ. 4,500 కోట్లను కేటాయించారు.అన్నదాత సుఖీభవ నిధులను ఈ ఏడాది మే నెలలో విడుదల చేస్తామని మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. ఇటీవల నరసాపురంలో నిర్వహించిన ఓ కార్యక్రమంలో మంత్రి రామానాయుడు మాట్లాడుతూ...అన్నదాత సుఖీభవ పథకంపై కీలక వ్యాఖ్యలు చేశారు. అదే విధంగా కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు మత్స్యకారులకు మే నెలలోనే రూ.20 వేలు అందిస్తుందన్నారు.వైసీపీ హయాంలో రైతుభరోసా పేరిట రైతులకు పెట్టుబడి సాయం అందించేవారు. పీఎం కిసాన్ సమ్మాన్ నిధి పేరిట కేంద్రం ఏటా అందించే రూ.6 వేలకు మరో రూ.7,500 కలిపి ఏటా రూ.13,500 అందించేవారు. ఎన్నికల హామీల్లో ఈ మొత్తాన్ని రూ.20 వేలకు పెంచుతామని కూటమి పార్టీలు ప్రకటించాయి. కూటమి ప్రభుత్వం ఈ హామీ అమలుపై దృష్టి సారించింది. మూడు విడతల్లో రూ. 20 వేలు సాయం అందించేందుకు ప్రయత్నాలు చేస్తుంది. ఇప్పటికే అన్నదాత సుఖీభవ పేరిట పోర్టల్ ప్రారంభించింది. అన్నదాత సుఖీభవ పథకం కింద పీఎం కిసాన్ నిధులు రూ.6 వేలకు మరో 14 వేలు కలిపి రూ.20 వేలు అందించనున్నారు

# మణుగూరు ప్రభుత్వ ఐటిఐ లో ముగ్గుల పోటీలు



మణుగూరు జనవరి : మణుగూరు ప్రభుత్వ ఐటిఐ లో బుధవారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను ప్రిన్సిపాల్ బి ప్రభాకర్ ప్రారంభించి ప్రసంగించారు. సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని ఏర్పాటు చేసిన ఈ ముగ్గుల పోటీల్లో విద్యార్థులు తమ ప్రతిభను చాటుకున్నారన్నారు. సంక్రాంతి సంస్కృతి సాంప్రదాయాలను కలబోసే విధంగా ముగ్గులు వేసినారు. అత్యంత ఆకర్షణీంగా ముగ్గులు వేసిన వారిని అభినందించారు. ఈ పోటీలకు న్యాయ నిర్ణయితలుగా టీ ఎన్ జ్యోతిరాణి, సువర్ణ, దేవకరణలు వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల టిఓ జి రవి, ఏటీవోలు జీవీ కృష్ణారావు, ఏ నరసయ్య, ఎం శ్రీనివాసరావు, వేణుగోపాల్, సిబ్బంది పాల్గొన్నారు.

# ఇందిరమ్మ మోడల్ హౌస్ కు భూమి పూజ చేసిన ఎమ్మెల్యే పాయం

మణుగూరు జనవరి : మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో ఇందిరమ్మ ఇండ్ల మోడల్ హౌస్ నిర్మాణం కొరకు బుధవారం పినపాక నియోజకవర్గ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ప్రభుత్వం డబుల్ బెడ్రూమ్ ఇండ్ల పేరుతో నిధులు దుర్వినియోగం చేసి ఇండ్లు పూర్తి చేయకుండా గారడి మాటలతో ప్రజలను మోసం చేసిందని విమర్శించారు. ఇందిరమ్మ రాజ్యంలో అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇండ్లు వస్తాయని, విపక్షాలు చెప్పే మాటలు నమ్మి మోసపోవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ తేళ్ళూరి శ్రీనివాసరావు, హౌసింగ్ పి.డి శంకర్, మున్సిపాలిటీ ఏఈ సత్యనారాయణ, రెవెన్యూ అధికారులు, హౌసింగ్ సిబ్బంది కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# చైనా జలఖడ్గంపై దృష్టి పెట్టాల్సిందే!

చైనా ఎప్పటికప్పుడు కొత్త ఎత్తులు వేస్తూనే ఉంటుంది. పొరుగు దేశాలను గుప్పిట్లో ఉంచుకోవడం, ఎదుగుతున్న దేశాలకు ఎసరు పెట్టడం దాని లక్ష్యంగా ఉంది. కరోనాతో ప్రపంచాన్ని అతలాకుతలం చేసిన చైనా తన మనుగడ, పెత్తనం కోసం ఎంతకైనా తెగిస్తుందని రుజువు చేసింది. తాజాగా హెచ్ఎంపివి వైరస్ కూడా ఇలాంటిదే. కరోనా సమయంలోనూ తమకు సంబంధం లేదని బుకాయించింది. అలాగే ఇప్పుడీ కొత్త వైరస్‌పైనా ప్రపంచాన్ని బుకాయిస్తోంది. ఎలాంటి ప్రాణాంతకం కాదని చెబుతోంది. చైనా తన మార్కెట్ పరిధిని పెంచుకునే ప్రయత్నంలో ఎలాంటి దురాగతాలకైనా పాల్పడు తుందనడానికి ఇవి నిదర్శనాలు. ఇకపోతే ఇప్పుడు చైనాతో అతిపెద్ద ముప్పు ఏర్పడబోతోంది. భారత్, నేపాల్‌లతో చైనా తన సరిహద్దుల ముక్కోణపు కూడలికి బాగా దగ్గరగా యార్లుంగ్ జాంగ్బో నదిపైన, గంగా ఉపనదిపైన టిబెట్‌లో కొత్త డ్యామ్‌ను నిర్మిస్తున్నదని వార్తలు వచ్చాయి. ఈ వార్త కొన్ని సంవత్సరాలుగా వివిధ వార్తా పత్రికల్లో ప్రచురితమైంది. నిజానికి ఈ డ్యామ్ నిర్మాణం జరిగితే భారత్ భద్రతకు తీవ్ర ముప్పు ఉందన్న ఆందోళన వ్యక్తం అవుతోంది. ఈ క్రమంలో అలాంటిదేమీ లేదని తాజాగ ఆచైనా ప్రకటించింది. దీంతో భారత్‌కు ఎలాంటి ఉపద్రవం రాదని న మ్మబలికింది. చైనా ప్రభుత్వం బ్రహ్మపుత్రకు టిబెట్ పేరు అయిన యార్లుంగ్ జాంగ్బో నది దిగువ పరివాహక ప్రాంతాల్లో ఒక జలవిద్యుత్ ప్రాజెక్టు నిర్మాణాన్ని ఆమోదించింది. జల విద్యుత్ ప్రాజెక్టు యార్లుంగ్ జాంగ్బో నది దిగువ పరివాహక ప్రాంతంలో ఉంటుంది. హిమాలయ ప్రాం తంలో ప్రధాన ఇరుకైన లోయలో డ్యామ్ నిర్మాణం జరుగుతుంది. అక్కడ నది నాటకీయంగా మలుపు తీసుకుని అరుణాచల్ ప్రదేశ్‌లోకి ప్రవహించి, చివరగా బంగ్లాదేశ్‌కు చేరుకుంటుంది. ఆ డ్యామ్ చైనాకు నదీ ప్రవాహంపై నియంత్రణాధికారం కల్పిస్తుందని, ప్రాజెక్టు స్థాయి కారణంగా సరిహద్దు ప్రాంతాలను వరదల్లో ముంచెత్తేందుకు అవకాశం ఇస్తూ, సంక్షోభ సమయాల్లో అధిక మొత్తంలో నీటి విడుదలకు వీలు కల్పిస్తుందని భారత్ ఆందోళన వ్యక్తం చేసింది. కానీ, బ్రహ్మపుత్ర నదిపై చైనా భాగంలో డ్యామ్ నిర్మాణాన్ని ఆమోదించాలన్న తన నిర్ణయాన్ని చైనా సమర్థించుకున్నది. ప్రపంచంలోనే అతిపెద్ద డ్యామ్‌ను టిబెట్‌లో బ్రహ్మపుత్ర నదిపై నిర్మించాలన్న చైనా యోచనపై భయాందోళనలు అనవసరమని చైనా విదేశాంగ మంత్రిత్వశాఖ అధికార ప్రతినిధి మావో నింగ్ డిసెంబర్ 27న అన్నారు.మెగా ప్రాజెక్టు దిగువ నదీ పరివాహక దేశాలను ప్రభావితం చేయదని, దశాబ్దాల తరబడి అధ్యయనాల ద్వారా వాటి భద్రత ఆందోళనలను పరిగణనలోకి తీసుకుని సరి చేయడమైందని మావో నింగ్ స్పష్టం చేశారు, 137 బిలియన్ డాలర్ల ప్రాజెక్టును టెక్టోనిక్ ప్లేట్ సరిహద్దు పొడుగునా పర్యావరణపరంగా సున్నితమైన హిమాలయ ప్రాంతంలో నిర్మిస్తున్నారు. ప్రపంచంలోని అతిపెద్ద డ్యామ్ ప్రభావం పల్లపు ప్రాంతాలపై పడదని ఆమె చెప్పారు. ఆ డ్యామ్‌ను ఉపగ్రహ చిత్రాల ఆధారంగా దిగువ ప్రాంతాలకు నీటి ప్రవాహం నియంత్రణ కు చైనా ఉపయోగించుకోవచ్చు. చైనా ప్రభుత్వ ఆధ్వర్యంలోని జిన్‌హువా వార్తా సంస్థ ఉటంకించిన అధికార ప్రకటన ప్రకారం, తుదకు 2024 డిసెంబర్ 25న అన్ని సందేహాలను పరిహరిస్తూ వెలువరించింది. ఇప్పుడు భారత్ అభ్యంతరం చెప్పడంతో అంతగా భయపడాల్సిన అవసరం లేదని అంటోంది. సీమాంతర నదుల అభివృద్ధి పట్ల చైనా ఎల్లప్పుడూ బాధ్యతాయుతంగా ఉంటున్నట్లు, టిబెట్‌లో జలవిద్యుత్ అభివృద్ధిపై దశాబ్దాల పాటు అధ్యయనం చేసినట్లు, ప్రాజెక్టు భద్రతకు, పర్యావరణ, వాతావరణ పరిరక్షణకు సముచిత చర్యలు తీసుకున్నట్లు మావో నింగ్ చెబుతున్నా నమ్మశక్యంగా లేవు. భారత సరిహద్దుకు సమీపంగా టిబెట్‌లో బ్రహ్మపుత్ర నదిపై 137 బిలియన్ యుఎస్ డాలర్లు విలువ చేసే భూగ్రహంపై అతిపెద్ద మౌలిక వసతుల ప్రాజెక్టుగా పేర్కొంటున్న ప్రపంచంలోనే ప్రతిపాదిత అతిపెద్ద డ్యామ్ నదీ పరివాహక దేశాలు భారత్, బంగ్లాదేశ్‌లలో ఆందోళనలు కలిగిస్తోంది. డ్యామ్‌పై మొత్తం పెట్టుబడి ఒక ట్రిలియన్ యువాన్లు (137 బిలియన్ డాలర్లు) దాటిపోగలదు. ప్రపంచంలోనే అతిపెద్దదిగా పరిగణిస్తున్న చైనా సొంత త్రీ గార్జెస్ డ్యామ్ సహా ఈ గ్రహంపై ఏ ఇతర ఒక్క మౌలికవసతుల ప్రాజెక్టు ఖర్చును మరుగుజ్జును చేస్తుంది. హిమాలయ పర్వత ప్రాంతంలో ఒక భారీ లోయలో డ్యామ్‌ను నిర్మించడమన్నది పొరుగున ఉన్న మనపై జలయుద్ధ ట్యాంకును ఎక్కు పెట్టడమే. కైలాస శిఖరం నుంచి టిబెట్ మీదుగా భారత్, బంగ్లాదేశ్‌లకు పేర్ల మార్పుతో ప్రవహిస్తున్న నదిపై మెగా డ్యామ్‌ల నిర్మాణం గురించి పోటాపోటీగా వ్యవహరిస్తున్నా రెండు దేశాలు సీమాంతర నదులకు సంబంధించిన వివిధ అంశాలను చర్చించేందుకు 2006లో నిపుణుల స్థాయి యంత్రాంగం ను ఏర్పాటు చేశాయి. దాని కింద వరద కాలాల్లో బ్రహ్మపుత్ర నది, స్లటెజ్ నదికి సంబంధించి జలప్రవాహ సమాచారాన్ని భారత్‌కు చైనా అందజేస్తున్నది. సరిహద్దు అంశానికి సంబంధించి భారత, చైనా ప్రత్యేక ప్రతినిధులు ఎన్ఎస్ఎ అజిత్ దోవల్, చైనా విదేశాంగ శాఖ మంత్రి వాంగ్ యి మధ్య డిసెంబర్ 18న బీజింగ్‌లో జరిగిన చర్చల్లో సీమాంతర నదుల డేటా పంచుకోవడమైంది. సీమాంతర దేశాలపై దూకుడుగా వ్యవహరించేందుకు తన డ్యామ్‌లను ఉపయోగించుకుంటున్న చరిత్ర చైనాది. ఏడాది పొడుగునా వర్షపాతంలో గణనీయమైన పెరుగుదల ఉన్నది. జూలై, సెప్టెంబర్ మధ్య గరిష్ఠంగా ఉంటుంది. బ్రహ్మపుత్ర నది రెండు అధిక నీటిమట్టం సీజన్‌లను చూస్తుంటుంది. ఈ క్రమంలో బ్రహ్మపుత్ర ద్వారా నీటిని ఒక్కసారిగా వదిలితే అది భారత్‌ను ముంచెత్తే ప్రమాదం ఉందన్న ఆందోళన వస్తోంది.

# పుస్తకం వైపు యువత చూపు



పోనీ, అని అన్యాయపు పోకడలు సహించరు' అన్న శ్రీశ్రీ మాటలను నేటి యువతీ యువకులు కొందరు నిజం చేస్తున్నారు. నేటి తరం సాహిత్యాన్ని పట్టించుకోవటం లేదనే వాదనను పటాపంచలు చేస్తున్నారు. భాష ఏదైనా సాహిత్య పిపాసులుగా నేటి యువతీ యువకులు ముందుకు దూసుకొస్తున్నారు. ఇలాంటి వారికి వేదికగా 35వ విజయవాడ పుస్తక మహోత్సవం (ఇందిరాగాంధీ మున్సిపల్ కార్పొరేషన్ స్టేడియం) నిలిచింది. సందర్శకులతోపాటుగా బుక్‌స్టాల్స్ నిర్వహణలోనూ, రచన, ప్రచురణ ప్రక్రియల్లోనూ చాలామంది యువత చాలా స్టాళ్లల్లో కనిపిస్తున్నారు. ఈ పుస్తక మహోత్సవంలో మొత్తంటా 270 స్టాళ్లు ఏర్పాటు చేశారు. చిన్న పిల్లల పుస్తకాల నుంచి పెద్దల వరకూ, మహిళలు, యూనివర్శిటీ, రీసెర్చ్, వైద్యం, కంప్యూటర్, ఇంజనీరింగ్, ఎఐ, ఎంఐ వంటి సబ్జెక్టు, సాహిత్యం, కథలు, కవితలు, చరిత్ర, జనరల్‌నాలెజ్జ్, దేశంలోని వివిధ ప్రాంతాలకు చెందిన పుస్తకాలు, విదేశీ భాషలకు సంబంధించిన పుస్తకాలు సైతం ఇక్కడ కొలువు తీరాయి. అన్ని ప్రభుత్వ ఉద్యోగాలకు అవసరమైన పోటీపరీక్షల మెటీరియల్ ఇక్కడ అందుబాటులో ఉంది. ఆయా స్టాళ్లలో ఎక్కువ మంది యువత కనిపిస్తుండటం ద్వారా సాహిత్యానికి ఏమాత్రం ఆదరణ తగ్గలేదనేది స్పష్టమవుతోంది.**నలుగురు యువకుల 'కథ':** ఆకర్షణీయమైన ఉద్యోగాలను సైతం వదిలి పెట్టి 'కథల' ఊతంతో పాఠశాల విద్యలో నూతన ఒరవడిని సృష్టిస్తున్నారు కాకినాడకు చెందిన నలుగురు యువకులు. వారే రవి, వంశీ, సిద్ధు, సుదర్శన్. విద్యారంగంపై ఆసక్తితో ఈ నలుగురు మిత్రులు కలిసి చేస్తున్న వినూత్న ప్రయత్నమే 'టేల్స్ టు టీచ్' అనే అంకుర సంస్థ. 'లెర్న్ త్రూ స్టోరీస్' అనేది వీరి నినాదం. పాఠశాల స్థాయి సబ్జెక్టులను సైతం విద్యార్థులు సులువుగా నేర్చుకునేందుకు ఉపయోగపడే కథల పుస్తకాలను వీరు రూపొందిస్తున్నారు. బట్టీ పట్టే విధానాన్ని దూరం చేయడానికి, సైన్సు, లెక్కలు, సోషల్ వంటి సబ్జెక్టుల పై పిల్లలకు ఆసక్తి పెంచడానికి, ఆయా అంశాలను కథల రూపంలో అందిస్తున్నారు. కథల ద్వారా నేర్చుకోవడం వల్ల చదివింది చాలా కాలం పాటు గుర్తుంటుందని, భాష, భావవ్యక్తీకరణ నైపుణ్యాలు మెరుగుపడతాయని పలు నివేదికలు కూడా తెలుపుతున్నాయి. వీరు రూపొందించిన 'హలో డాక్టర్', 'ద సైంటిస్ట్ గ్రాండ్ పా' కథల పుస్తకాలు రైటర్స్ స్టాల్ (స్టాల్ నంబర్ 43)లో ప్రదర్శన, కొనుగోలుకు ఉంచారు. హైదరాబాద్ బుక్ ఫెస్టివల్‌లో విశేష ఆదరణను పొంది 600 కాపీలు అమ్ముడైన ఈ కథల పుస్తకాలు, విజయవాడ బుక్ ఫెస్టివల్‌లో సైతం పిల్లలను, తల్లిదండ్రులను, ఉపాధ్యాయులను ఎంతగానో ఆకట్టుకుంటున్నాయి. చిన్ని చిన్ని కథల ద్వారా అత్యంత విలువైన జీవిత పాఠాలు నేర్చుకోవచ్చునని చాటిచెప్పిన 'పంచతంత్ర'ను స్ఫూర్తిగా తీసుకుని, కథల ద్వారా సైన్స్, లెక్కలు, ఇతర క్లిష్టమైన సబ్జెక్టులను వివరిస్తున్నట్టు వారు చెబుతున్నారు. మరిన్ని కథల పుస్తకాల ద్వారా పిల్లల నైపుణ్యాలను, జ్ఞానాన్ని పెంపొందించడమే తమ లక్ష్యమని ఈ యువకులు చెబుతున్నారు.

**'కొంతమంది యువకులు రాబోవు యుగం దూతలు..**
**పావన నవజీవన బృందావన నిర్మాతలు**
**బానిస పంథాలను తలవంచి అనుకరించరు**

వంశీకృష్ణ రైల్వే డిఆర్ఎం కార్యాలయంలో అకౌంట్స్ విభాగంలోనూ, రవితేజ పోస్టల్ బ్రాంచ్‌మాస్టర్‌గానూ, సిద్ధార్థ ఇంజనీర్, సుదర్శన్ అరబిందో ఫార్మాలో రీసెర్చ్ విభాగంలో పనిచేశారు. సాహిత్యంపై తమకున్న అభిమానంతో తమ ఉద్యోగాలను వదిలి, సాహిత్యరంగంలోకి అడుగుపెట్టారు. **ది గ్రేట్ ఇండియన్ ట్రెజర్, ది ఐడియా రిజల్యూషన్‌కు ఆదరణ:** హైదరాబాద్‌కు చెందిన రఘునందన్ వద్ద టీసీఎస్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్. ఆయన రాసిన ది గ్రేట్ ఇండియన్ ట్రెజర్, ది ఐడియా రిజల్యూషన్ పుస్తకాలు పుస్తక మహోత్సవంలో హాట్‌కేకుల్లా అమ్ముడుపోతున్నాయి. భారత స్వాతంత్ర్య సంగ్రామంలోనూ, అనంతరం పరిణామాల్లోనూ నేటి యువత స్ఫూర్తిపొందటానికి ఎలా ప్రేరణ పొందాలో ఈ పుస్తకాల్లో ప్రేరణాత్మకమైన కథలుగా మలిచారు. **రైటర్స్ స్టాల్‌లో సరికొత్తగా:** 42 నుంచి 43 వరకూ ఉన్న స్టాళ్లలో రచయితలు రాసిన పుస్తకాలను వారే విక్రయించుకుంటున్నారు. 56 మంది రచయితల పుస్తకాలను ఈ స్టాళ్లలో ఉంచారు. రచయితలే స్వయంగా సందర్శకులకు తమ పుస్తకాల గురించి వివరిస్తున్నారు. అక్కడికి వచ్చే రచయితలు, కవులు, కళాకారులు వారితో ఫొటోలు దిగి కరచాలనాలు చేస్తూ సంతోషంగా గడుపుతున్నారు. ఆంధ్రప్రదేశ్ రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి చలపాక ప్రకాష్, ఈ స్టాల్‌ను సమన్వయం చేస్తున్నారు. 157వ స్టాల్‌లో అజూ పబ్లిషర్స్ ప్రచురించిన 'అమ్మడైరీలోని కొన్ని పేజీలు' నవల విరివిగా అమ్ముడవుతోంది.**రాజ్యాంగం, అంబేద్కర్, కారల్‌మార్క్స్ పుస్తకాలకు ఆదరణ:** కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం భారత రాజ్యాంగాన్ని సమూలంగా మార్చాలనే కుతంత్రాలు పన్నుతున్న వేళ, ఈ పుస్తక మహోత్సవంలో భారత రాజ్యాంగం, రాజ్యాంగ పీఠికలు, చట్టాలు తదితర పుస్తకాలకు ఎక్కువగా ఆదరణ కనిపిస్తోంది. సందర్శకులు ఎక్కువగా ఈ తరహా పుస్తకాలు, వాటికి సంబంధించిన లేటెస్ట్ బుక్స్, విమర్శనా గ్రంథాలను సైతం కొనుగోలు చేస్తున్నారు. డాక్టర్ అంబేద్కర్ రచించిన ఇతర పుస్తకాలకు, కారల్‌మార్క్స్ రచనలకు ఈ పుస్తక మహోత్సవంలో ఆదరణ కనిపిస్తోంది. 40 ఏళ్లు దాటని యువతీ యువకులు తాజాగా రాసిన దాదాపు వంద కథ, నవల, కవితా సంపుటాలు ఈ ఫెస్టివల్‌లో లభ్యమవుతున్నాయి. సందర్శకుల్లోనూ పెద్ద సంఖ్యలో యువతీ యువకులు. పిల్లలను వెంట తీసుకొస్తున్న తల్లిదండ్రులు కనిపిస్తున్నారు.

## పేద ప్రజలకు అండగా నిలుస్తున్న రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు

**-అనారోగ్య బాధితులకు మంత్రి భరోసా**
**-2 లక్షల 50 వేల ఎల్ఓసి మంజూరు చేయించిన మంత్రి శ్రీధర్ బాబు**



మంథని పేద ప్రజలకు రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అండగా నిలుస్తున్నారు. అనారోగ్య బాధితులకు మంత్రి శ్రీధర్ బాబు భరోసా కల్పిస్తున్నారు.మంథని నియోజకవర్గ పరిధిలోని జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహా ముత్తారం మండలంలోని పెగడపల్లి గ్రామానికి చెందిన జర్పుల పెంగ్ల బాయి కి అనారోగ్య వైద్య చికిత్సకు సంబంధించిన నిమ్స్ ఆసుపత్రి లో చికిత్స పొందుతు సహాయం కొరకు తెలంగాణ రాష్ట్ర ఐటి,పరిశ్రమల మరియు శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు కు తెలుపగా వెంటనే స్పందించిన మంత్రి ముఖ్యమంత్రి సహాయనిది ద్వారా వైద్య ఖర్చుల నిమిత్త%శీ% వీరికి 2 లక్షల 50వేల ఎల్ఓసి మంజూరు చేయించారు.మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఆస్పత్రి సహాయకులు బుధవారం వారికి హైదరాబాద్ లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎల్ఓసి పత్రాలను అందజేశారు.2 లక్షల 50 వేల రూపాయలు మంజూరు చేపించి అండగా నిలిచినా మంత్రి శ్రీధర్ బాబు కు పెంగ్ల బాయి కుటుంబ సభ్యులు ధన్యవాదాలు తెలిపారు.

## ఘోర ప్రమాదం.. లారీ క్యాబిన్‌లో ఇరుక్కున్న డ్రైవర్, క్లీనర్



హుజూరాబాద్ : బుదవారం తెల్లవారు జామున ఘోర ప్రమాదం చోటు చేసుకుంది. అదుపుతప్పిన లారీ చెట్టును ఢీకొట్టడంతో క్లీనర్ మృతి చెందిన ఘటన కరీంనగర్ జిల్లాలో చోటు చేసుకుంది. వివరాల్లో కి వెలితే.. కృష్ణా జిల్లా నాచారం నుంచి లోడ్ వేసుకొని గుజరాత్ వెళ్తున్న లారీ.. హుజూరాబాద్ మండలం మాందాడి పల్లిలో వరంగల్ – కరీంనగర్ జాతీయ రహదారి పై అదుపుతప్పి చెట్టును ఢీకొట్టింది. దీంతో ముందు బాగు పూర్తిగా ధ్వంసం కావడం తో లారీ క్యాబిన్ లో డ్రైవర్, క్లీనర్ ఇరుకున్నారు. ఇది గమనించిన స్థానికులు పోలీసులకు, ఫైర్ సిబ్బందికి సమాచారం అందించగా ప్రమాద స్థలానికి చేరుకొని క్యాబిన్ లో ఇరుకున్న వారిలో డ్రైవర్ ను బయటకు తీశారు. అయితే తీవ్రగాయాలైన క్లీనర్ అందులోనే మృతి చెందాడు. డ్రైవర్‌ను బయటకు తీసిన స్థానికులు, ఫైర్ సిబ్బంది.. అతన్ని చికిత్స నిమిత్తం.. హుజరాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

## గంగారాం తండాలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరం



చొప్పదండి : జగిత్యాల జిల్లా చొప్పదండి నియోజకవర్గం కొడిమ్యాల మండలంలోని గంగారాం తండా గ్రామంలో బుధవారం కొడిమ్యాల మండల కేంద్రానికి చెందిన ఆదిత్య హాస్పిటల్ డాక్టర్ మనోహర్ వేపూరి ఎంబీబీఎస్ 230 మంది రోగులను పరీక్షించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా బీ ఆర్ ఎస్ మండల అధ్యక్షులు పులి వెంకటేష్ గౌడ్ మాట్లాడుతూ మారుమూల ప్రాంతాల ప్రజలకు సేవ చేయాలనే సదుద్దేశంతో డాక్టర్ మనోహర్ ఎంబిబిఎస్ ఆదిత్య హాస్పిటల్ ఏర్పాటు చేసి ఎంతో మంది రోగులకు అత్యుత్తమమైన వైద్యం అతి తక్కువ ఖర్చుతో అందిస్తున్నారని అన్నారు..గ్రామస్తుల ఆహ్వానం మేరకు గంగారం తండాలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేయడం అభినందనీయం అన్నారు.ఈ కార్యక్రమంలో తాజా మాజీ సర్పంచ్ బోజ్యా నాయక్, తాజా మాజీ ఎంపిటీసి వినోద్,యూత్ నాయకులు అల్లేశ్వరి గణేష్,ఆర్ ఎంపి, పి ఎంపి కొడిమ్యాల మండల ప్రధాన కార్యదర్శి రామిడి సతీష్ రెడ్డి,ప్రథమ చికిత్స వైద్యులు రొక్కం రాజేందర్ రెడ్డి, గంగాధర్, గ్రామ ప్రజలు, హాస్పిటల్ సిబ్బంది రాజు, భరత్, అఖిల తదితరులు పాల్గొన్నారు.

## ప్రజాహిత కార్యక్రమాల్లో లైన్స్ క్లబ్ ముందుండాలి

**ఉమ్మడి జిల్లా లయన్స్ క్లబ్ గవర్నర్ వెంకటేశ్వరరావు**





కమాన్ పూర్, జనవరి 8:కమాన్ పూర్ లైన్స్ క్లబ్ ప్రజాహిత కార్యక్రమాల్లో ముందుండాలి అని ఉమ్మడి కరీంనగర్ జిల్లా లైన్స్ క్లబ్ గవర్నర్ ఎన్ .వెంకటేశ్వరరావు అన్నారు. కమాన్ పూర్ మండలంలోని జూలపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని ఆదర్శ నగర్ లోని సాన గార్డెన్ లో బుధవారం లయన్స్ క్లబ్ ఆఫ్ కమాన్ పూర్ ఆధ్వర్యంలో కుట్టు మిషన్లు పంపిణి చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కరీంనగర్ ఉమ్మడి జిల్లా లయన్స్ క్లబ్ గవర్నర్ ఎన్. వి. రావు చేతుల మీదుగా మండలంలోని నిరుపేద మహిళలకు కుట్టు మిషన్లు అందజేశారు. ఈ సందర్భంగా ఎన్. వి. రావు మాట్లాడుతూ... కమాన్ పూర్ లయన్స్ క్లబ్ ఏర్పాటుయైన అనాతి కాలంలోనే సేవ కార్యక్రమాలు చేపట్టడంలో ముందంజలో ఉందన్నారు. లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నేత్ర దానం, శరీర దానం కార్యక్రమాలతో పాటు నిరుపేద కుటుంబాలకు ఆపదలో అండగా నిలుస్తుందన్నారు. ప్రస్తుతం నిరుపేద మహిళలకు స్వయం శక్తితో జీవించేందుకు కుట్టు మిషన్ లు పంపిణి చేసి వారి జీవనోపాదికి తోడ్పాటునందించడం హర్షనీయమన్నారు. ఇదే స్ఫూర్తితో ఇక ముందు కూడ సేవా కార్యక్రమాలు చేపడుతూ.. ఆదర్శంగా నిలువాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కమాన్ పూర్ లయన్స్ క్లబ్ అధ్యక్షులు సాన రామకృష్ణారెడ్డి, ప్రధాన కార్యదర్శి నల్లవెల్లి శంకర్, లయన్స్ క్లబ్ సభ్యులు ఇనగంటి భాస్కర్ రావు, చెప్పాల సమ్మయ్య, గుమ్మడి అంజయ్య పటేల్, మచ్చగిరి రాము, వాలేటి వెంకటేశ్వర్ రావు, వినోద్ కుమార్, సంపత్ రావు, జయ ప్రకాష్ చౌడ, కంకటి శ్రీనివాస్, అతీఫ్, వెంకటేష్, జబ్బార్ ఖాన్,

## లోన్ వేదింపులతో మనస్తాపం

**పురుగుల మందు తాగి యువకుడు ఆత్మహత్య**

కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా: సిర్పూర్(టి): రుణ బకాయిల వేదింపులు ఓ వ్యక్తి ప్రాణాలు తీసాయి. జిల్లా కో-ఆపరేటివ్ బ్యాంకు అధికారుల ఒత్తిడిని తట్టుకోలేక సిర్పూర్(టి) మండలం శివపూర్ గ్రామానికి చెందిన కారం సంతోష్ (30) పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సంతోష్ మంగళవారం సాయంత్రం తన ఇంట్లోనే పురుగుల మందు తాగడంతో, కుటుంబ సభ్యులు వెంటనే ఆసుపత్రికి తరలించారు. అయితే చికిత్స పొందుతూ అతడు మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు, సంతోష్ తీసుకున్న రుణంపై బ్యాంకు అధికారులు తీవ్ర ఒత్తిడి చేయడంతోనే అతడు మనస్తాపానికి గురై ఈ తీవ్ర నిర్ణయం తీసుకున్నాడని పోలీసులు తెలిపారు. బ్యాంకు మేనేజర్ సహా సంబంధిత సిబ్బందిపై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు అధికారులు వెల్లడించారు.



## దివ్యాంగుల అభ్యున్నతికి సంపూర్ణ సహకారం అందిస్తాం

**– ఎమ్మెల్యే విజయ రమణ రావు**



పెద్దపల్లి దివ్యాంగుల అభ్యున్నతికి జిల్లా యంత్రాంగం తరపున అవసరమైన సంపూర్ణ సహకారం అందజేస్తామని ఎమ్మెల్యే విజయరమణ రావు, లిజిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్షలు అన్నారు. బుధవారం జిల్లా కలెక్టరేట్ ప్రాంగణంలోని పెరేడ్ గ్రౌండ్స్ లో స్థానిక ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణా రావుతో కలిసి అలింకో సంస్థ నిర్వహించిన క్యాంపులో ఎంపిక కాబడిన దివ్యాంగులకు 27 లక్షల విలువ గల ఉపకరణాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత నవంబర్ నెలలో అలింకో సంస్థ ద్వారా క్యాంప్ నిర్వహించి పెద్దపల్లి అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో అర్హులైన దివ్యాంగుల ను ఎంపిక చేసామని , ఎంపిక కాబడిన దివ్యాంగులకు నేడు 27 లక్షల విలువ చేసే వివిధ ఉపకారణాలను ఉచితంగా పంపిణీ చేయడం జరుగు తుందని అన్నారు. రాబోయే 2 నెలల వ్యవధిలో మరొకసారి క్యాంపు నిర్వహించి ఇంకా ఎవరైనా దివ్యాంగులు పెండింగ్లో ఉంటే వారిని గుర్తించి అవసరమైన పరికరాల పంపిణీకి చర్యలు చేపడతామని కలెక్టర్ తెలిపారు. జిల్లాలోని ప్రతి పాఠశాలను ఆర్.బి.ఎస్.కే బృందాలు పర్యటిస్తూ పిల్లల ఎదుగుదలను రెగ్యులర్ గా మానిటర్ చేస్తున్నారని, ఆరోగ్య సమస్యలు ఉన్న పిల్లలను గుర్తించి వారికి అవసరమైన చికిత్స అందించ దం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. చిన్నపిల్లల ఎదుగుదల సమస్యలను గుర్తించేందుకు మన పెద్దపల్లి జిల్లా మాత శిశు ఆసుపత్రిలో డి.ఈ.ఐ.సి సెంటర్ ను ఏర్పాటు చేసుకున్నామని అన్నారు. జిల్లాలో వినికిడి సమస్య ఉన్న పిల్లలను గుర్తించామని వారికి త్వరలోనే ఉచితంగా వినికిడి యంత్రాలను అందజేస్తామని కలెక్టర్ తెలిపారు. దివ్యాంగుల జీవనోపాధి కోసం వ్యాపార యూనిట్ల స్థాపనకు రుణాలు అందించేందుకు జిల్లా యంత్రాంగం సంపూర్ణ సహకారం అందిస్తుందని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి వేణు గోపాల రావు, మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ ఈర్ల స్వరూప, ప్రజాప్రతి నిధులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో చిత్రలేఖనం పోటీలు




కమాన్ పూర్. రామగిరి మండలం సెంటినరీ కాలనీ లైన్స్ క్లబ్ ఆధ్వర్యంలో చిత్రలేఖనం పోటీలు నిర్వహించడం జరుగుతుందని నిర్వాహకులు ప్రోగ్రామ్ ఇన్చార్జి డాక్టర్ మేకల శరణ్య మారుతి యాదవ్, బహుమతి ప్రదాత మాజీ జడ్పిటిసి గంట వెంకటరమణారెడ్డి, మరియు లైన్స్ క్లబ్ అధ్యక్షుడు ములుముడి శ్రీనివాస్ ప్రధాన కార్యదర్శి అబ్బుకేశవరెడ్డి తెలిపారు. వివేకానందుని జయంతి సందర్భంగా నిర్వహించే ప్రపంచ యువజన దినోత్సవం అని పురస్కరించుకొని పిల్లల్లో పెద్దలపట్ల గౌరవాన్ని దేశభక్తిని పెంపొందించుటకు భవిష్యత్ వారు వేసే బాటిల్ సన్మార్గంలో నడవాలని ఉద్దేశంతో ఆన్లైన్ చిత్రలేఖనం పోటీలు నిర్వహించడం జరుగుతుందని అన్నారు. ఈ యొక్క పోటీలను ఐదు సంవత్సరాల నుండి 16 సంవత్సరాలు గల మీ పిల్లల చే స్వామి వివేకానందుని జీవిత చరిత్ర పై డ్రైవ్ వేయించి దాని ఫోటో తీసి ఫోటోతో పాటు తమ వివరాలు పేరు వయస్సు తరగతి పాఠశాల పేరు ఫోన్ నంబరు గ్రామము వివరాలను నైజీలో 9014255745 నంబర్కు వాట్స్అప్ చేయగలరు. ఈనెల 10వ తేదీన చివరి 6 గంటల వరకు లోపల అందజేయాలి. గెలుపొందిన వారికి బహుమతులు అంజయ్య బడును.

# విదేశాలకు వెళ్లే ముందు జాగ్రత్త!



చదువు, ఉద్యోగం, ఉపాధి అవకాశాల కోసం విదేశాలకు వెళ్లాలనేది చాలామంది రంగుల కల. అక్కడికి వెళ్తే తమ జీవితాల్లో వెలుగు నిండుతుందని సంపాదన బాగా ఉంటుందని, మంచి జీతాన్ని, జీవితాన్ని అనుభవించొచ్చుననే ఆశతో ఎక్కువమంది విదేశాలకు వెళ్లాలనుకుంటారు. అలాంటివారు ముందుగానే తగిన సమాచారం తెలుసుకోవాలి.ప్రపంచంలోని పలు దేశాలు ఇప్పుడు తమ దేశంలో విద్య, ఉద్యోగ, ఉపాధి అవకాశాల కోసం ఇతర దేశాల వారిని ఆహ్వానిస్తున్నాయి. అక్కడి ప్రభుత్వాలు చదువుకునేందుకు కొన్ని రాయితీలు, చదువు పూర్తయిన తర్వాత తమ దేశంలో ఉద్యోగాలు చేసుకోవటానికి అవకాశాలు కల్పిస్తుండటంతో మన దేశం నుంచి లక్షలాది మంది విద్యార్థినీ విద్యార్థులు వెళ్తున్నారు. కొందరు అక్కడే స్థిరపడుతున్నారు కూడా. గతంతో పోలిస్తే నేడు మారుమూల ప్రాంతాల నుంచి కూడా 10 నుండి 15 మంది వరకూ విదేశాలకు వెళ్లిన వారు ఉంటున్నారు.జీవనోపాధి కోసం: భవన నిర్మాణ రంగం, క్లీనింగ్, డ్రైవర్లుగా, సెక్యూరిటీ తదితర విభాగాల్లో పనిచేసేందుకు చాలామంది గల్ఫ్ దేశాలకు వెళ్తున్నారు. మహిళలైతే ఇళ్లల్లో పనులు చేసేందుకు వె ళ్తున్నారు. విదేశాలకు వెళ్లిన వారు కారణాలు ఏమైనా అక్కడ పడే ఇబ్బందులు అనేకం ఉంటున్నాయి. ముఖ్యంగా గల్ఫ్ దేశాలకు వెళ్లే వారు స్వదేశానికి తిరిగి రావాలంటే నానా యాతనలు పడుతు న్నారు. అన్ని ధృవీకరణ పత్రాలు, వీసా, పాస్‌పోర్టు వంటివి ఉంటే ఇబ్బందులు ఉండవు. కానీ విదేశాలకు పంపుతామని కొందరు డూప్లికేట్ పత్రాలు సృష్టించటం, అక్రమ పద్ధతుల్లో పంపిస్తుండటం తో అక్కడికి వెళ్లిన వారు ఆ తర్వాత ఇబ్బందులు పడుతున్నారు.

అక్రమార్కులతో జాగ్రత్త: 'ఎంత ఖర్చయినా ఫర్వాలేదు.. విదేశాలకు వెళ్తే సంపాదించుకుని అప్పులు తీర్చుకోవచ్చు, పిల్లల భవిష్యత్తుకు తోడ్పాటు ఉంటుందని, ఇల్లు కట్టుకోవాలని చాలామంది ఆశతో వెళ్తున్నారు. అలాంటి వారి ఆశలను ఆసరాగా చేసుకుని అక్రమార్కులు మోసగిస్తుంటారు. చదువు, ఉద్యోగం పేరుతో విదేశాలకు చాలా తక్కువ డబ్బుతో పంపిస్తామని కొందరు ఏజెంట్లు నమ్మి ముందే డబ్బులు తీసుకుంటారు. ఆ తర్వాత వీసా, పాస్‌పోర్టులు ఏర్పాటు చేయకపోవడంతో వారు ఇబ్బందులు పడుతున్నారు. అందువల్ల అధీకృత ఏజెంట్లు, కన్సల్టెంట్ల ద్వారానే విదేశాలకు వెళ్లటం చాలా ఉత్తమం. సక్రమంగా వలస వెళ్ళని వారు జైలు పాలవ్వడం, జరిమానాలు కట్టాల్సి రావడం జరుగుతుంది. ఎలాగోలా విదేశాలకు వెళ్లాలనే ఆలోచన సరైంది కాదు.విదేశాలకు వెళ్లాలనుకునే వారు అధీకృత ఏజెంట్లు, కన్సల్టెంట్ల ద్వారానే వెళ్ళాలి. ఆ కంపెనీ వివరాలు పూర్తిగా తెలుసుకుని వీసా వచ్చాక మాత్రమే వెళ్ళాలి. ప్రతిదాన్ని ఒకటికి రెండుసార్లు ఆలోచించటం మంచిది. ఆన్‌లైన్ మోసాలపై అప్రమత్తం: ఆకర్షణీయమైన హామీలతో కూడిన బ్రోచర్లను కొందరు ఆన్‌లైన్ మోసగాళ్లు సోషల్ మీడియాలో పెడుతున్నారు. యువత అవి చూసి ఆన్‌లైన్‌లో నమోదు చేసుకుంటున్నారు. వీరి సమాచారాన్ని సేకరించిన ఆన్‌లైన్ మోసగాళ్ళు వారిని బెదిరింపులకు గురిచేస్తున్నారు. ఆన్‌లైన్ మోసాలు, సైబర్‌క్రైంలకు పాల్పడే ముఠాలు కూడా పెద్దఎత్తున సైట్లలో పొంచివున్నాయి. అందువల్ల విదేశాలకు వెళ్లే వారికి అక్కడి విధివిధానాలపై అవగాహన చాలా ముఖ్యం. ఉన్నత చదువులు చదివి పై చదువుల కోసం వెళ్లే వారికి పెద్దగా ఇబ్బందులు ఉండవు. స్థానికంగా పరిశ్రమల్లో పనిచేసి, ఆ అనుభవంతో కంపెనీ సాయంతోనూ విదేశాలకు వెళ్లే వారికి అంతగా ఇబ్బంది ఉండకపోవచ్చు. కన్సల్టెన్సీల ద్వారా విదేశాల్లో ఉద్యోగంలో స్థిరపడాలనుకునే వారికి అనేక సమస్యలు ఎదురవుతున్నాయి. డబ్బులు తీసుకుని విదేశాలకు పంపే సంస్థలు ఉభయ తెలుగు రాష్ట్రాల్లో ఇబ్బడిముబ్బడిగానే ఉన్నాయి. అయితే కన్సల్టెన్సీలు నమ్మకమైనవి ఉన్నత శ్రేణికి చెందినవి కూడా ఉన్నాయి. కొన్ని మోసపూరితమైనవీ ఉన్నాయి. అందువల్ల మనం ఎంచుకునే సంస్థ, వ్యక్తులను సరిగ్గా పరిశీలించి ఎంపిక చేసుకోవాలి. కంపెనీ గతం, దీని ద్వారా వెళ్లిన అభ్యర్థుల సమాచారం, మిగతా వివరాలు తెలుసుకున్నాకే నిర్ణయం తీసుకోవటం మంచిది. కొన్ని కన్సల్టెన్సీలు తమ వ్యాపారం కోసం అభ్యర్థులను తప్పుడు మార్గాలు, నకిలీ ధ్రువపత్రాల సాయంతో విదేశాలకు పంపాలని చూస్తుంటాయి. అభ్యర్థులు కూడా తమ పని సులువుగా అవుతుందనే ఆశతో వారికి సహకరిస్తుంటారు. విదేశాల్లోని అధికారులు గుర్తిస్తే చాలా చిక్కుల్లో పడతారు. అందువల్ల నకిలీ ధ్రువపత్రాలతో వెళ్తే ఎప్పటికైనా ప్రమాదకరమే అనేది తెలుసుకోవాలి.ప్రపంచ వ్యాప్తంగా మన భారతీయులు: మన భారతీయులు ప్రపంచమంతా విస్తరించివున్నారు. ఐక్య రాజ్యసమితి లెక్కల ప్రకారం ప్రపంచంలో ఇప్పటివరకూ అత్యధికంగా వలస వెళ్లిన వారు భారతీయులే. భారత్ తర్వాత మెక్సికో, రష్యా, చైనా, సిరియా ఉన్నాయి. భారతీయ విదేశాంగ మంత్రిత్వ శాఖ లెక్కల ప్రకారం 2020 విదేశాల్లోని ప్రవాస భారతీయులు, భారతీయ మూలాలున్న వారు 3.2 కోట్లు. ఇందులో భారతీయ పౌరసత్వం ఉన్న వారు సుమారు 1.4 కోట్లు, భారతీయ సంతతివారు 1.8 కోట్లు. అమెరికాలో ఎక్కువగా మనవారు 45 లక్షల మంది వరకూ ఉన్నారు. ప్రవాస భారతీయులు ఉన్న దేశాల్లో యూఎఇ, సౌదీ అరేబియా, అమెరికా, కువైట్, ఖతార్, ఒమన్, నేపాల్, మలేషియా,యూకే తదితర దేశాలు ఉన్నాయి. ఆ తర్వాత మారిషస్‌లో ఉన్నారు. మినీ ఇండియాగా చెప్పుకునే ప్రాంతాల్లో లండన్ సౌతాల్, మలేషియా రాజధాని కౌలాలంపూర్ బ్రిక్‌ఫీల్డ్స్, అమెరికా షికాగో నగరంలోని డెవాన్ ఎవెన్యూ, సింగపూర్, ప్యారిస్‌లోని రూదుఫాబో తదితర ప్రాంతాలను మినీ ఇండియాగా చెబుతుంటారు.ఇవి పాటించటం మేలు: అవకాశాల మళ్లీ రావంటూ ఏజెన్సీలు తొందరపెట్టినా, ఒప్పించే ప్రయత్నం చేసినా ఆలోచించి నిర్ణయం తీసుకోవాలి. ఎంచుకున్న సంస్థ హిస్టరీ, ఇతర వివరాలు తెలుసుకోవాలి.వెళ్లాలనుకుంటున్న దేశం, అక్కడ జాబ్ ఆఫర్ చేస్తున్న కంపెనీ పూర్తి వివరాలు, జీతం ధృవీకరించుకోవాలి. ప్రతి విషయంలోనూ ఇచ్చిన సమాచారం వాస్తవమా? కాదా? బేరీజు చేసుకోవాలి. 'చాలామంది వెళ్తున్నారు' అనే భ్రమలో వెళ్లేందుకు సిద్ధపడితే ప్రమాదాల్లో పడతారు. బ్యాక్‌లాగ్స్ పూర్తిచేయలేక, పట్టా చేతిలో లేనివారు, త్వరగా డబ్బు సంపాదించాలనే ఆశతో వెళ్ళడానికి ప్రయత్నం చేస్తే అక్రమార్కుల బారిన పడి ఇబ్బందులు పడతారు. ఎవ్వరినీ గుడ్డిగా నమ్మొద్దు. ప్రాసెసింగ్ ఫీజు పేరుతో డబ్బులు అడగ్గానే ఇవ్వొద్దు.

# సిక్కోలులో ఘరానా మోసం

శ్రీకాకుళం, జనవరి 9, : ఏపీలో ఘరానా మోసం జరిగింది. నెల్లూరు జిల్లాలోని 'ఆర్ఆర్ ట్రేడర్స్, ఆర్డర్స్ సప్లయర్స్' డిస్కౌంట్ పేరిట జనాలనుంచి కోటి రూపాయలు దోచేశారు. గృహ అవసర వస్తువులు అది తక్కువ ధరలకు ఇస్తామంటూ తాత్కాలిక షాపులు ఏర్పాటు చేసుకున్న దుండగులు అడ్వాన్సులు కట్టించుకుని రాత్రికి రాత్రే పరారయ్యారు. గత నెల రోజులుగా కోట బజారులో అద్దెకు రూములు తీసుకొని ఫర్నిచర్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్, దబారులు, బిందెలు మొదలుగు వస్తువులపై భారీ డిస్కౌంట్ ఇస్తామని నమ్మించి కోటి రూపాయలకుపైగా నగదుతో పరారయ్యారు. ఈ మేరకు 'ఖీఖీ ట్రేడర్స్' డిసెంబర్, జనవరి నెలల్లో కొద్దికొద్దిగా కట్టించుకుని తీరా మొత్తం కట్టగానే పారిపోయారంటూ బాధితులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆడిపిల్లల పెళ్లిళ్ల కోసం దాచుకున్న నగదు సైతం తీసుకుని మోసం చేశారని కన్నీరుమున్నీరవుతున్నారు. కోట మండల కేంద్రంలో గత నెలరోజుల ముందు ఆర్ఆర్ ట్రేడర్స్ ఒ ఆర్డర్స్ సప్లయర్స్ పేరుతో రెండు దుకాణాలను అద్దెకు తీసుకుంది. పదిమంది ఎంప్లాయిస్ తో గృహ అవసరాలకు అవసరమయ్యే వస్తువులన్నిటిని డిస్ ప్లేలో పెట్టి మార్కెట్ రేటుకంటే సగం రేటుకే వస్తుందంటూ జనాలను నమ్మించింది. మొదట కట్టిన వారికి 10 నుంచి 20 రోజుల్లో వస్తువులు ఇచ్చి నమ్మించారు. తక్కువ సమయంలోనే వస్తువులు ఇవ్వడంతో ఆ నోట ఈ నోట భారీ స్థాయిలో పబ్లిసిటీ పెరిగింది. అధిక జనాలు లక్షల రూపాయలు కట్టడంతో ఒక్కసారిగా సుమారు కోటి రూపాయల పైన నగదుతో రాత్రికి రాత్రే ఖాళీ చేసి వెళ్లిపోయారు. షాపుల్లో పనిచేయడానికి స్థానికంగా పెట్టుకున్న ఎంప్లాయిస్ వారికి ఫోన్లు చేసి వారి ఇళ్ల దగ్గరకు వెళితే వారు కనిపించకపోవడంతో విషయాన్ని బాధితులకు చేరవేశారు. విషయం తెలుసుకున్న బాధితులు భారీ స్థాయిలో దుకాణాల వద్ద ఆందోళనకు దిగారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సమాచారం.

## నేటి నుంచి టాస్క్‌ద్వారా వివిధ కోర్సులు శిక్షణకు రిజిస్ట్రేషన్లు ప్రారంభం

### – జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష



పెద్దపల్లి టాస్క్ ద్వారా వివిధ కోర్సులు శిక్షణకు నేటి నుంచి రిజిస్ట్రేషన్లు ప్రారంభం అవుతాయని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష గురువారం తెలిపారు. జిల్లాలోని నిరుద్యోగ విద్యార్థిని విద్యార్థులు ఇటీవల రాష్ట్ర ఐటీ శాఖ మంత్రివర్యులు ప్రారంభించిన నైపుణ్యాభివృద్ధి కేంద్రం టాస్క్ ద్వారా వివిధ కోర్సులకు సంబంధించి శిక్షణ తరగతులను ప్రారంభిస్తున్నా మని తెలిపారు. ఈ శిక్షణా తరగతులలో ప్రభుత్వ ఉద్యోగాల పోటీ పరీక్షలకు నిష్ణాతులైన బోధకులచే తరగతులను నిర్వహించడం జరుగుతుందని , అలాగే టాస్క్ కేంద్రంతో ఒప్పందం కుదుర్చుకున్న బహుళజాతి సంస్థలలో ఉద్యోగ అవకాశాలను కూడా ఇప్పించడం కోసం జాబ్ మేళాను నిర్వహించడం జరుగుతుందని అన్నారు. ఔత్సాహికులైన నిరుద్యోగ విద్యార్థులు అందరూ ఇట్టి అవకాశాన్ని సద్వినియోగ పరుచుకోవాలని, ఆసక్తి కల విద్యార్థులందరూ టాస్క్ కేంద్రానికి వచ్చి తమ పేర్లను నమోదు చేసుకోవాలని, జనవరి 10 నుంచి రిజిస్ట్రేషన్లు ప్రారంభమవుతాయని, అదేవిధంగా తరగతులు జనవరి 20 నుంచి ప్రారంభమవుతాయని ,ఇతర వివరములకు పెద్దపల్లి ఎంపీడీవో ఆఫీస్ ఆవరణలో గల టాస్క్ ఆఫీసులో సంప్రదించగలరని కలెక్టర్ పేర్కొన్నారు.

# జీడీపీ పతనం

కేంద్ర ప్రభుత్వ పెద్దలు ఐదు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ గురించి ఒకవైపు ఊదరగొడుతూ, దేశ ప్రజలను భ్రమల్లో ముంచే ప్రయత్నం చేస్తుండగా మరోవైపు దానికి భిన్నమైన వాస్తవ దృశ్యాలు ఒక్కొక్కటిగా ఆవిష్కృతమౌతున్నాయి. నిరుద్యోగం, అధిక ధరలు, ద్రవ్యోల్బణం, పాతాళానికి రూపాయి వంటి అంశాల తరువాత ఇప్పుడు స్థూల దేశీయోత్పత్తి (గ్రాస్ డొమెస్టిక్ ప్రొడక్టు–జిడిపి) చర్చనీయాంశంగా మారింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో (2024–25)లో జిడిపి 6.4 శాతానికి పరిమితం కానుందని అంచనా వేస్తూ నేషనల్ స్టాటిస్టిక్స్ ఆఫీసు (ఎన్ఎస్ఓ) తాజాగా విడుదల చేసిన గణాంకాలు చర్చనీయాంశంగా మారాయి. ఈ అంచనాలు నిజమైతే ప్రపంచాన్ని అతలాకుతలం చేసిన కరోనా విజృంభణ తరువాత గడిచిన నాలుగేళ్ల కాలంలో అతి తక్కువ పెరుగుదల అంచనా ఇదే రానున్న ఆర్థిక సంవత్సరానికి బడ్జెట్ సమర్పించేందుకు కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి సన్నద్ధమౌతున్న వేళ ఈ తాజా అంచనాలు విడుదల కావడం గమనార్హం.

నిజానికి గతంలోనే జిడిపి పతనానికి సంబంధించిన సంకేతాలు వెలువడ్డాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం 2024–25 తొలి త్రైమాసికంలో (ఏప్రిల్–జూన్) 6.7 శాతం జిడిపి వృద్ధి మాత్రమే నమోదైంది. గత ఏడాది అదే సమయానికి జిడిపి 8.2 శాతంగా ఉండటం గమనార్హం. గత సంవత్సరం అన్ని త్రైమాసికాల్లోనూ సగటున 8 శాతం జిడిపి వృద్ధి నమోదు కావడంతో ఈ ఏడాది తొలి త్రైమాసికంలో 7.2 శాతం జిడిపి సాధించవచ్చని ఆర్‌బిఐ తొలుత అంచనా వేసింది. ఆ తరువాత దానిని సవరించి 7.1 శాతం వృద్ధి ఖాయమని పేర్కొంది. అయితే, తొలి త్రైమాసికంలో ఆ అంచనాను అందుకోలేదు. ఇక రెండవ త్రైమాసికంలో (జులై–సెప్టెంబర్)లో వృద్ధి రేటు ఏకంగా 5.4 శాతానికి పడిపోయింది. ఇది రెండేళ్లలో కనిష్టం! మూడవ త్రైమాసికంలో రెండవ త్రైమాసికంతో పోలిస్తే కొంత పుంజుకున్నట్లు కనిపించినప్పటికీ తొలుత వేసిన అంచనాలతో పోలిస్తే దిగదుడుపే! మరోవైపు స్థూల విలువ జోడింపు (గ్రాస్ వాల్యూ యాడెడ్–జివిఎ) గణాంకాలు కూడా తగ్గుదలనే చూపుతున్నాయి. జివిఎ 8.3 శాతం నుండి 6.8 శాతానికి పడిపోయింది. తొమ్మిది నెలల పాటు వరుసగా ఆర్థిక వ్యవస్థలో చోటుచేసుకున్న ఈ దిగజారుడును నరేంద్ర మోడీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోలేదు. మొదటి త్రైమాసికంలో ఆర్థిక వ్యవస్థ మందగమనానికి ఎన్నికల కోడ్ కారణమని ప్రధానమంత్రితో పాటు ఆయన వందిమాగధులు ప్రజలను మభ్య పెట్టే ప్రయత్నం చేశారు. ఇప్పుడు వృద్ధి రేటు నేల చూపులు చూస్తోందని స్పష్టమౌతోంది. ఫిబ్రవరి ఒకటవ తేదీన కేంద్ర ప్రభుత్వం బడ్జెట్ ప్రతిపాదనలను పార్లమెంటులో ప్రవేశ పెట్టనున్న సంగతి తెలిసిందే. దీంతో ఈ ఆర్థిక పతనానికి కేంద్ర ప్రభుత్వం దేశ ప్రజలకు ఏమని సంజాయిషి ఇస్తుందో వేచి చూడాల్సిందే!




అదాని, అంబాని వంటి కొద్దిమంది కార్పొరేట్లకు మేలు చేసే నయా ఉదారవాద ఆర్థిక విధానాలే ఈ పరిస్థితికి కారణం. ఈ కారణంగానే ప్రజల మధ్య అంతరాలు పెరుగుతున్నాయన్న సత్యాన్ని గుర్తించడానికి మోడీ ప్రభుత్వం నిరాకరిస్తోంది. దేశంలో పెరుగుతున్న పేదరికాన్ని, అకలి కేకలను, నిరుద్యోగం, ఉపాధి రహిత పరిస్థితులను అనేక జాతీయ, అంతర్జాతీయ నివేదికలు ఎత్తి చూపినా కేంద్ర సర్కారులో చలనం ఉండటం లేదు. ప్రభుత్వ ఖర్చును, ముఖ్యంగా పేదల కోసం చేసే ఖర్చును భారీగా పెంచాలని, ప్రజల కొనుగోలు శక్తిని పెంచడానికి, ఉపాధి కల్పనకు ప్రాధాన్యత ఇవ్వాలని ఎందరో నిపుణులు, ఆర్థిక వేత్తలు చేసిన సూచనలను ఉద్దేశపూర్వకంగానే పెడచెవిన పెడుతున్నారు. గ్రామీణ ఉపాధి హామీ చట్టం అమలుకు నిధుల దిగ్గోతే దీనికి నిదర్శనం. కనీస మద్దతు ధర చట్టం కోసం ఏళ్ల తరబడి రైతాంగం చేస్తున్న ఆందోళనలను పట్టించుకోవడం లేదు. రూపాయి విలువ పతనం కారణంగా ఎరువుల ధరలు మరింతగా పెరిగే అవకాశం ఉందంటూ వస్తున్న వార్తలు ఆందోళన కలిగిస్తున్నాయి. దేశ వ్యాప్తంగా ప్రజల జీవన ప్రమాణాల్లో పెరుగుతున్న అంతరాలే మోడీ ప్రభుత్వ విధానాల వైఫల్యానికి నిదర్శనం!

# జగన్ ఎఫెక్ట్... మై హోమ్ లీజులు రద్దు

అనంతపురం, జనవరి 9: తనకు మీడియా సపోర్ట్ లేదంటూనే.. గత ఐదేళ్లుగా పాలన చేశారు జగన్. అదే సమయంలో వైసీపీ ప్రభుత్వం నుంచి చాలా రకాల ప్రయోజనాలు పొందింది ప్రధాన మీడియా. ఏపీ ప్రభుత్వం దూకుడు నిర్ణయాలు తీసుకుంటోంది. ముఖ్యంగా గత ప్రభుత్వం అడ్డగోలుగా ఇచ్చిన అనుమతులు రద్దు చేయాలని భావిస్తోంది. అందులో భాగంగా ఏపీవ్యాప్తంగా ఉన్న లైమ్ స్టోన్ లీజుల విషయంలో పున సమీక్షిస్తోంది. అందులో భాగం గా మైహోమ్ గ్రూపునకు ఇచ్చినఅనుమతులురద్దుచేయాలని భావిస్తోం ది. వైసిపి ప్రభుత్వం అనంతపురం తో పాటు చాలాచోట్ల లైమ్ స్టోన్ లీజులను 50 ఏళ్ల వరకు మై హోమ్ గ్రూపునకు కేటాయిం చింది. వీటిని రద్దు చేసేందుకు కూటమి ప్రభుత్వం సిద్ధపడుతున్నట్లు తెలుస్తోంది. దీంతో ఇది సంచలన అంశంగా మారింది.మై హోమ్ గ్రూపునకు చెందినదే టీవీ 9. గత ఐదేళ్లుగా వైసీపీకి అనుకూలంగా వ్యవహరించింది ఈ మీడియా. మై హోమ్ గ్రూప్ చైర్మన్ రామేశ్వర రావు, ఆయన కుమారుడు టీవీ9 మీడియాను వైసీపీకి అప్పగించి నట్లు విమర్శ ఉంది. దాని ప్రతిఫలంగా రాష్ట్రవ్యాప్తంగా అడ్డగోలు లీజులు పొందినట్లు ఆరోపణలు ఉన్నాయి. గత ఐదేళ్లుగా టీవీ9 తెలుగుదేశం పార్టీని టార్గెట్ చేసుకుంది. చంద్రబాబుతో పాటు లోకేష్ కు వ్యతిరేకంగా కథనాలు వండి వార్చింది. ఒకానొక దశలో వ్యక్తిత్వ హననానికి కూడా పాల్పడింది. కానీ యాజమాన్యం ఎటువంటి చర్యలకు దిగలేదు. అయితే నాడు వైసిపికి టీవీ9 మీడి యాను అప్పగించడమే అందుకు కారణం.కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత మై హోమ్ గ్రూపునకు కేటాయించిన లీజులను రద్దు చేస్తూ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. దీంతో వెంటనే గ్రూప్ చైర్మన్ రామేశ్వరం తో పాటు ఆయన కుమారుడు చంద్రబాబు ను కలిశారు. లీజులను కొనసాగించాలని విజ్ఞప్తి చేశారు. అయితే దీనిపై చంద్రబాబు నుంచి ఎటువంటి స్పందన రాలేనట్లు సమాచారం. గతం మాదిరిగా చంద్రబాబు ఉదాసీనంగా వ్యవహరించే అవకాశం లేదు. ఈ విషయంలో పార్టీ యువనాయకత్వం ఆలోచన మరోలా ఉంది. ఇటువంటి వారి విషయంలో ఎంతవరకైనా ముందుకెళ్లాలని యువ నాయకత్వం భావిస్తోంది. అందుకే గనుల లీజు విషయంలో మై హోమ్ గ్రూపునకు డోర్ క్లోజ్ అయినట్లు సమాచారం. మరి టీవీ9 ద్వారా ఏపీ ప్రభుత్వంపై అదే దూకుడుతో ముందుకు వెళ్తారా? వెనక్కి తగ్గుతారా అన్నది చూడాలి.

# టిటిడి నిర్లక్ష్యమే కొంప ముంచింది

**మృతుల కుటుంబాలకు కోటి పరిహారం ఇవ్వాలి**

**మాజీ చైర్మన్ భూమన కరుణాకర్ డిమాండ్**



తిరుపతి,జనవరి 9 : తిరుపతిలో జరిగిన తొక్కిసలాట ఘటనలో టీటీడీ విజిలెన్స్, పోలీసుల వైఫల్యమే కారణమని టీటీడీ మాజీ చైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి ఆరోపించారు . తిరుమలలో వైకుంట ద్వార దర్శనం సందర్భంగా తిరుపతిలో ఏర్పాటు చేసిన టోకెన్ల జారీ కేంద్రంలో జరిగిన తొక్కిసలాటలో ఆరుగురు చనిపోగా 48 మంది గాయపడ్డారు. ఈ ఘటనపై ఆయన గురువారం తిరుపతిలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. వేలాది మంది భక్తులు టోకెన్ల కోసం కేంద్రాలకు రాగా కొద్ది మంది మాత్రమే అక్కడ పోలీసులు ఉండడంతో భక్తులను నియంత్రించలేకపోయారని ఆరోపించారు. వైకుంఠ ఏకాదశికి ఏర్పాట్లపై నెలరోజులుగా రోజుకో సమీక్షను నిర్వహించి చివరకు చేతులెత్తేయడంతో ఘటన జరిగిందని విమర్శించారు. పనిచేసేవారు తక్కువై, పర్యవేక్షించే వారు ఎక్కువయ్యారని పేర్కొన్నారు. చంద్రబాబుకు ఆర్భాటం ఎక్కువ, ఆచరణ తక్కువ ఉంటుందని ఎద్దేవా చేశారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో టీటీడీ సమర్థవంతంగా పనిచేసిందని గుర్తు చేశారు. భక్తులకు మేలైన నిర్ణయాలే తీసుకున్నామని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా చర్యలు తీసుకున్నామని వివరించారు. ప్రస్తుత టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు టీటీడీని రాజకీయ క్రీడా మైదానంగా మార్చివేశారని దుయ్యబట్టారు. ఇది ముమ్మాటికి ప్రభుత్వ తప్పిదమేనని అన్నారు. మృతుల కుటుంబాలకు రూ. కోటి, క్షతగాత్రులకు రూ. 20 లక్షల పరిహారాని చెల్లించాలని డిమాండ్ చేశారు. సనాతన ధర్మాన్ని రక్షిస్తామన్న పవన్‌కల్యాణ్ ఇప్పుడేం సమాధానం చెబుతారని ప్రశ్నించారు.

(మొదటి పేజీ తరువాయి..)

## మొన్న లడ్డూ.. ఇప్పుడు తొక్కిసలాట

వైకుంఠ ద్వార దర్శనం కోసం వెళ్తే ఏకంగా వైకుంఠానికే పంపుతున్నారని అంటూ తిరుపతి తొక్కిసలాట ఘటనపై ఏపీసీసీ చీఫ్ వైఎస్ షర్మిలా రెడ్డి మండిపడ్డారు. గోవింద నామాలు ప్రతిధ్వనించాల్సిన చోట ఘోరమైన మృత్యుఘోష వినిపించిందన్నారు. లక్షలాది మంది భక్తులు వస్తారని తెలిసి కూడా కనీస ఏర్పాట్లు చేయకపోవడం పాలనా యంత్రాంగం వైఫల్యానికి నిదర్శనమంటూ వ్యాఖ్యలు చేశారు. గురువారం మీడియాతో మాట్లాడుతూ.. ప్రభుత్వం, టీటీడీపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. తొక్కిసలాటలో ఆరుగురు భక్తులు చనిపోయిన ఘటనపై నైతిక బాధ్యత రాష్ట్ర ప్రభుత్వం వహించాలని డిమాండ్ చేశారు. చనిపోయిన కుటుంబాలకు రూ.25 లక్షలు పరిహారం చెల్లించి చేతులు దులుపుకోవడం అన్యాయమన్నారు. ఒక్కో కుటుంబానికి కోటి రూపాయల పరిహారం ప్రకటించాలన్నారు. వారి ఇంట్లో అర్హులు ఉంటే ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని ఏపీసీసీ పక్షాన ముఖ్యమంత్రి చంద్రబాబుని డిమాండ్ చేస్తున్నామన్నారు. మొన్న లడ్డు కల్తీ.. నేడు తొక్కిసలాట... కోట్లాది హిందువుల ఆరాధ్య దేవుడు, కలియుగ దైవం వెంకన్న క్షేత్రానికి మచ్చ తెచ్చి పెట్టాయన్నారు. తొక్కిసలాట ఘటనపై వెంటనే అత్యున్నత విచారణ జరిపించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరుతున్నామని వైఎస్ షర్మిల రెడ్డి పేర్కొన్నారు. కాగా.. వైకుంఠ ద్వార దర్శనం కోసం టీటీడీ ఏర్పాటు చేసిన టోకెన్ కౌంటర్ల వద్ద గత అర్ధరాత్రి తొక్కిసలాట చోటు చేసుకుంది. ఈ ఘటనలో ఆరుగురు మృతి చెందారు. మృతుల్లో ఐదుగురు మహిళలు ఉన్నారు. మరికొంతమంది గాయపడగా.. ప్రస్తుతం వారు ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. మృతుల కుటుంబానికి రూ.25 లక్షల చొప్పున రాష్ట్ర ప్రభుత్వం ఎక్స్‌గ్రేషియా ప్రకటించింది. మృతుల కుటుంబాలను రాష్ట్ర మంత్రులు పరామర్శించారు. అలాగే ఆస్పత్రులకు వెళ్లి క్షతగ్రాలను పరామర్శించారు. మరోవైపు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఈ ఘటనపై సీరియస్ అయ్యారు. అయితే ఇవేవీ సంఘటనను మరిపించలేవన్నారు. వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని షర్మిల డిమాండ్ చేశారు.

### తిరుపతి ఘటనకు ఇవో, ఎఐవోలదే బాధ్యత

మోస్తోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. టీటీడీలో ప్రక్షాళన జరగాల్సి ఉందన్నారు. ఈ తొక్కిసలాట ఘటనలో మృతి చెందిన వారి ఇళ్లకు వెళ్లి.. క్షమాపణ చెప్పాలని టీటీడీ పాలకమండలిలోని సభ్యులకు పవన్ కల్యాణ్ సూచించారు. తిరుపతిలో తప్పు జరిగింది క్షమించాలని ఈ సందర్భంగా ఆయన ప్రజలను కోరారు. ఈ ఘటనపై పూర్తి స్థాయి విచారణ జరగాలన్నారు. ఈ ఘటనకు బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. సామాన్యుల దర్శనాలపై దృష్టి పెట్టాలని టీటీడీకి సూచించారు. రద్దీని అదుపు చేయడంలో పోలీసులు విఫలమయ్యారన్నారు. ఈ ఘటనలో పోలీసుల నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తోందన్నారు. అంతకు ముందు తిరుపతిలోని బైరాగి ప్టటెడ పద్మావతి పార్కులో తొక్కిసలాట జరిగిన ప్రదేశాన్ని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారుల తీరుపై పవన్ కల్యాణ్ మండిపడ్డారు. భక్తులను ఒకే సారి ఎందుకు వదిలారంటూ వారిని ప్రశ్నించారు. ఆస్పత్రిలో క్షతగాత్రులను ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ పరామర్శించారు. అనంతరం విలేకర్లతో మాట్లాడుతూ.. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పైవిధంగా స్పందించారు. వైకుంఠద్వార దర్శనం టోకెన్ల జారీ సందర్భంగా తిరుపతిలో జరిగిన తొక్కిసలాట ఘటనకు రాష్ట్ర ప్రభుత్వం తరఫున క్షమాపణలు చెబుతున్నట్టు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తెలిపారు. ఘటన జరిగిన ప్రాంతంతో పాటు, ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను పరామర్శించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. 'తప్పు జరిగింది.. బాధ్యత తీసుకుంటాం. క్షతగాత్రులు, రాష్ట్ర ప్రజలు, వేంకటేశ్వరస్వామి భక్తులు, హైందవ ధర్మాన్ని నమ్మిన ప్రతి ఒక్కరినీ క్షమించమని రాష్ట్ర ప్రభుత్వం అడుగుతోంది. ఈ ఘటన జరగకుండా ఉండాల్సింది. క్రౌడ్ మేనేజ్‌మెంట్ సరిగా జరగలేదని భక్తులు చెబుతున్నారు. తితిదే సిబ్బంది, పోలీసులు ఉండి కూడా ఆరుగురు భక్తులు ప్రాణాలు కోల్పోవడం బాధాకరం. వీఐపీలపై కాదు.. సామాన్యులపైనా తితిదే దృష్టిపెట్టాలి. మృతుల కుటుంబాల వద్దకు తితిదే సభ్యులు వెళ్లి క్షమాపణలు చెప్పాలన్నారు. 'పోలీసుల్లో కొందరు కావాలని చేశారా? అనే అనుమానాలు కూడా ఉన్నాయి. ఈ అనుమానాలన్నింటిపై విచారణ జరగాల్సి ఉంది. ఈవో, అదనపు ఈవో, పాలకమండలికి మధ్య గ్యాప్ ఉందనే వాదన ఉంది. ఇంతమంది పోలీసు అధికారులున్నా తప్పు ఎందుకు జరిగింది? పోలీసుశాఖ నిర్లక్ష్యంపై సీఎం, డీజీపీ దృష్టికి మళ్లీ తీసుకెళ్తా. తిరుమలలో శ్రీవారి దర్శనం కోసం 8-9 గంటలు ఎదురు చూసే పరిస్థితి మారాలి. సాధ్యమైతే ఒకట్రెండు గంటల్లో దర్శనం జరిగేలా చూడాలని పవన్ కల్యాణ్ అన్నారు.

# సెమీ కండక్టర్ల తయారీకి తెలంగాణ అనుకూలం

**'చిప్ వార్' రచయిత డా.క్రిస్ మిల్లర్**




**హైదరాబాద్ జనవరి 9:**
సెమీ కండక్టర్ల తయారీకి తెలంగాణ అనుకూలంగా ఉందని 'చిప్ వార్' పుస్తక రచయిత డా.క్రిస్ మిల్లర్ పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో ఈ రంగంలో తెలంగాణ అగ్రస్థానంలో ఉంటుందన్నారు. గురువారం టీ హబ్ లో 'ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ ఎలక్ట్రానిక్స్ అండ్ కామర్స్ డిపార్ట్ మెంట్(ఐటీఈఅండ్ సీ), వీఎల్ ఎస్ ఐ సొసైటీ ఆఫ్ ఇండియా సంయుక్తాధ్వర్యంలో నిర్వహించిన 'మేకింగ్ ఇండియా ఏ సెమీ కండక్టర్ ప్రొడక్ట్ నేషన్' సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. టెక్నాలజీ రోజురోజుకీ కొత్త పుంతలు తొక్కుతుందని, ఈ క్రమంలోనే సెమీ కండక్టర్లకు ప్రాధాన్యం పెరిగిందని వివరించారు. భవిష్యత్తులో సెమీ కండక్టర్ల ఉత్పత్తిలో టాప్ లో ఉన్న దేశాలే మార్కెట్ ను శాసిస్తాయన్నారు. కార్యక్రమంలో వీఎల్ ఎస్ ఐ సొసైటీ ఆఫ్ ఇండియా అధ్యక్షుడు డా.సత్యా గుప్తా, తెలంగాణ ఎలక్ట్రానిక్స్, సెమీ కండక్టర్స్ అండ్ ఎనర్జీ స్టోరేజ్ సిస్టమ్స్ డైరెక్టర్ డా.ఎస్కే శర్మ, ఐటీఈఅండ్ సీ కన్సల్టెంట్ కల్నల్ అనురాగ్ అవస్థి తదితరులు పాల్గొన్నారు.

## 13 నుంచి సిఎం రేవంత్ విదేశీ పర్యటన

**అనుమతించిన ఎసిబి కోర్టు**

హైదరాబాద్,జనవరి9 : ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విదేశీ పర్యటనకు తెలంగాణ ఏసీబీ కోర్టు అనుమతి ఇచ్చింది. జనవరి 13 నుంచి 23 వరకు విదేశీ పర్యటనకు వెళ్లేందుకు కోర్టు అనుమతించింది. ఓటుకు నోటు కేసులో రేవంత్ రెడ్డి తన పాస్‌పోర్టును కోర్టుకు అప్పగించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలోనే విదేశీ పర్యటనకు అనుమతి ఇవ్వాలని ఏసీబీ కోర్టును అభ్యర్థించారు. బ్రిస్బేన్, దావోస్, ఆస్ట్రేలియా, సింగపూర్, స్విట్జర్లాండ్ పర్యటనలకు వెళ్లాల్సి ఉందని కోర్టుకు తెలిపారు. ఇందుకోసం ఆరు నెలల పాటు తన పాస్‌పోర్టు ఇవ్వాలని కోరారు. రేవంత్ రెడ్డి అభ్యర్థనను అంగీకరించిన న్యాయస్థానం.. జులై 6లోగా పాస్‌పోర్టును తిరిగి అప్పగించాలని ఆదేశించింది.

# టికెట్ ఏదైనా యాప్ ఒక్కటే...

**"మీ టికెట్" యాప్ ను లాంఛనంగా ప్రారంభించిన మంత్రి శ్రీధర్ బాబు**



**హైదరాబాద్ జనవరి 9:**
ఇక నుంచి టికెట్ ఏదైనా 'మీ టికెట్ ' యాప్ ఒక్కటీ మీ దగ్గరుంటే చాలు. ఆర్టీసీ, మెట్రో టికెట్లు, తెలంగాణలోని అన్ని ప్రముఖ దేవాలయాల్లో దర్శనం, ఇతర సేవలకు సంబంధించిన టికెట్లు, పార్కులు, ఇతర పర్యాటక స్థలాల్లో క్యూలైన్లలో నిరీక్షించాల్సిన అవసరం లేకుండా ఎంట్రీ టికెట్లను ఒకే ఒక్క క్లిక్ తో మీసేవ రూపొందించిన టికెట్ యాప్ లో బుక్ చేసుకోవచ్చు. తెలంగాణా డిపార్ట్ మెంట్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ సర్వీసెస్ డెలివరీ(ఈఎస్డీ) రూపొందించిన ఈ 'మీ టికెట్' యాప్ ను ఐటీ, పరిశ్రమల మంత్రి శ్రీధర్ బాబు గురువారం సచివాలయంలో లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. 'ప్రజలకు సుపరిపాలన అందించాలన్నదే సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం లక్ష్యం. టెక్నాలజీ సాయంతో పౌర సేవలను ప్రజల ముంగిటకు చేరవేస్తున్నాం. ఈ ప్రక్రియలో సంబంధిత నిపుణులను భాగస్వామ్యం చేస్తున్నాం. అన్ని రకాల టికెట్ బుకింగ్స్ ను ఒకే ప్లాట్ ఫాంపైకి తెచ్చేందుకు వీలుగా ఈ యాప్ ను రూపొందించాం. రాబోయే రోజుల్లో ఇలాంటి తరహా యాప్ లను మరిన్ని అందుబాటులోకి తీసుకొస్తాం' అని వివరించారు. 'ఈ యాప్ లో తెలంగాణలోని 15 ప్రముఖ దేవాలయాలు, 129 పార్కులు, 54 బోటింగ్ ప్రదేశాలు, జూ, మెట్రో, ఆర్టీసీ, మ్యూజియాలు, ప్లే అండ్ ఎంటర్ టైన్ మెంట్ జోన్స్ కు సంబంధించిన టికెట్లను తీసుకోవచ్చు. జీహెచ్ఎంసీ పరిధిలోని కమ్యూనిటీ హాళ్లు, జిమ్ లు, స్పోర్ట్ కాంప్లెక్స్ లను బుకింగ్ చేసుకోవచ్చు. మీరు ఎంచుకున్న లొకేషన్ కు సమీప ప్రాంతాల్లోని చూడదగిన ప్రదేశాలుంటే.. ఆ సమాచారం కూడా యాప్ లో ఆటోమేటిక్ గా కనిపిస్తుంది' అని తెలిపారు. 'ఈ యాప్ ను చాలా సులువుగా వినియోగించుకోవచ్చు. యూపీఐ ద్వారా చెల్లింపులు చేయొచ్చు. ఇతర ప్లాట్ ఫాంల మాదిరిగా ఈ యాప్ లో అదనంగా ఎలాంటి ఛార్జీలను వసూలు చేయం' అని వివరించారు. కార్యక్రమంలో మీ సేవ కమిషనర్ రవి కిరణ్, పరిశ్రమల శాఖా కమిషనర్ డా.జి.మల్సూర్, జూపార్క్ డైరెక్టర్ డా.సునీల్, తదితరులు పాల్గొన్నారు.

# అజ్ఞాతంలో ఉన్న మావోయిస్టు కుటుంబానికి ఎస్పీ కిరణ్ ఖరే పరామర్శ





**జయశంకర్ భూపాలపల్లి జిల్లా ప్రతినిధి జనవరి 09 తారా జ్యోతి**
గత 30 ఏళ్లుగా అజ్ఞాతంలో ఉన్న మావోయిస్టు నేత మచ్చ సోమయ్య కుటుంబాన్ని జయశంకర్ భూపాలపల్లి ఎస్పీ శ్రీ కిరణ్ ఖరే గురువారం సందర్శించారు. భూపాలపల్లి మండలం పంబాపూర్ గ్రామానికి చెందిన అజ్ఞాత మావోయిస్టు, మచ్చ సోమయ్య, ఇంటికి వెళ్లి ఆయన భార్య సుగుణమ్మకు దుప్పట్లు, మెడికల్ కిట్, నిత్యవసర వస్తువుల సరుకులను ఎస్పి అందజేసి, అజ్ఞాత మావోయిస్టు కుటుంబ సభ్యులతో ఆప్యాయంగా మాట్లాడి, వారి జీవనోపాధి, కుటుంబ పరిస్థితి, కుటుంబ నేపథ్యం, పిల్లల పరిస్థితి, వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. సోమయ్య కుటుంబ సభ్యులకు ఏలాంటి సమస్యలు ఎదురైన అవసరమైన వైద్య చికిత్సలు అందించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఎస్పీ కిరణ్ ఖరే పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎస్పీ కిరణ్ ఖరే మాట్లాడుతూ.. మచ్చ సోమయ్య అడవి వీడి జనంలోకి రావాలని పిలుపునిచ్చారు. తెలంగాణ పోలీసుల నిఘా పటిష్ఠంగా ఉందని, ఇప్పటికే తెలంగాణకు చెందిన అనేక మంది మావోయిస్టులు ఎన్కౌంటర్ లలో హతమయ్యారని అన్నారు. అజ్ఞాత జీవితం గడుపుతున్న మావోయిస్టులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని,సోమయ్య ఆయుధాలు వీడి జనజీవన స్రవంతిలో కలిస్తే, ఆయనపై ఉన్న రివార్డ్ మరియు ప్రభుత్వం నుంచి అనేక ప్రయోజనాలు అందేలా కృషి చేస్తామని ఎస్పి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో భూపాలపల్లి అదనపు ఎస్పి బోనాల కిషన్, భూపాలపల్లి డిఎస్పి ఏ. సంపత్ రావు, సిఐ నరేష్ కుమార్, ఎస్సైలు సుధాకర్, రమేష్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# పవర్ డిప్లొమా ఇంజనీర్లకు క్రమశిక్షణనే శ్రీరామరక్ష

***టిపిడిఇప రాష్ట్ర సెక్రటరీ-జనరల్ పి.బీసిరెడ్డి***

*గంగుల రాంగోపాల్*

*(బ్యూరో చీఫ్)*




**హైదరాబాద్, జనవరి 9 :**
తెలంగాణ రాష్ట్ర విద్యుత్ సంస్థలో పనిచేసే పవర్ డిప్లొమా ఇంజనీర్లకు సహనం, ఓపిక,క్రమశిక్షణ ఆయుధమని, వాటిని అతిక్రమించకూడదని తెలంగాణ పవర్ డిప్లొమా ఇంజినీర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.బీసిరెడ్డి దిశానిర్దేశం చేశారు. గురువారం యాదాద్రి టిపిడిఇప అతిధి గృహంలో డైరీ-2025 ఆవిష్కరించారు. రాష్ట్ర వ్యాప్తంగా హాజరైన డిప్లొమా ఇంజినీర్లను ఉద్దేశించి ముఖ్య అతిథి గా హాజరైన ఆయన ప్రసంగిస్తూ వ్యక్తులు, నాయకులు వస్తారు, పోతారు, కానీ అసోసియేషన్ బ్యానర్ కలకాలం ఉంటుందని కొనసాగుతున్న సభ్యుల సర్వీసు ప్రయోజనాలు, ప్రమోషన్లు, ఇన్క్రిమెంట్లు, బదిలీలు,పదవీ విరమణ ఆర్థిక లాభాలు, హక్కులు పరిరక్షణ యాజమాన్యాలతో చర్చించి పరిష్కరించే బాధ్యత టిపిడిఇప




వహిస్తుందన్నారు. అన్ని స్థాయిల్లో నాయకులు సమయం కేటాయించి చిత్తశుద్ధి తో పనిచేసి సభ్యుల మన్ననలు పొందాలని సూచించారు. 69ఏళ్లలో విద్యుత్ సంస్థ చరిత్రలో 57 వ డైరీ ఆవిష్కరించడం ఆనందంగా ఉందన్నారు. 2019 లో నియామకం పొందిన 423 కొత్త సబ్ ఇంజనీర్లలో 360 మంది ఇతర అసోసియేషన్ లను కాదని మన టిపిడిఇప సభ్యత్వం తీసుకొని కొనసాగడం చూస్తుంటే ఎంతటి నమ్మకం తో ఉన్నారో తెలుసుకోవచ్చని అన్నారు. గతంలో టిపిడిఇప సాధించిన కొన్ని విజయాలను ఉదహరించారు. 26 ఏండ్ల అలుపెరుగని పోరాటం, 5 పీఆర్సీ ల తర్వాత సబ్ ఇంజినీర్లు ఏక మొత్తంలో 8 ఇన్క్రిమెంట్లు సాధించి 2018 లో సరిచేయించడం రికార్డు అన్నారు. జెన్కో లో 2012 బ్యాచ్ సబ్ ఇంజనీర్లకు ఏఈ లుగా, 2015 బ్యాచ్ ఏఈ లకు ఏడీఈ లుగా రికార్డు సమయం లో పదోన్నతులు ఘన విజయంగా అభివర్ణించారు. డిప్లొమా ఏఈ లకు క్లాస్-2 హోదా సాధించడం ద్వారా గౌరవం పెరిగిందని తెలిపారు. ముఖ్యముగా పెండింగ్ లో నున్న 80 ఏఈ నుండి ఏడీఈ ప్రమోషన్లు ఈ నెలలో ఇప్పించదానికి కృషి చేస్తున్నామని, అందుకు ఎస్పీడీసీల్ సీఎండీ వరుణ్ రెడ్డి సుముఖంగా ఉన్నారని వెల్లడించారు. దేశంలోని 29 రాష్ట్రాల విద్యుత్ సంస్థల అన్నింటిలో కంటే తెలంగాణ రాష్ట్రంలో పని చేస్తున్న ఇంజనీర్లకు, సిబ్బంది కి అత్యధిక వేతనాలు పొందుతున్న విషయం మీకు తెలుసని,అందుకు సమానంగా ప్రతీ ఉద్యోగి మరింత కష్టపడి పనిచేసి విద్యుత్ సంస్థ మనుగడకు, ఆర్థికంగా బలోపేతం చేయడానికి కంకణం కట్టుకోవాలని, మెరుగైన 24%ఇ%7 గంటల విద్యుత్ సరఫరా అందించి వినియోగదారులకు నాణ్యమైన సేవలు అందించాలని, రాష్ట్ర ప్రభుత్వ మన్ననలు పొందాలని సూచించారు. రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి నరేష్, ఉత్తర, దక్షిణ కంపెనీ అధ్యక్ష కార్యదర్శులు ఇంద్రసేనారెడ్డి, మనోరంజన్ రెడ్డి, సుబ్రమన్యేశ్వర్ రావు, తాజుద్దీన్ బాబా, రాష్ట్ర నాయకులు మదుసూదన్ రెడ్డి, గోవర్ధన్ రెడ్డి, చలపతి రావు, నరేందర్, 33 జిల్లాల టిపిడిఇప అధ్యక్ష, కార్యదర్శులు, సబ్ ఇంజినీర్లు, ఏఈ లు, ఏడీఈ లు సుమారు 500 సభ్యులు పాల్గొన్నారు.

## జిహెచ్ఎంసి వద్ద కంట్రాక్టర్ల మెరుపు ధర్నా

***బకాయిల చెల్లింపు కోసం డిమాండ్***

***పెట్రోల్ పోసుకుని కొందురు ఆత్మహత్యాయత్నం***

***కంట్రాక్టర్లతో చర్చించిన కమిషనర్ ఇలంబర్తి***

హైదరాబాద్,జనవరి9 : హైదరాబాద్ మహానగర పాలక సంస్థ జీహెచ్ఎంసీ కార్యాలయం ఎదుట బల్దియా కాంట్రాక్టర్లు మెరుపు ధర్నాకు దిగారు. గురువారం ఉదయం కాంట్రాక్టర్లంతా ధర్నాకు దిగా రు. పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలంటూ వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తక్షణమే తమకు రావాల్సిన బకాయిలు రూ. 1100 కోట్లు చెల్లించాలని వారు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఆ క్రమంలో ఓ కాంట్రాక్టర్.. ఒంటిపై పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యా యత్నానికి పూనుకొన్నాడు. అక్కడే ఉన్న సహచర కాంట్రాక్టర్లు.. అతడి ప్రయత్నాన్ని అడ్డుకొన్నారు. దీంతో స్థానికంగా ఉద్రిక్త వాతా వరణం నెలకొంది. జీహెచ్ఎంసీ బిల్లులు చెల్లించకపోవడంతో అప్పు ల బాధతో కాంట్రాక్టర్లు ఆత్మహత్యలు చేసుకుంటున్నారనీ ఈ సంద ర్భంగా వారు ఆవేదన వ్యక్తం చేశారు. పెండింగ్ బిల్లులు చెల్లించా లంటూ కాంట్రాక్టర్లు ఆందోళనకు దిగారు. కార్యాలయం ప్రధాన ద్వారం ముందు బైఠాయించిన కాంట్రాక్టర్లు.. ప్రభుత్వానికి వ్యతిరేకం గా నినాదాలు చేశారు. ఏడాదిగా బిల్లులు చెల్లించడం లేదని కాంగ్రెస్ సర్కార్‌పై మండిపడ్డారు. ఇంతలోనే ఉన్నట్టుండి ఇద్దరు కాంట్రాక్టర్లు పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యాయత్నం చేశారు. తోటి కాంట్రాక్టర్లు వారిని అడ్డుకుని పెట్రోల్ బాటిళ్లను లాగేసుకున్నారు. అప్రమత్తమైన జీహెచ్ఎంసీ కమిషనర్ ఇలంబర్తి.. కాంట్రాక్టర్లను చర్చలకు పిలిచా రు. పెండింగ్ బిల్లులపై కమిషనర్ ఇలంబర్తి.. కాంట్రాక్టర్లతో చర్చలు జరిపారు. పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించిన కాంట్రాక్టర్లను చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. వారిద్దరి ఆరోగ్యం నిలకడగా ఉన్నట్లు తెలుస్తోంది. కాంట్రాక్టర్ల ఆందోళనల నేపథ్యంలో జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయం వద్ద భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

విశ్వజ

# చలి పంజాకు గురికాకుండా

సాధారణంగానే శీతకాలంలో రోగ నిరోధక శక్తి తగ్గితుంది. మరీ ముఖ్యంగా గర్భిణులపై చలి తీవ్ర ప్రభావం చూపుతుంది. జలుబు, దగ్గుతోపాటు కీళ్లు పట్టేయడం, పొడిచర్మం వంటి సమస్యలు వారిని ఇబ్బంది పెడతాయి. కొన్ని చిన్న జాగ్రత్తలు తీసుకుంటే.. చలికాలంలో గర్భిణులు ఇబ్బంది పడకుండా ఉంటారని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు.



చలి వాతావరణం, పదేపదే మూత్రానికి వెళ్లాల్సిరావడం వల్ల.. ఈ కాలంలో గర్భిణులు నీళ్లు తక్కువగా తాగుతుంటారు. దాంతో డీహైడ్రేషన్ బారిన పడతారు. అయితే, గర్భిణుల్లో డీహైడ్రేషన్ చాలా ప్రమాదకరంగా పరిణమిస్తుంది. శరీరంలో తగినంతగా నీటి స్థాయులు లేకపోతే.. ఉమ్మనీరు తగ్గిపోయే ప్రమాదం ఉంటుంది. ఇది బిడ్డ ఎదుగుదలపై ప్రతికూల ప్రభావం చూపుతుంది. పరిస్థితి అలాగే కొనసాగితే.. ముందస్తు డెలివరీ అయ్యే అవకాశం ఉంటుంది. కాబట్టి.. ఏ కాలమైనా తగిన మోతాదులో నీళ్లు తాగడం మంచిది.

ఈ కాలంలో చర్మం పొడిబారడం సహజం. ఇక గర్భిణుల్లో పొట్ట పెరిగేకొద్దీ చర్మం సాగుతూ ఉంటుంది. దాంతో చర్మం పగిలి.. ఆ ప్రదేశంలో దురద పెడుతుంది. చలికాలంలో ఈ సమస్య మరింత ఎక్కువ అవుతుంది. అందుకే.. వైద్యుల సూచన మేరకు ప్రత్యేక క్రీములు, లోషన్లు, నూనెలు రాసుకోవాలి. రోజుకు ఒకటి రెండుసార్లు పొట్ట భాగంలో నెమ్మదిగా మసాజ్ చేసుకోవాలి. దీనివల్ల రక్త ప్రసరణ మెరుగవడంతోపాటు చర్మం తేమగా ఉంటుంది. ప్రసవం తర్వాత స్ట్రెచ్‌మార్క్స్ రాకుండా కూడా తోడ్పడుతుంది.

చలికాలంలో వేధించే మరో ప్రధాన సమస్య.. కీళ్లనొప్పులు. చలి గాలులకు శరీరంలోని రక్తనాళాలు కుంచించుకుపోయి.. రక్త ప్రసరణ నెమ్మదిస్తుంది. దాంతో కండరాలు, కీళ్లు బిగుసుకుపోతాయి. గర్భిణులను ఈ సమస్య మరింత ఎక్కువగా వేధిస్తుంటుంది. దీనినుంచి బయటపడేందుకు.. వైద్యుల సలహా మేరకు నిపుణుల ఆధ్వర్యంలో 'అరోమా థెరపీ' చేయించుకోవడం మంచిది. లావెండర్, టీ ట్రీ, యూకలిప్టస్ వంటి నూనెలతో శరీరాన్ని సున్నితంగా మసాజ్ చేయించుకోవాలి. దీనివల్ల రక్త ప్రసరణ మెరుగవుతుంది. శారీరక నొప్పుల నుంచి ఉపశమనం కలుగుతుంది.

# నైకా అధినాయిక!



50 ఎండ్ల వయసులో వ్యాపారం ప్రారంభించిన ఆమె, అరవయ్యో పడిలోకి వచ్చే సరికి భారతదేశంలో స్వయంకృషితో కోటీశ్వరురాలు అయినవారి జాబితాలో చేరిపోయింది. ఫ్యాషన్ అంటేనే యూత్, టీనేజర్ల రాజ్యం అనుకుంటాం. అలాంటిది మధ్య వయసులో ఫ్యాషన్ ప్రపంచాన్ని స్థాపించిందామె. అంతేకాదు, భారతదేశంలోనే యూనికార్న్ సంస్థను స్థాపించిన తొట్టతొలి మహిళగా ఘనతకెక్కింది. ఆమెనే నైకా అధినాయిక ఫల్గుణి నాయర్. ఇటీవల హురూన్ ఇండియా, ఐడీఎఫ్‌సీ సంయుక్తంగా ప్రకటించిన 200 మంది సెల్ఫ్‌మేడ్ ఆంత్రప్రెన్యూర్ల జాబితాలో టాప్ 10లో నిలిచి మరోసారి వార్తల్లో నిలిచింది. ఆమె స్థాపించిన కంపెనీ నైకా విలువ రూ.56,600 కోట్లు.

సొంతంగా వ్యాపారం చేయడం అన్నది ఎంతో మంది కల. ఆకర్షణీయంగా కనిపించే లాభాలు ఒక ఎత్తయితే, సొంత కాళ్ల మీద నిలబడగలిగి మరికొందరి జీవితాలకూ ఆలంబన కాగలమన్న ఆశ మరోవైపు ఉంటుందిక్కడ. అలాగని కాలేజీ నుంచి అడుగు బయట పెడుతూనే సీఈఓ సీట్లో



కూర్చోవడం అందరికీ సాధ్యమయ్యే విషయం కాదు. చదువైన నాలుగేండ్లలోనే అటో ఇటో తేలిపోవాలి అనుకుంటే అయ్యే పనీ కాదు.పరిస్థితులను బట్టి ముందుకు వెళుతూ, మన లక్ష్యాలకు బాటలు వేసుకుంటే వయసుతో, చేసే పనితో సంబంధం లేకుండానే సరికొత్త ఆంత్రప్రెన్యూర్లుగా మారొచ్చు. దానికి ప్రత్యక్ష ఉదాహరణే ఫల్గుణి నాయర్. పాతికేండ్లకు పైగా వివిధ స్థాయుల్లో ఉద్యోగ జీవితాన్ని గడిపిందామె. ఆ తర్వాతే నైకా అనే సౌందర్యోత్పత్తుల సంస్థను స్థాపించింది. పేరున్న రకరకాల కాస్మెటిక్స్ అన్నీ ఒకే చోట దొరికితే బాగుంటుంది అన్న ఆలోచనే నైకా స్థాపనకు దారి తీసింది. నైకాకు నేడు దేశవ్యాప్తంగా 200లకు పైగా స్టోర్లున్నాయి. ఒక చిన్న షాప్‌గా మొదలైన ఈ సంస్థ ఇప్పుడు అంతర్జాతీయ స్థాయికి చేరింది. ఎన్నో ఒడుదొడుకులతో సాగిన ఈ ప్రయాణం ఆమెను సొంత కాళ్ల మీద నిలబడ్డ కోటీశ్వరుల (బిలియనీర్ల) జాబితాలోకి చేర్చింది.

అప్పట్లో.. ఏ పని చేసినా అందులో అత్యుత్తమంగా నిలవాలన్న తపన ఫల్గుణి నాయర్‌లో కనిపిస్తుంది. అది ఉద్యోగమైనా వ్యాపారమైనా. మేనేజ్‌మెంట్ కన్సల్టెంట్‌గా పని చేసినా, కొటాక్ మహీంద్రా క్యాపిటల్ (బ్యాంకు) మేనేజింగ్ డైరెక్టర్‌గా వ్యవహరించినా ఆమెది అదే ట్రస్టైల్. ఫల్గుణిది గుజరాతీ వ్యాపార కుటుంబం. ముంబయిలో పుట్టి పెరిగింది. అక్కడి సిండెన్‌హామ్ కాలేజ్ ఆఫ్ కామర్స్ అండ్ ఎకనమిక్స్ నుంచి డిగ్రీ పట్టా అందుకుంది. ఆ తర్వాత ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్, అహ్మదాబాద్ నుంచి మాస్టర్స్ పూర్తిచేసింది. తర్వాత ఒక పేరున్న అకౌంటింగ్ సంస్థలో కన్సల్టెంట్‌గా చేరింది. కొన్నాళ్లు పనిచేశాక మహీంద్రా గ్రూప్‌లో వ్యాపార విస్తరణ విభాగాధిపతిగా చేరింది.

లండన్, న్యూయార్క్ నగరాల్లోనూ వివిధ హోదాల్లో పనిచేసి సంస్థ అభివృద్ధిలో భాగమైంది. ఆ తర్వాత భారత్‌కి వచ్చాక మహీంద్రా క్యాపిటల్‌కు (ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకింగ్) మేనేజింగ్ డైరెక్టర్‌గా బాధ్యతలు చేపట్టింది. 18 సంవత్సరాలు ఇక్కడ పనిచేశాక, సొంతంగా ఒక సంస్థను ప్రారంభించాలనుకుందామె. తాను నిత్య జీవితంలో వాడే రకరకాల సౌందర్య ఉత్పత్తులు భారత్‌లో సరిగ్గా దొరక్కపోవడం, ముంబయిలాంటి మహా నగరాల్లోనూ అవి ఒకే చోట లభ్యం కాకపోవడంతో.. అలాంటి వాటిని ఒకచోట అందించేలా ఓ కంపెనీ ప్రారంభించాలన్న ఆలోచన చేసింది. అలా 2012లో పుట్టిందే నైకా సంస్థ.

తిరుగు లేదు..

నైకాను ప్రారంభించేటప్పటికి ఫల్గుణిది అయిదు పదుల వయసు. అప్పటిదాకా తాను సంపాదించుకున్న వాటితోపాటు బయటి నుంచి కొంత జోడించి సుమారు రూ.14 కోట్ల రూపాయల పెట్టుబడితో ఈ సంస్థను ప్రారంభించింది. ఫల్గుణి తండ్రి ఒక బేరింగ్స్ కంపెనీని నడిపేవారు. తొలుత ఆయన దగ్గరున్న ముగ్గురు ఉద్యోగులను నియమించుకుని, ఆయన ఆఫీసులోనే ఓ ఏరియాలో సౌందర్య ఉత్పత్తుల సంస్థను ప్రారంభించింది. లగ్జరీ బ్రాండ్లకు ఉన్న గిరాకీని అర్థం చేసుకుని తొలిసారి ఆన్‌లైన్‌లో లగ్జరీ కాస్మెటిక్స్‌ని అందుబాటులో ఉంచింది. సౌందర్య సాధనాలు, ఆరోగ్య ఉత్పత్తులు, ఫ్యాషన్ వస్తువులు.. ఉండేలా చూసుకుంది. తొలుత రోజుకు అరవై ఆర్డర్లు వచ్చేవి. తర్వాత ఆఫ్‌లైన్ సర్వీసునూ మొదలుపెట్టింది. అలా ప్రారంభించిన 18 నెలల్లోనే అది ఇలాంటి ఉత్పత్తులు అమ్మే నెంబర్ 1 బ్రాండ్‌గా ఎదిగింది. దశాబ్దకాలంలోనే ఆమె ఫోర్బ్స్ ధనవంతుల జాబితాలో చోటు దక్కించుకుంది. ఆన్‌లైన్‌లో అమ్మకాలు జరుపుతూనే బయట దేశవ్యాప్తంగా బ్రాండ్ స్టోర్లనూ తెరిచింది నాయర్. అయితే కొవిడ్ సమయంలో భారీ నష్టాలను చవిచూసినా వెనకడుగు వేయలేదామె. ఉద్యోగులను తొలగించే చర్యలకు పోకుండా, మార్కెటింగ్ వ్యయాన్ని బాగా తగ్గించి సంస్థను నిలబడేలా చేసింది. ప్రస్తుతం నైకా సంస్థ 500 బ్రాండ్లకు సంబంధించిన వస్తువులను అమ్ముతున్నది. నెలకు 50 లక్షల మందికి పైగా యూజర్లున్నారు. ఇప్పుడు ఫ్యాషన్ రంగంలో నైకా అంటే తెలియని వాళ్లుండరంటే అతిశయోక్తి కాదు. అసలైన స్త్రీశక్తికి నిలువెత్తు నిదర్శనం కదూ ఈ నైకా అధినాయిక!

# వ్యాపారం

## 118 కిలో మీటర్ల రేంజ్‌తో మార్కెట్‌లో నయా ఈవీ లాంచ్.. ప్రత్యేకతలు తెలిస్తే షాక్



భారతదేశంలో ఈవీ మార్కెట్ రోజురోజుకూ కొత్త పుంతలు తొక్కుతుంది. ముఖ్యంగా పెరుగుతున్న పెట్రోల్ ధరల నుంచి రక్షణ కోసం అంతా ఈవీల బాట పడుతున్నారు. దీంతో స్టార్టప్ కంపెనీల నుంచి టాప్ కంపెనీలు తమ ఈవీ వెర్షన్స్ స్కూటర్లను లాంచ్ చేస్తున్నాయి. తాజాగా మరో కంపెనీ ఈవీ స్కూటర్ భారత మార్కెట్‌లో లాంచ్ చేశారు. ఆ స్కూటర్ గురించి మరిన్ని వివరాలను తెలుసుకుందాం. భారతీయ ఎలక్ట్రిక్ టూ వీలర్ స్టార్టప్ జితేంద్రా ఈవీ తన కొత్త ఎలక్ట్రిక్ స్కూటర్‌ను యూనిక్ పేరుతో మార్కెట్‌లో విడుదల చేసింది. రూ.1.24 లక్షల ప్రారంభ ధరతో రిలీజ్ చేసిన ఈ స్కూటర్ డెలివరీలు జనవరి 15, 2025 నుంచి ప్రారంభమవుతాయని స్పష్టం చేసింది. అలాగే జితేంద్రా కంపెనీ మరో రెండు రకాల ఎలక్ట్రిక్ స్కూటర్ యూనిక్ లైట్, యూనిక్ ప్రోలను కూడా మార్కెట్‌లో లాంచ్ చేయాలని యోచిస్తుంది. జితేంద్రా యూనిక్ ఈవీ విషయానికి వస్తే 3.8 కేడబ్ల్యూ ఎల్‌ఎంఎఫ్‌పీ రిమూవబుల్ బ్యాటరీతో ఈ స్కూటర్‌ను లాంచ్ చేశారు. ఈ స్కూటర్‌ను ఒక్కసారి చార్జ్ చేస్తే 118 కిమీల పరిధిని అందిస్తుందని కంపెనీ ప్రతినిధులు చెబుతున్నారు. యునిక్ ఈవీ స్కూటర్ స్పిన్ స్విచ్ రైడింగ్ మోడ్లతో మొదటి హైపర్ గేర్ పవర్ ట్రైన్‌తో వస్తుందని పేర్కొంటున్నారు. జితేంద్రా ఈవీ యూనిక్ గరిష్టంగా 75 కిలోమీటర్ల వేగాన్ని అందుకుంటుందని వివరిస్తున్నారు.

యూనిక్ ఈవీలో డ్యూయల్ డిస్క్ బ్రేక్లు, అల్లాయ్ వీల్స్‌తో కూడిన 12 అంగుళాల ట్యూబ్ లెస్ టైర్లు, రైడర్ భద్రత కోసం సైడ్ స్టాండ్ సెన్సార్లతో వస్తుంది. కీలెస్ ఎంట్రీ, యూఎస్‌బీ ఛార్జింగ్ పోర్ట్, అధునాతన డిస్ ప్లేలతో కూడిన స్మార్ట్ డిజిటల్ ఎల్‌ఈడీ క్లస్టర్ వంటి ఫీచర్లతో వస్తుంది. క్రోమ్ ఏఆర్‌సీ ఎల్‌ఈడీ హెడ్ ల్యాంప్‌లు, రేడియంట్ హెక్స్ ఎల్‌ఈడీ టెయిల్ ల్యాంప్స్, ఈగల్ విజన్ బ్లింకర్లు కూడా ఆకట్టుకుంటాయి. ముఖ్యంగా ఈ ఈవీ స్కూటర్ మెరుగైన రైడింగ్ అనుభవం కోసం స్మార్ట్ కనెక్టివిటీ, సహజమైన నియంత్రణలను అందించే జెనీ అప్లికేషన్ కనెక్టివిటీతో బ్లూటూత్ కనెక్టెడ్ బ్యాటరీతో వస్తుంది.

యునిక్ ఈవీ బ్యాటరీ రెండింటి పై మూడు సంవత్సరాల లేదా 50,000 కిమీ వారెంటీతో వస్తుంది. అలాగే ఈ స్కూటర్ ఐదు రంగుల్లో లభిస్తుంది మీడో గ్రీన్, డస్క్ బ్లూ, ఫారెస్ట్ వైట్, వాల్కనో రెడ్, ఎక్లిప్స్ బ్లాక్ కలర్స్‌లో కొనుగోలుకు అందుబాటులో ఉంటుంది. నాసిక్ ప్రాంతానికి చెందిన ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహన తయారీ సంస్థ జితేంద్రా ఇంతకు ముందు రూ.79,999 ధరతో ప్రిమో ఎలక్ట్రిక్ స్కూటర్ను విడుదల చేసింది. జితేంద్ర ఈవీ ప్రైమో 60వీ, 26ఏహెచ్ బ్యాటరీ ప్యాక్‌తో వస్తుంది. ఈ స్కూటర్‌ను ఓ సారి చార్జ్ చేస్తే 65 కిలోమీటర్ల మైలేజ్ ఇస్తుంది. ఈ మోడల్ 7 డిగ్రీ గ్రేడియంట్ సామర్థ్యంతో 52 కేఎంపీహెచ్ గరిష్ట వేగంతో వస్తుంది.

## మరో విభాగంలో అడుగు పెట్టిన టాటా డిజిటల్.. సేవింగ్స్ ?

# ఖాతా లేకుండానే ఇన్వెస్ట్

దేశంలోనే అత్యంత విశ్వసనీయ కంపెనీల్లో టాటా గ్రూప్ ఒకటి. ఇక మార్కెట్ విలువ పరంగా కూడా దేశంలోనే ఇదే అతిపెద్ద సంస్థ అనే చెప్పవచ్చు. తాజాగా టాటా ఓ కీలక ప్రకటన చేసింది. చిప్పుడు చిన్న మొత్తాల పెట్టుబడుల విభాగంలోకి అడుగుపెట్టినట్లు టాటా గ్రూప్ అనుబంధ సంస్థ అయిన టాటా డిజిటల్ తెలిపింది. ఫిక్స్‌డ్ డిపాజిట్ల కోసం టాటా న్యూ సూపర్ యాప్‌లో ఒక విభాగం ప్రారంభించినట్లు వెల్లడించింది. దీని ద్వారా ప్రముఖ బ్యాంకులు, బ్యాంకింగేతర ఆర్థిక సంస్థల (నాన్ బ్యాంకింగ్ ఫినాన్షియల్ కంపెనీలు– NBFC) వద్ద ఇన్వెస్టర్లకు గరిష్టంగా 9.10 శాతం వరకు వడ్డీ రేటు పొందేలా ఎఫ్‌డీ చేయవచ్చని సంస్థ తెలిపింది. ప్రముఖ ఆర్థిక సంస్థలతో పాటు రూ. 1,000 నుండి ఫిక్స్‌డ్ డిపాజిట్లలో పెట్టుబడి పెట్టడానికి అనుమతిస్తుంది.

**కేవలం 10 నిమిషాల్లో సురక్షిత FD బుకింగ్:**

టాటా న్యూ ఫిక్స్‌డ్ డిపాజిట్ల మార్కెట్‌ప్లేస్‌కు ప్రత్యేకత ఉంది. ఎలాంటి ఇబ్బందులు లేకుండా డిజిటల్ ప్రక్రియ. కస్టమర్‌లు తమ ఫిక్స్‌డ్ డిపాజిట్‌లను పూర్తిగా ఆన్‌లైన్‌లో కేవలం 10 నిమిషాల్లో తెరవవచ్చు. లిక్విడేట్ చేయవచ్చు. ఇది ఎఫ్‌డీ




వినియోగదారులకు ఉపయోగరంగా ఉంటుంది. ఇది ఎఫ్‌డీ పెట్టుబడులతో ముడిపడి ఉన్న సుదీర్ఘమైన రాత పని, బ్యాంకులను సందర్శించే ఇబ్బందులు తప్పుతాయి.

కస్టమర్‌లు సేవింగ్స్ బ్యాంక్ ఖాతాను తెరవకుండానే ఎఫ్‌డిపై 9.1 శాతం వరకు వడ్డీ రేట్లను పొందవచ్చు. ICRA, CARE, CRISIL వంటి అనేక రేటింగ్ ఏజెన్సీలు కంపెనీ ఫిక్స్‌డ్ డిపాజిట్ స్కీమ్‌ను మూల్యాంకనం చేసి, దాని ఆధారంగా రేటింగ్‌లు ఇస్తాయి.

**5 లక్షల వరకు పెట్టుబడికి గ్యారంటీ**

దీని ద్వారా అనుభవజ్ఞులైన ఇన్వెస్టర్లు, కొత్త వ్యక్తులు సులభంగా పెట్టుబడులు పెట్టవచ్చని టాటా డిజిటల్ చెబుతోంది. కస్టమర్లు కనీసం రూ.1,000 ఎఫ్‌డీ చేయగలరని కంపెనీ తెలిపింది. ఈ ఫిక్స్‌డ్ డిపాజిట్‌లో వారు డిపాజిట్ ఇన్సూరెన్స్ అండ్ క్రెడిట్ గ్యారెంటీ కార్పొరేషన్ (డిఐసిజిసి) ద్వారా రూ. 5 లక్షల వరకు బ్యాంకు పెట్టుబడికి బీమా కూడా పొందుతారు. ఫిక్స్‌డ్ డిపాజిట్ మార్కెట్‌ప్లేస్‌తో విశ్వసనీయ ప్రొవైడర్ల నుండి అధిక వడ్డీ రేట్లను అందించడం ద్వారా సామాన్యులకు ఫిక్స్‌డ్–రిటర్న్‌ల వంటి ఆర్థిక ఉత్పత్తుల పరిధిని విస్తరించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని కంపెనీ తెలిపింది. విడుదల చేసిన పత్రికా ప్రకటన ప్రకారం.. సూర్యోదయ్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్, శ్రీరామ్ ఫైనాన్స్, బజాజ్ ఫైనాన్స్‌తో సహా పలు విశ్వసనీయ బ్యాంకులు, NBFCల నుండి ప్లాట్‌ఫారమ్ FDలను అందిస్తుంది. ప్లాట్‌ఫారమ్ ద్వారా చేసిన పెట్టుబడులకు డిపాజిట్ ఇన్సూరెన్స్ అండ్ క్రెడిట్ గ్యారెంటీ కార్పొరేషన్ (DICGC) కింద INR 5 లక్షల వరకు బీమా చేయబడుతుంది. ఇది కస్టమర్‌లకు భద్రత కల్పిస్తోంది.

## వాట్సాప్ యూజర్లకు గుడ్‌న్యూస్.. త్వరలోనే మరో మూడు ఫీచర్లు అందుబాటులోకి..!



మెటా యాజమాన్యంలో వాట్సాప్‌కు ప్రపంచవ్యాప్తంగా పెద్ద ఎత్తున యూజర్లు ఉన్నారు. ఈ క్రమంలో ఎప్పటికప్పుడు యూజర్లను ఆకట్టుకునేందుకు కంపెనీ కొత్త కొత్త ఫీచర్లను పరిచయం చేస్తూ వస్తున్నది. గతేడాది ఏఐ సాంకేతికను జోడించి వాట్సాప్ రూపురేఖలనే మార్చేసింది. తాజాగా నూతన సంవత్సరంలో మరో మూడు ఫీచర్స్‌ను యూజర్లకు అందుబాటులోకి తీసుకురాబోతున్నది. మెటా ఏఐ ఫీచర్స్‌ను వాట్సాప్ సిద్ధం చేస్తున్నది. దీంతో వినియోగదారులకు మరింత సౌకర్యవంతంగా ఉండనున్నది.

వాట్సాప్‌లో రాబోయే ఫీచర్లు ఇవే..

మెటా ఏఐ షార్ట్‌కట్ : మెటా ఏఐ చాట్‌బాట్‌లో ఇన్‌స్టంట్ యాక్సెస్ కోసం షార్ట్‌కట్ బటన్‌పై వాట్సాప్ పని చేస్తుంది. ఈ బటన్ సహాయంతో యూజర్లు మెటా ఏఐని ఉపయోగించి వారి సమస్యలను సులభంగానే పరిష్కరించుకోవచ్చు. అవసరమైన సలహాలను సైతం పొందేందుకు వీలుంటుంది. ఈ బటన్ ప్రస్తుతం చాట్‌ల ట్యాబ్‌లో అందుబాటులో ఉంటుంది. ఇది విజిబిలిటీని పెంచడంతో పాటు యూజర్లు సులభంగా యాక్సెస్ చేయొచ్చు. ప్రస్తుతం ఈ ఫీచర్ ఐఓఎస్‌లో టెస్టింగ్ దశలో ఉంది. త్వరలోనే మిగతా యూజర్లందరికీ అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది.

మెటా ఏఐకి మెసేజ్ ఫార్వర్డింగ్ : ప్రస్తుతం మెటా ఏఐకి మెసేజ్ ఫార్వర్డ్ చేసే ఫీచర్‌పై వాట్సాప్ పని చేస్తుంది. ఈ ఫీచర్‌లో యూజర్లు మెటా ఏఐకి ఏదైనా మీడియా లేదంటే మెసేజ్‌ను పంపుకోవచ్చు. టెక్ట్స్‌ను కాపీ పేస్ట్ చేసుకోవచ్చు. స్పామ్ మెసేజ్‌లను చెక్ చేసుకొని చేసుకొని వెరిఫై చేసుకునేందుకు ఈ ఫీచర్ వినియోగదారులకు సహాయపడనున్నది. సరళంగా చెప్పాలంటే ఫ్యాక్ట్ చెకింగ్‌గా ఉపయోగపడనున్నది. ప్రస్తుతం ఈ ఫీచర్ ఆండ్రాయిడ్ యూజర్లకు అభివృద్ధి చేస్తున్నది. త్వరలోనే అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది.

మెటా ఏఐ చాట్ మెమరీ : మెటా వాట్సాప్‌లో ఏఐని మరింత దగ్గర చేసుందుకు చాట్ మెమొరీ ఫీచర్‌ను తీసుకువస్తున్నది. దీంతో పర్సనల్ అసిస్టెన్స్ మెరుగవనున్నది. యూజర్లు ఏఐని అడిగిన ప్రశ్నలను గుర్తుంచుకుంటుంది. యూజర్లు ఏ సమయంలో ఏం తింటారు.. ఎలాంటి వస్తువులను ఇష్టపడుతున్నారనే.. అయిష్టాలు ఏమున్నాయనే అనే విషయాలను గుర్తుంచుకుంటుంది. ఎప్పటికప్పుడు సమాచారాన్ని గుర్తుంచుకొని.. ఎప్పుడైనా మళ్లీ ప్రశ్నలు అడిగిన సమయంలో డేటా సహాయంతో సమాధానం ఇస్తుంది.

Crime News
ది క్రైమ్ న్యూస్
తెలుగు దినపత్రిక

# ఆరోగ్యం



## నిద్ర లేమితో మధుమేహ ముప్పు

న్యూఢిల్లీ : నిద్రలేమితో మహిళల్లో ముఖ్యంగా రుతుక్రమం ఆగిపోయిన వారిలో మధుమేహ ముప్పు అధికమని పరిశోధకులు వెల్లడించారు. నేషనల్ ఇనిస్టిట్యూట్స్ ఆఫ్ హెల్త్ (ఎన్ఐహెచ్) చేపట్టిన ఈ అధ్యయన వివరాలు డయాబెటిక్ కేర్ జర్నల్‌లో ప్రచురితమయ్యాయి. మహిళల్లో టైప్ టూ డయాబెటిస్ ముప్పును తగ్గించేందుకు కంటినిండా కునుకు తీయడం ముఖ్యమని ఈ అధ్యయనంలో వెల్లడైంది. నిద్రలో అవాంతరాలు, నిద్రలేమి మహిళల ఆరోగ్యకర జీవితకాలంపై ముఖ్యంగా రుతుక్రమం నిలిచిపోయిన మహిళలపై ప్రభావం చూపుతుందని నేషనల్ హార్ట్, లంగ్, బ్లడ్ ఇనిస్టిట్యూట్‌కు చెందిన నేషనల్ సెంటర్ ఆన్ స్లీప్ డిజార్డ రీసెర్చ్ డైరెక్టర్ మరిష్క బ్రౌన్ పేర్కొన్నారు. పురుషుల కంటే మహిళలు నిద్ర లేమితో సతమతమవుతున్నట్టు చెబుతుంటారని తెలిపారు. నిద్ర లేమితో హృద్రోగాలు, రక్తపోటు ముప్పుకు సంబంధంపై గతంలో పలు అధ్యయనాలు వెల్లడించగా, తాజా సర్వే ప్రత్యేకంగా నిద్ర లేమి మహిళలపై చూపే ప్రభావంపై ప్రధానంగా దృష్టి సారించింది. 20 నుంచి 75 ఏండ్ల వయసున్న మహిళలపై ఈ అధ్యయనం నిర్వహించారు. అధ్యయనంలో భాగంగా రాత్రి సమయంలో కేవలం 6.2 గంటలే నిద్రించిన మహిళల్లో ముఖ్యంగా రుతుక్రమం ఆగిపోయిన మహిళ్లలో టైప్ 2 మధుమేహ ముప్పు పెరుగుతున్నట్టు గుర్తించారు. నిద్రలేమితో బాధపడే మహిళల్లో గ్లూకోజ్ లెవెల్స్ సాధారణ స్థాయికి తీసుకువచ్చేందుకు మరింత ఇన్సులిన్ అవసరమవుతుందని ఈ అధ్యయనంలో తాము గుర్తించామని అధ్యయన రచయిత మేరీ పిరీ స్టెంజ్ వెల్లడించారు.

## నోటి పుండ్లతో బాధపడుతున్నారా? అయితే ఇలా చేయండి!



నోటి పుండ్లతో తినడం కష్టమవుతుంది. అయితే రోజుల తరబడి వీటితో బాధపడే బదులు ఇవిగో ఈ సహజసిద్ధమైన చిట్కాలతో వాటిని తగ్గించే ప్రయత్నం చేయండి.

తేనె: తేనెలో ఔషధగుణాలు నోటి పుండ్లనూ తగ్గిస్తాయి. కాబట్టి తేనెను నేరుగా పుండ్ల మీద పూయాలి. నోట్లో తేనెను ఉమ్మితో కలిపి మింగేస్తూ ఉంటాం. కాబట్టి ప్రతి రెండు గంటలకొకసారి తేనెను పూస్తూ ఉండాలి. తేనెలోని ఔషధగుణాలు పుండును త్వరితంగా మాన్పుతాయి. అలాగే తేనె పుండు మీద ఒక పొరలాగా ఏర్పడి, ఆహారం తినేటప్పుడు పుండు మరింత బాధ పెట్టకుండా అడ్డు పడుతుంది. ఇలా తేనెను వాడడం వల్ల రెండు రోజుల్లోనే పుండ్లు మానతాయి.

సోడా ఉప్పు: ఒక గిన్నెలో సమపాళ్లలో సోడా ఉప్పు, నీళ్లు కలుపుకోవాలి. ఇలా చిక్కటి మిశ్రమం తయారుచేసుకుని, పుండు మీద, దాని చుట్టూ పూసుకోవాలి. తర్వాత ఆరేవరకూ ఆగాలి. ఆరిన తర్వాత నీటితో నోరు పుక్కిలించుకోవాలి. ఇలా రోజు మొత్తంలో మూడు నుంచి నాలుగు సార్లు చేయాలి. సోడాఉప్పు క్షారతత్వం కలిగి ఉంటుంది కాబట్టి నోట్లోని ఆమ్లం తీవ్రత తగ్గుతుంది. దాంతో పుండు మానుతుంది.

కొబ్బరినూనె: రాత్రి నిద్రకు ముందు కొబ్బరినూనెను పుండు మీద పూసుకోవాలి. కొబ్బరినూనెలోని యాంటీమైక్రోబియల్ గుణాలు పుండును మాన్పుతాయి.

ఉప్పు నీళ్లు: గ్లాసు గోరువెచ్చని నీళ్లలో చెంచా ఉప్పు కలపాలి. ఈ నీటితో నిమిషం పాటు నోరు పుక్కిలించాలి. తర్వాత ఉప్పదనం తగ్గడం కోసం మామూలు నీటితో పుక్కిలించాలి. ఇలా రోజుకు రెండు నుంచి మూడు సార్లు చొప్పున మూడు రోజుల పాటు చేయాలి. ఉప్పు యాంటీసెప్టిక్‌లా పని చేస్తుంది. కాబట్టి పుండు త్వరగా మానుతుంది.

టూత్‌పేస్ట: వేలితో టూత్‌పేస్ట తీసుకుని పుండు మీద, దాని చుట్టూ పూసుకోవాలి. అది ఆరేవరకూ ఐదు నిమిషాల పాటు ఆగాలి. తర్వాత నీటితో పుక్కిలించాలి. ఇలా రోజుకు రెండుసార్లు చేస్తే నోటి పుండ్లు తగ్గుతాయి.

లవంగ నూనె: దూది ఉండను లవంగ నూనెలో ముంచి, పుండు మీద ఉంచాలి. నూనెను పుండు పీల్చుకునే వరకూ ఆగి, దూదిని తీసేయాలి. లవంగ నూనెలో 'యూజెనాల్' పుండును త్వరగా మాన్పుతుంది. నొప్పినీ తగ్గిస్తుంది. అయితే లవంగ నూనె తగిలిన వెంటనే మంట పుడుతుంది. అయితే ఆ కొద్దిసేపు ఓర్చుకుంటే నోటి పుండ్లు త్వరగా మానతాయి.

కొబ్బరిపాలు: రోజుకు మూడు సార్లు చొప్పున మూడు రోజుల పాటు కొబ్బరిపాలతో నోరు పుక్కిలించాలి. లేదంటే నోటి నిండా కొబ్బరి పాలను తీసుకుని, ఆ బుగ్గ నుంచి ఈ బుగ్గకు మారుస్తూ నిమిషంపాటు ఇలా చేసి, ఉమ్మేయాలి. కొబ్బరిపాలలోని యాంటీ మైక్రోబియల్, యాంటీ వైరల్ గుణాలు నోటి పుండ్లను మాన్పుతాయి.

## గుండెకు చలి తిప్పలు.. బీ కేర్ ఫుల్ అంటున్న..!

ఇంకా చలి పెరగకపోయినా, రాత్రుళ్లు తాపమానాలు తగ్గుముఖం పడుతున్నాయి. అయితే కొంతమందికి చలి ప్రభావం చేటు చేస్తుంది. కాబట్టి ఈ కాలంలో కొమార్బిడ్ కోవకు చెందిన వాళ్లు అప్రమత్తంగా ఉండాలి.

తాపమానాల్లో హెచ్చుతగ్గులు: తాపమానాల్లో వచ్చే తేడాలు శరీరంలోని హార్మోన్ల మీద ప్రభావం చూపిస్తాయి. అడ్రినలిన్, నారిటలిన్ అనే హార్మోన్లు లెవెల్స్ హఠాత్తుగా పెరిగి, రక్తనాళాల్లో పేరుకున్న కొవ్వు ఒక్కసారిగా పగులుతుంది. ఇలా పగిలి, కొవ్వు కణాలు రక్తనాళాల్లో అడ్డంకిగా మారి రక్తప్రసారానికి అవరోధం కలిగిస్తాయి. ఫలితంగా గుండెకు సరిపడా రక్తప్రసారం జరగక గుండె పోటు వస్తుంది.

చలి ఒణుకు: చలికి ఒణుకు రావటం సహజం. ఇలా హృద్రోగులు వణకటం వల్ల శరీరంలోని హార్మోన్లు హెచ్చుతగ్గులకు లోనవుతాయి. ఫలితంగా రక్తనాళాల్లోని కొవ్వు నిల్వలు కదిలి రక్తనాళాలు మూసుకుపోయి గుండెపోటు వస్తుంది.

పెరిగే రక్తపోటు: రక్తపోటు ఉన్న వాళ్లలో చలికాలం పెరిగే తరిగే ఉష్ణోగ్రతల వల్ల, బిపి కూడా ఒడిదొడుకులకు లోనవుతుంది. దాంతో రక్తనాళాల్లో ఒత్తిడి పెరిగి ఆ ప్రభావం గుండె మీద పడి హృద్రోగాలు, గుండె పోట్లు వస్తాయి.

ఆస్తమా, సీవోపీడీ: ఈ కాలంలో ఆస్తమా, సీవోపీడీ సమస్యలు కూడా పెరుగుతాయి. ఈ సమస్యల వల్ల ఊపిరితిత్తుల్లోకి గాలి సరిపడా చేరుకోకపోవటం వల్ల ఆక్సిజన్ లెవెల్స్ తగ్గుతాయి. గుండె మీద ఒత్తిడి పెరిగి గుండెపోట్లు వస్తాయి.

అర్ధరాత్రి భోజనం: పెళ్లిళ్లు, వేడుకలకు హాజరవుతూ అర్ధరాత్రి ఆలస్యంగా భారీ భోజనం చేయటం మామూలే! ఉప్పు, మసాలాలు, కారాలు, నూనెలు ఎక్కువగా ఉండే ఆహారం తినటం ఆ ఆహారాన్ని అరిగించుకోవటం కోసం శరీరం అవసరానికి మించి కష్టపడాల్సి వస్తుంది. దాంతో గుండె మీద ఒత్తిడి పడి, గుండెపోటు వచ్చే అవకాశాలు పెరుగుతాయి.




## ఇలా చేస్తే ఎముకలు దృఢం!

వయసు పైబడేకొద్దీ ఎముకలు గుల్లబారడం సహజం. ఇదే తత్వం జన్యుపరంగా కూడా తల్లితండ్రుల నుంచి సంక్రమిస్తుంది. ఈ రెండిటి నుంచీ తప్పించుకునే మార్గాలు లేకపోయినా, అందుకు దారితీసే అవకాశాల నుంచి తప్పించుకునే వీలుంది. ఎముకలు బలంగా ఉండడానికి తోడ్పడే అలవాట్లకు జీవనశైలిలో చోటు కల్పించడం ఇందుకు ఎంతో అవసరం.

ఈ సమస్యలో ప్రత్యేకమైన లక్షణాలేవీ ఉండకపోయినా, ఎముకలు తేలికపాటి ఒత్తిడికీ, దెబ్బలకే విరిగిపోతూ ఉంటాయి. తీవ్రమైన సందర్భాల్లో గట్టిగా తుమ్మినా, దగ్గినా ఎముకలు విరిగిపోవచ్చు. వీపు కింది భాగంలో నొప్పి రోజుల తరబడి వేధిస్తూ ఉండవచ్చు. పెద్దలు ఎత్తు తగ్గుతారు. శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది ఏర్పడుతుంది. లక్షణాలతో పాటు రేడియేషన్ ఎక్స్‌రే ద్వారా ఎముక సాంద్రతను పరీక్షించి, ఎముకలు ఏ మేరకు గుల్లబారాయో అంచనా వేసి, వైద్యులు తగిన చికిత్సను సూచిస్తారు.

వ్యాయామం!

కండరాలలాగే ఎముకలు కూడా వ్యాయామంతో బలపడతాయి. ఇందుకోసం శరీర బరువును భూమ్యాకర్షణకు వ్యతిరేకంగా కదిలించే వ్యాయామాలు ఎంచుకోవాలి. వీటిలో ముఖ్యమైనవి ఏరోబిక్స్, జాగింగ్, డాన్సింగ్, టెన్నిస్ లాంటి ఆటలు, నడక, పరుగు, వాటర్ ఏరోబిక్స్, యోగా! స్ట్రెంగ్త్ ట్రైనింగ్‌లో ఎముకలకు అంటుకుని ఉండే కండరాలు సాగుతాయి. దాంతో ఎముక బలం పెరుగుతుంది. పిల్లలను ఎత్తుకోవడం, చేతులతో బరువులు ఎత్తడం, ఎలాస్టిక్ రెసిస్టెంట్ బ్యాండ్స్‌తో వ్యాయామాలు చేయడం, పుషప్స్, స్క్వాట్స్ మొదలైన వ్యాయామాలు చేయడం.

వీటిని మానేయాలి!

మితిమీరిన మద్యపానంతో ఎముకలు గుల్లబారతాయి.



ధూమపానంతో ఎముకల సాంద్రత తగ్గి, బలహీనమై తేలికగా విరుగుతాయి. శరీరంలోని ఈస్ట్రోజన్ హార్మోన్ సామర్థ్యం తగ్గి, ఎముకలు బలహీనపడతాయి.

విపరీతంగా వ్యాయామం చేసే యుక్తవయస్కులైన అమ్మాయిలలో అస్తవ్యస్థ రుతుక్రమం, ఎముకలు పలుచబడడం, ఈటింగ్ డిజార్డర్లు ఉంటూ ఉంటాయి. సరైన ఆహారం తీసుకోకుండా అవసరానికి మించి వ్యాయామాలు చేసే అమ్మాయిల్లో ఈ మూడు ఇబ్బందులు ఉంటాయి. వాటి మూలంగా ఈస్ట్రోజన్ హార్మోన్ తగ్గి, ఎముకలు బలహీనపడతాయి.

శీతలపానీయాల్లో ఉండే అదనపు ఫాస్ఫరస్ శరీరం క్యాల్షియంను శోషణ చేసుకునే సామర్థ్యాన్ని దెబ్బతీస్తుంది. కాబట్టి వీటిని మానేయాలి.

నివారణ ఇలా... : 18 ఏళ్లు పైబడిన వాళ్లు రోజుకు వెయ్యి మి.గ్రా క్యాల్షియం తీసుకోవాలి. 50 ఏళ్లు పైబడిన మహిళలు, 70 ఏళ్లు పైబడిన పురుషులు రోజుకు 12 వేల మి.గ్రా క్యాల్షియం తీసుకోవాలి.

వేగంగా నడవాలి, బరువులెత్తే వ్యాయామాలు చేయాలి.

ఇంట్లో జారి పడిపోకుండా యాంటీ స్కిడ్ మ్యాట్స్, స్లిప్పర్స్ వాడుకోవాలి.

ఎముక సాంద్రతను పరీక్షించుకుంటూ, వైద్యుల సూచన మేరకు నడుచుకుంటూ ఉండాలి.

క్యాల్షియం, విటమిన్ డి!

శరీరంలో సరిపడా క్యాల్షియం లేకపోతే, తన అవసరాల కోసం శరీరం ఎముకల నుంచి క్యాల్షియం తీసుకుంటుంది. ఫలితంగా ఎముకల సాంద్రత తరిగిపోతుంది. కాబట్టి ప్రతి రోజూ ఆహారం ద్వారా సరిపడా క్యాల్షియంను శరీరానికి అందిస్తూ ఉండాలి. ఇందుకోసం ఫ్యాట్ ఫ్రీ పాలు తీసుకోవాలి. సోయాపాలు, టోఫు, తృణధాన్యాలు తీసుకోవాలి. ముదురు ఆకుపచ్చ రంగులో ఉండే బ్రొకొలి లాంటి కూరగాయలు ఎంచుకోవాలి. విటమిన్ డి కోసం ప్రతి రోజూ ఉదయం, లేదా సాయంత్రం సూర్యరశ్మి సోకేలా చూసుకోవాలి. చీజ్, గుడ్లు తినాలి.

## అతిగా ప్రాసెస్ చేసిన ఆహార పదార్థాలపై లేటెస్ట్ సర్వేలో సంచలన వివరాలు



న్యూఢిల్లీ : అల్ట్రా ప్రాసెస్డ్ ఆహారం (యూపీఎఫ్) అనేక ఆరోగ్య సమస్యలకు మూలమని (%చీవష ౫బఎఎ%) చెబుతుంటారు. అతిగా ప్రాసెస్ చేసిన ఆహారంతో దీర్ఘకాలంలో ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయని కొన్నేండ్లుగా పలు అధ్యయనాలు వెల్లడించాయి. అయితే అన్ని రకాల ప్రాసెస్డ్ ఆహారాలు ప్రమాదకరం కాదని లాన్సెట్ జర్నల్‌లో ప్రచురితమైన తాజా అధ్యయనం స్పష్టం చేసింది. అతిగా ప్రాసెస్ చేసిన ఆహార పదార్థాలను పూర్తిగా దూరం పెట్టాల్సిన అవసరం లేదని తమ అధ్యయనంలో తేలిందని పరిశోధకులు పేర్కొన్నారు. అతిగా ప్రాసెస్ చేసిన ఆహార పదార్థాలను పూర్తిగా పక్కనపెట్టాల్సిన పనిలేదని, వీటి వినిమయం పరిమితంగా ఉండాలని, తాజాగా, తక్కువగా ప్రాసెస్ చేసిన ఆహార పదార్థాలకు ప్రాధాన్యం ఇవ్వాలని అధ్యయన సహ రచయిత హింజ్ ఫ్రిలింగ్ వెల్లడించారు. అతిగా ప్రాసెస్ చేసిన ఆహార పదార్థాల్లో జంతు సంబంధ ఆహారోత్పత్తులు, కృత్రిమ, చక్కెరతో కూడిన పానీయాలను పూర్తిగా పక్కనపెట్టాలని అధ్యయనం స్పష్టం చేసింది. ఈ ప్రాసెస్డ్ ఆహార పదార్థాలు క్యాన్సర్, హృద్రోగ ముప్పును పెంచుతాయని హెచ్చరించింది. అతిగా ప్రాసెస్ చేసిన బ్రెడ్స్, సిరిల్స్, మొక్కల సంబంధిత ప్రత్యామ్నాయాల నుంచి ముప్పు తక్కువగా ఉంటుందని పేర్కొంది. ఇలాంటి ఉత్పత్తుల్లో ఫైబర్ ఉండటం మూలంగా ముప్పు తక్కువగా ఉండవచ్చని అధ్యయనానికి నేతృత్వం వహించిన రేనాల్డ కర్డొవ తెలిపారు. ఏమైనా తాజా, తక్కువ ప్రాసెస్ చేసిన ఆహార పదార్థాలనే వినియోగదారులు ఎంపిక చేసుకోవాలని ఈ అధ్యయనం వెల్లడించింది.

## కూర్చోవడం కంటే కునుకు తీయడం మేలు..!




న్యూఢిల్లీ : శారీరక చురుకుదనం లోపించడం ద్వారా ఊబకాయం, మధుమేహం, హృద్రోగాలు వంటి అనారోగ్యాలతో అకాల మరణం ముప్పు పొంచిఉంటుందని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నాయి. పలు అధ్యయనాలు కూడా చురుకైన జీవనశైలి కొరవడితే తీవ్ర అనారోగ్యాలు చుట్టుముడతాయని తేల్చిచెప్పాయి. చురుకైన జీవనశైలిని అలవరచుకోవడమే ఈ అనర్ధాలను తప్పించుకునేందుకు పరిష్కారంగా ముందుకొస్తోంది. ఇక అధిక బరువును తగ్గించుకుని చలాకీగా మారేందుకు రన్నింగ్, వేగంగా నడవడం, సైక్లింగ్, స్విమ్మింగ్, మెట్లు ఎక్కడం వంటి ఓ మోస్తరు నుంచి కఠిన వ్యాయామాలను క్రమం తప్పకుండా అనుసరించాలని చెబుతున్నారు.

ఇక తేలికపాటి శ్రమతో కూడిన కార్యకలాపాలు సైతం మెరుగైన ఆరోగ్య ప్రయోజనాలు కల్పిస్తుందని యూరోపియన్ హార్ట్ జర్నల్‌లో ప్రచురితమైన అధ్యయనం పేర్కొంది. 30 నిమిషాల పాటు కూర్చోవడంతో పోలిస్తే 30 నిమిషాలు నిద్రించడం ద్వారా బరువు గణనీయంగా తగ్గుతారని ఈ అధ్యయనం వెల్లడించింది. నిలుచుని ఉండటం, కొద్దిపాటి నడక కూడా ఇదే తరహా ఫలితాలు అందిస్తుందని తెలిపింది.

నాణ్యతతో కూడిన నిద్ర, అది గుండె ఆరోగ్యంపై చూపే ప్రభావం కీలకమని డెన్వర్‌కు చెందిన నేషనల్ జ్యూయిష్ హెల్త్ డైరెక్టర్, ప్రముఖ హృద్రోగ నిపుణులు డాక్టర్ ఆండ్రూ ఫ్రీమన్ పేర్కొన్నారు. అయితే ఆరోగ్యాన్ని పెంపొందించే ఇతర పద్ధతులకు ప్రత్యామ్నాయంగా అదే పనిగా నిద్రిస్తే ప్రతికూల ఫలితాలు తప్పవని హెచ్చరించారు. తేలికపాటి నుంచి కఠిన వ్యాయామాలు బరువు తగ్గడంతో పాటు నడుము చుట్టుకొలతను తగ్గిస్తాయని కూడా ఈ అధ్యయనం వెల్లడించింది.

## బ్రెయిన్ స్ట్రోక్ జరిగితే మాత్రం..!



గుండెకే కాదు మెదడు కూడా పోటుకు గురవుతుంది. రక్తనాళాలు చిట్లడం, రక్తస్రావం జరగడం వల్ల తలెత్తే బ్రెయిన్ స్ట్రోక్‌కు అత్యవసర చికిత్స అవసరం. సాధ్యమైనంత త్వరగా చికిత్స అందించగలిగితే మరింత నష్టం జరగకుండా అడ్డుకోవచ్చు అంటున్నారు వైద్యులు.

మెదడుకు జరిగే రక్తస్రావం క్షీణించి, మెదడులోని రక్తనాళాలు డ్యామేజ్ అవడం వల్ల తెలెత్తే లక్షణాలే బ్రెయిన్ స్ట్రోక్. రక్తనాళంలో అడ్డంకి ఏర్పడితే 'ఇసి?మిక్ స్ట్రోక్', రక్తనాళం చిట్లిపోతే 'హెమరేజిక్ స్ట్రోక్'... ఇలా రెండు రకాల బ్రెయిన్ స్ట్రోక్స్ ఉంటాయి. అయితే రెండు స్ట్రోక్స్ లక్షణాలు ఒకేలా ఉంటాయి. కొన్ని సందర్భాల్లో హెమరేజిక్ స్ట్రోక్‌లో మూర్ఛలు కూడా రావచ్చు. తలనొప్పి, వాంతులు కూడా ఉండవచ్చు.

లక్షణాలు ఇవే!

ప్రపంచవ్యాప్తంగా అంగీకారం పొందిన బ్రెయిన్ స్ట్రోక్ లక్షణాలు 'ఆఉ ఊఅఖీఖీ'. అవేంటంటే....

బ్యాలన్స్: బ్యాలన్స్ తప్పడం. నడుస్తున్నప్పుడు తూలు రావడం, కళ్లు తిరగడం

ఐ: అకస్మాత్తుగా కంటి చూపు తగ్గడం, ఒక వైపు కనిపించకపోవడం

ఫేస్: ముఖంలో బలహీనత, మూతి వంకర పోవడం

ఆర్మ్ లేదా లెగ్: అకస్మాత్తుగా చేయి, కాలు లేపలేకపోవడం, లేదా స్పర్శ తగ్గిపోవడం

స్పీచ్: అకస్మాత్తుగా మాటలు ఆగిపోవడం లేదా మాట ముద్దగా రావడం

టైమ్: ఈ లక్షణాలు కనిపించినప్పుడు ఏమాత్రం ఆలస్యం చేయకుండా, వెంటనే ఆస్పత్రికి చేరుకోవడం ఈ లక్షణాలన్నీ అకస్మాత్తుగా తలెత్తడం బ్రెయిన్ స్ట్రోక్ ప్రధాన లక్షణం.

ఎవరికి, ఎందుకు?

రెండు రకాల బ్రెయిన్ స్ట్రోక్స్‌కు వయసుతో సంబంధం లేదు. అయితే 50 ఏళ్లు పైబడిన వాళ్లలో మధుమేహం, అధిక రక్తపోటు సమస్యల ఉంటాయి కాబట్టి వాళ్లు బ్రెయిన్ స్ట్రోక్‌కు గురయ్యే అవకాశాలు ఎక్కువ. అలాగే పెద్ద వయసులో రక్తనాళాల పటుత్వం తగ్గడం, ధూమపానం, మద్యపానం అలవాట్ల తోడవడం వల్ల కూడా ఈ సమస్య తలెత్తే అవకాశాలుంటాయి. ఇక పిల్లల్లో సికిల్ సెల్ అనీమియా, పుట్టుకతో రక్తనాళాలు బలహీనండా ఉండడం వల్ల, తలకు దెబ్బలు తగలడం వల్ల అరుదుగా కొందరు పిల్లలు కూడా బ్రెయిన్ స్ట్రోక్‌కు గురవుతూ ఉంటారు. ఇటీవలి కాలంలో మద్యపానం, ధూమపానం, డ్రగ్స్, సెడెంటరీ లైఫ్ స్టైల్, వ్యక్తిగత, వృత్తిగత ఒత్తిడులు, ఒబేసిటీల కారణంగా, మధ్య వయస్కుల్లో (32 నుంచి 50) కూడా బ్రెయిన్ స్ట్రోక్స్ పెరుగుతున్నాయి.

సమయమే కీలకం

చికిత్స ఒక సెకను పాటు వృథా అయినా, మెదడులో 19 లక్షల న్యూరాన్లు డ్యామేజ్ అయిపోతూ ఉంటాయి. కాబట్టి సమస్యను ఎంత త్వరగా నిర్ధారించి, చికిత్స అందిస్తే, మరింత నష్టం జరగకుండా అక్కడితే నియంత్రించగలుగుతాం. ఇసి?మిక్ స్ట్రోక్ విషయంలో తక్షణ చికిత్స ఎంతో కీలకం. లక్షణాలు తలెత్తిన నాలుగున్నర గంటల్లోగా బ్రెయిన్ స్కాన్ చేసి, రక్తపు గడ్డను గుర్తిస్తే, థ్రాంబోలైటిక్ ఇంజెక్షన్ ఇచ్చి, అంతటితో నష్టానికి అడ్డుకట్ట వేయవచ్చు. కొన్ని రక్తనాళాల్లో ఏర్పడే రక్తపు గడ్డలను థ్రోంబెక్టమీ చికిత్స ద్వారా ఆరు గంటల్లోపు తొలగించవచ్చు. కొన్ని ప్రత్యేకమైన సందర్భాల్లో 24 గంటల్లోగా చికిత్స అందించి పరిస్థితిని అదుపులోకి తీసుకురావచ్చు. అయితే ఈ చికిత్సలన్నీ స్ట్రోక్ వల్ల మెదడుకు జరిగిన నష్టాన్ని నివారించడానికి కాకుండా, మరింత నష్టం జరగకుండా నిలువరించడానికి మాత్రమే పనికొస్తాయి. థ్రోంబెక్టమీ చికిత్సలో గుండెకు యాంజియోగ్రామ్ చేసిన వి?ధానాన్నే అనుసరిస్తారు. ఇక హెమరేజిక్ స్ట్రోక్‌కు ప్రధానంగా అధిక రక్తపోటే కారణమవుతూ ఉంటుంది. ఇలాంటి సందర్భాల్లో సూక్ష్మ రక్తనాళాలు చిట్లిపోతూ ఉంటాయి. ఇలాంటి సందర్భాల్లో మెదడులో వాపు పెరగకుండా జాగ్రత్తలు తీసుకోవడంతో పాటు, రక్తపోటును అదుపు చేయవలసి ఉంటుంది. అయితే బ్రెయిన్ స్ట్రోక్ విషయంలో సమయం కీలకం. కాబట్టి ఆలస్యం చేయకుండా అనుభవజ్ఞులైన ఇంటర్వెన్షనల్ న్యూరాలజిస్ట్, క్యాథ్ ల్యాబ్ ఉన్న ఆస్పత్రిని ఎంచుకోవడం ఎంతో కీలకం.

తదనంతర చికిత్స ఇలా...

స్ట్రోక్ వచ్చిన కారణం మీద చికిత్స తదనంతర మందులు ఆధారపడి ఉంటాయి. ఫిజియోథెరపీతో పాటు, యాంటీ ప్లేట్‌లెట్లు, యాంటీ కాగ్యులెంట్లు, స్టాటిన్లు తీసుకోవాల్సి ఉంటుంది. ఒకసారి బ్రెయిన్ స్ట్రోక్ గురైన వాళ్లు మరొక స్ట్రోక్‌ను నివారించడం కోసం జీవితాంతం మందులు వాడక తప్పదు. అయితే మందుల మోతాదును వైద్యులు క్రమేపీ మారుస్తూ ఉంటారు. ఈ మందులతో పాటు మధుమేహం, అధిక రక్తపోటులను కూడా అదుపులో ఉంచుకోవాలి. గుండె సమస్యలను అదుపులో ఉంచుకోవడం, దురలవాట్లకు దూరంగా ఉండడం చేయాలి. పిండిపదార్థాలకు బదులుగా, పీచు, ప్రొటీన్ ఎక్కువగా ఉండే ఆహారం ఎక్కువగా తీసుకోవాలి.

మందులతో బలహీనత పోదు

సాధారణంగా మందులతో సమస్య సరిదిద్దుకోవచ్చు అనుకుంటారు. కానీ బ్రెయిన్ స్ట్రోక్‌లో ఇది అసాధ్యం. బ్రెయిన్ స్ట్రోక్ మూలంగా పక్షవాతం, మాటల్లో తేడా, అవయవాల్లో బలహీనతలు మందులతో మెరుగు పడవు. మందులతో రెండోసారి స్ట్రోక్ రాకుండా మాత్రమే నియంత్రించవచ్చు. అప్పటికే తలెత్తిన లక్షణాలను మెరుగు పరుచుకోవడం కోసం, ఫిజియోథెరపీ, స్పీచ్ థెరపీలను అనుసరించాలి.

స్కాన్‌లో మచ్చతో భయం వద్దు

సాధారణంగా సమస్య తలెత్తిన సమయంలో తీసిన బ్రెయిన్ స్కాన్‌లో మచ్చ కనిపిస్తుంది. అంటే అప్పటికే బ్రెయిన్ డ్యామేజ్ అయిపోయింది. దీన్ని సరిదిద్దడం అసాధ్యం. కాబట్టి ఆ మచ్చ అలాగే ఉండిపోతుంది. అయితే చికిత్స తదనంతరం తీయించిన బ్రెయిన్ స్కాన్‌లో కూడా అదే మచ్చ మళ్లీ కనిపించడంతో, దాన్ని చూసి సమస్య అలాగే ఉండిపోయిందని భయపడుతూ ఉంటారు. కానీ శరీరం మీద గాయమైనప్పుడు, గాయం మానినా మచ్చ ఎలా మిగిలిపోతుందో, మెదడులో కూడా ఇలాగే మచ్చ ఏర్పడిపోతుంది. కాబట్టి భయపడవలసిన అవసరం లేదు.

నివారణ ఇలా....

90% బ్రెయిన్ స్ట్రోక్స్ నివారించదగినవే! క్రమం తప్పకుండా రక్తపోటు, మధుమేహాలను పరీక్షించుకుంటూ, వాటిని మందులతో అదుపులో ఉంచుకోవడం, సమతులాహారం తీసుకోవడం, రోజుకు 30 నిమిషాల చొప్పున వారంలో ఐదు రోజుల పాటు వ్యాయామం చేయడం, మద్యపానం, ధూమపానం లాంటి దురలవాట్లకు దూరంగా ఉండడం, ఒత్తిడికి దూరంగా ఉండడం ద్వారా బ్రెయిన్ స్ట్రోక్‌ను నివారించుకోవచ్చు.

అరుదైన 'అన్యురిజమ్'

ఎలాంటి తలనొప్పి అయినా క్రమేపీ పెరుగుతుంది. కానీ అన్యురిజమ్‌లో తలనొప్పి పూర్తి భిన్నం. అకస్మాత్తుగా తట్టుకోలేనంత తలనొప్పి నిమిషం వ్యవధిలోనే వేధిస్తుంది. వీళ్లలో అసహజ రక్తనాళం చిట్లిపోవడం వల్ల రక్తస్రావం ఎక్కువగా జరుగుతుంది. అధిక రక్తపోటు వల్ల చిట్లేవి చిన్న రక్తనాళాలైతే, అన్యురిజం వల్ల పెద్ద రక్తనాళాలు చిట్లిపోతూ ఉంటాయి. దాంతో ఎక్కువ మొత్తాల్లో రక్తస్రావం జరగడం వల్ల, విపరీతమైన తలనొప్పి తలెత్తి, అకస్మాత్తుగా స్పృహ కోల్పోయి, మూర్ఛలు వస్తాయి. ఇలాంటి సందర్భాల్లో సమస్యకు కారణమయిన రక్తనాళాన్ని బ్లాక్ చేయవలసి ఉంటుంది. దాంతో మెదడులో రక్తస్రావం తగ్గిపోతుంది. కొందర్లో వార్నింగ్ హెడ్ ఏక్ వస్తుంది. ఇది స్ట్రోక్‌కు ముందు దశ. ఈ దశలో తలనొప్పి విపరీతంగా వచ్చి, తగ్గిపోతుంది. ఇలాంటప్పుడు అప్రమత్తమై ముందే వైద్యుల్ని కలిస్తే, అన్యూరిజమ్‌ను నివారించుకోవచ్చు. ఇసి?మిక్ స్ట్రోక్‌కు ముందు కూడా కొందర్లో చేయి లేదా కాలు లేపలేకపోవడం లేదా స్పర్శ తగ్గడం, మూతి వంకరపోవడం లాంటి హెచ్చరిక లక్షణాలు కనిపిస్తాయి. ఇవన్నీ నొప్పితో సంబంధం లేని లక్షణాలు కాబట్టి వైద్యులను కలవడంలో అలక్ష్యం వహిస్తూ ఉంటారు. కానీ వెంటనే అప్రమత్తమై వైద్యులను కలిస్తే, మున్ముందు రాబోయే స్ట్రోక్‌ను నివారించుకోవచ్చు. ఇక అకస్మాత్తుగా అన్యురిజమ్‌కు గురైనప్పుడు, ఏమాత్రం ఆలస్యం చేయకుండా న్యూరాలజిస్టను కలవాలి. అయితే చికిత్స ఫలితం వేర్వేరు పరిస్థితుల మీద ఆధారపడి ఉంటుంది. రోగి ఆస్పత్రికి చేరుకున్న పరిస్థితి, రోగి కొమార్బిడ్ పరిస్థితి, గ్లాస్గో కోమా స్కేల్, మెదడులో జరిగిన రక్తస్రావం పరిమాణం, చిట్లిన రక్తనాళం.. ఇలా రోగి కోలుకునే స్థాయి ఈ అంశాలన్నిటి మీదా ఆధారపడి ఉంటుంది.

# లెక్క తప్పుతున్న అజిత్ ప్లానింగ్

తలా అని అభిమానులు ప్రేమగా పిలుచుకునే అజిత్ ఏడాదికి ఒక సినిమా చేయడమే మహా గగనం. అలాంటిది కేవలం మూడు నెలల గ్యాప్ లో రెండు ప్యాన్ ఇండియా మూవీస్ వస్తాయంటే ఆనందంతో ఉక్కిరి బిక్కిరి అయిపోతారు. ప్రస్తుతం అదే జరుగుతోంది. గుడ్ బ్యాడ్ అగ్లీ ఏప్రిల్ 10 విడుదల లాక్ చేస్తూ ఇటీవలే అధికార ప్రకటన ఇచ్చిన సంగతి తెలిసిందే. నిజానికి పొంగల్ కు వద్దామనుకుంటే విడాముయార్చి కోసం వాయిదా వేసుకున్నారు. తీరా చూస్తే అది కూడా పోస్ట్ పోన్ కావడంతో విధి లేని పరిస్థితుల్లో మళ్ళీ నిర్ణయం మార్చుకోలేక కొత్త డేట్ చూసుకున్నారు. ఇప్పుడో కొత్త ట్విస్ట్ వచ్చింది.

తాజాగా విడాముయార్చి సెన్సార్ పూర్తి చేసుకుంది. రెండున్నర గంటల నిడివితో యుఏ సర్టిఫికెట్ ఇచ్చారు. జనవరి నెలాఖరు రిపబ్లిక్ డే సందర్భంగా రిలీజ్ చేసే ఆలోచన జరుగుతోంది. దాదాపు ఖరారైనట్టేనని చెన్నై టాక్. అదే జరిగితే దీనికి గుడ్ బ్యాడ్ అగ్లీకి మధ్య చాలా తక్కువ గ్యాప్ వస్తుంది. కానీ కోలీవుడ్ ఎగ్జిబిటర్ల నుంచి అసంతృప్తి వ్యక్తమవుతోందని సమాచారం. ఎందుకంటే అజిత్ లాంటి పెద్ద రేంజ్ హీరో ఒకేసారి రెండు సినిమాలతో వస్తే భవిష్యత్తులో ఎక్కువ గ్యాప్ వస్తుంది. అసలే విజయ్ రాజకీయాలకు వెళ్ళిపోతున్నాడు. భవిష్యత్తులో తిరిగి వస్తాడో రాడో గ్యారెంటీ లేదు. ఎవరూ చెప్పలేరు.

రజనీకాంత్ ప్రస్తుతమున్న స్పీడ్ కొనసాగిస్తారో లేదో తెలియదు. అలాంటిది అజిత్ ఇప్పుడు బ్యాక్ టు బ్యాక్ వస్తే మళ్ళీ ఎప్పుడు దర్శనం జరుగుతుందోనని ఫాన్స్ కూడా టెన్షన్ పడుతున్నారు. ప్రస్తుతానికి దీనికి పరిష్కారం లేదు. అయితే విడాముయార్చికి గుడ్ బ్యాడ్ అగ్లీ మీద ఉన్నంత బజ్ లేదు. టీజర్ చూశాక పెద్దగా అంచనాలు నెలకొనలేదు. అందుకే వాయిదా వేసి తర్వాత రిలీజ్ చేయమని అభిమానులు డిమాండ్ చేస్తున్నారు. ఒకప్పుడు స్టార్ హీరోలు ఏడాదికి పది పదిహేను సినిమాలు చేసినా జనం చూసేవారు. ఇప్పుడు రెండు వచ్చినా సరే బయ్యర్లు టెన్షన్ పడే పరిస్థితి వచ్చింది. కాలమహిమ.




# క్రాస్ రోడ్స్ అభిమానులు.. గుండె రాయి చేసుకున్నారు

తెలుగు రాష్ట్రాల్లో పెద్ద హీరోల సినిమాలు రిలీజైనప్పుడు ఐకానిక్ సెలబ్రేషన్స్ అంటే ముందు గుర్తొచ్చే పేరు హైదరాబాద్ ఆర్టిసి క్రాస్ రోడ్స్. సుదర్శన్, దేవి, సంధ్య, సప్తగిరి తదితర థియేటర్లలో అర్ధరాత్రి బెనిఫిట్ షోల టైంలో జరిగే కోలాహలం మాములుగా ఉండదు. డీజే సౌండ్లు, ఊరేగింపులు, బాణాసంచా, పెరేడ్లు అబ్బో హంగామా గురించి ఎంత చెప్పినా తక్కువే. అయితే ఇటీవలే జరిగిన పుష్ప 2 దుర్ఘటన నేపథ్యంలో పోలీసులు, ప్రభుత్వం నిబంధనలు కఠినతనం చేయడంతో చాలా ఆంక్షల మధ్య ఫస్ట్ డే ఫస్ట్ షో చూడబోతున్నారు. దానికి తోడు మిడ్ నైట్ ప్రీమియర్లకు తెలంగాణ సర్కారు అనుమతి ఇవ్వకపోవడం మరో షాక్.

మూడు సినిమాల మీద దీని ప్రభావం ఉంటుంది. గేమ్ ఛేంజర్, డాకు మహారాజ్, సంక్రాంతికి వస్తున్నాం కోసం రామ్ చరణ్, బాలకృష్ణ, వెంకటేష్ ఫ్యాన్స్ పోటాపోటీగా సంబరాలు ప్లాన్ చేసుకున్నారు. కానీ ఇప్పుడు వీటిని పరిమితంగా చేసుకోవాల్సి ఉంటుంది. సెక్యూరిటీ కారణాల వల్ల ఈసారి ఏ చిన్న పొరపాటుకి తావిచ్చే ఉద్దేశంలో పోలీసులు లేరు. మరీ మౌనంగా చూడాల్సిన అవసరం ఉండకపోవచ్చు కానీ థియేటర్ బయట మాత్రం ఎక్కువ హల్చల్ చేయడానికి అవకాశం ఉండకపోవచ్చు. ఒకవేళ చేయాలని చూసినా వెంటనే దానికి అనుగుణంగా చర్యలు ఉండే అవకాశముంది కాబట్టి జాగ్రత్తగా ఉండాలి.

కానీ ఏపీలో ఎలాంటి సమస్య లేదు. రాత్రి ఒంటి గంటకు అన్ని కేంద్రాల్లో ప్రీమియర్లు పడుతున్నాయి. మరో బాధ ఏంటంటే క్రాస్ రోడ్స్ లో మొదటి షో పడేలోపే ఆంధ్రప్రదేశ్ నుంచి టాక్ బయటికి వచ్చేస్తుంది. రివ్యూలు, ట్వీట్లు హోరెత్తిపోతాయి. కొందరు అత్యుత్సాహంతో పెట్టే థియేటర్ వీడియోలు మరింత కలవరానికి గురి చేస్తాయి. అంటే ఫస్ట్ షో అనుభూతి దక్కించుకునే లోపే మొత్తం రిపోర్ట్ బయటికి వచ్చేస్తుందన్న మాట. ఇదంతా తాత్కాలికమే కావొచ్చు. సెలబ్రేషన్స్ పరిమితంగానే జరగొచ్చు. భవిష్యత్తులో మార్పు వస్తుందనే గట్టి నమ్మకం సినీ ప్రియుల్లో ఉంది. అది జరగాలనే అందరి కోరిక.





# ప్రభాస్ ఫౌజీ హీరోయిన్ డిమాండ్ చూశారా

మొన్నటిదాకా అసలెవరో తెలియని ఇమాన్వి ఇస్మాయిల్ ప్రభాస్ సరసన హీరోయిన్ గా ఎంపిక కాగానే ఒక్కసారిగా ఇతర బాషల నిర్మాతల దృష్టిలో పడిపోయింది. హను రాఘవపూడి దర్శకత్వంలో రూపొందుతున్న ప్రీ ఇండిపెండెన్స్ పీరియాడిక్ డ్రామా ఫౌజీ (ప్రచారంలో ఉన్న టైటిల్) లో డార్లింగ్ జోడిగా ఈ అమ్మడుకి డెబ్యూనే ఇంత పెద్ద బ్రేక్ దక్కడం పట్ల ఆల్రెడీ ఫిలిం నగర్ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఇదిలా ఉండగా తన మీద బాలీవుడ్ మేకర్స్ కన్ను పడింది. నిజమో కాదో కానీ ఫౌజీ అయ్యే దాకా వేరే సినిమాలు ఒప్పుకోకూడదని మైత్రి సంస్థ అగ్రిమెంట్ చేసుకుందని గతంలో వార్తలు వచ్చాయి. కానీ ఇప్పుడు టి సిరీస్ అధినేతలు సంస్థ ఇమాన్వి కోసం విశ్వప్రయత్నాలు చేస్తున్నారట. కార్తీక్ ఆర్యన్ హీరోగా అనురాగ్ బసు డైరెక్షన్ లో ఒక భారీ రొమాంటిక్ మూవీని ప్లాన్ చేశారు నిర్మాత భూషణ్ కుమార్. ఫౌజికి సైతం ఈయన నిర్మాణ భాగస్వామిగా ఉన్నారు. సందీప్ వంగా – ప్రభాస్ స్పిరిట్ కి మెయిన్ ప్రొడ్యూసర్ కూడా. ఆదిపురుష్ కి ఎంత బడ్జెట్ పెట్టారో చూశాం. ఈ బాండింగ్ ని వాడుకుని ఇమాన్వి రెండో సినిమాని తమకు లాక్ చేయించేలా మాట్లాడుతున్నట్టు ముంబై రిపోర్ట్. ఈ ఏడాదిలోనే షూటింగ్ మొదలుపెట్టాలని ప్లాన్ చేసుకున్న అనురాగ్ బసు సినిమాకు హీరోయిన్ ఎంపికే పెద్ద టాస్క్ అయ్యిందని సమాచారం. ఏదో సామెత చెప్పినట్టు ఇమాన్వి నక్క తోక తొక్కింది. లేకపోతే ఎలా కనిపిస్తుందో, ఎలా నటిస్తుందో తెలియకుండానే ఇంత డిమాండ్ రావడమంటే మాములు విషయం కాదు. సోషల్ మీడియాలో తన రీల్స్, డాన్స్ చూసినవాళ్లకు పెర్ఫార్మన్స్ గురించి డౌట్లు లేవు కానీ ఫౌజీ లాంటి ప్యాన్ ఇండియా మూవీలో ఎలా కనిపిస్తుందనేది ఆసక్తికరం. పారితోషికం కూడా భారీగానే ముట్టజెబుతున్నారట. రష్మిక మందన్న, శ్రీలీల ఇలా రెండు మూడు ఆప్షన్లతోనే నెట్టుకొస్తున్న టాలీవుడ్ స్టార్ హీరోలకు భవిష్యత్తులో ఇమాన్వి ఇస్మాయిల్ మరో ఛాయస్ అవుతుందేమో చూడాలి. ఫౌజీ విడుదల 2026కి ప్లాన్ చేస్తున్నారు.




# రామ్ చరణ్ వదిలేసుకున్న సినిమా ఏదీ



నిన్న విడుదలైన అన్ స్టాపబుల్ 4 ఎపిసోడ్ లో నిర్మాత దిల్ రాజు మాట్లాడుతూ గేమ్ ఛేంజర్ కోసం రామ్ చరణ్ ఒక సినిమాని వదిలేసుకోవాల్సి వచ్చిందనే మాట అభిమానుల మధ్య హాట్ టాపిక్ గా మారింది. అదేంటనేది బాలకృష్ణ అడగలేదు కానీ ఏమై ఉంటుందనే అనుమానం ఫ్యాన్స్ లో మొదలయ్యింది. కొంచెం ఫ్లాష్ బ్యాక్ లోకి వెళ్తే యువి క్రియేషన్స్, దర్శకుడు గౌతమ్ తిన్ననూరితో ఒక భారీ ప్యాన్ ఇండియా మూవీ ప్లాన్ చేసుకున్న సంగతి మూవీ లవర్స్ కి గుర్తే. కొన్ని నెలల తర్వాత అది కార్యరూపం దాల్చలేదు. తర్వాత గౌతమ్ హీరో విజయ్ దేవరకొండతో ఒకే చేయించుకున్న కథ ఇదేననే టాక్ వచ్చింది.

ఇది నిజమో కాదో కానీ గేమ్ ఛేంజర్ పరిణామాలు గమనిస్తే పైన చెప్పిన కాంబోతోనే మ్యాచ్ అవుతోంది. దర్శకుడు శంకర్ ఒకేసారి ఇండియన్ 2 కూడా తీయడం వల్ల చరణ్ మూడేళ్ళ సమయం దీనికే గడిచిపోయింది. అనూహ్యంగా భారతీయుడు 2 డిజాస్టర్ కావడం గేమ్ ఛేంజర్ హైప్ మీద ప్రభావం చూపించింది. అయితే వింటేజ్ శంకర్ మళ్లీ వెనక్కు వస్తాడనే నమ్మకం సినీ ప్రియుల్లో బలంగా ఉంది. ఇంత త్యాగం చేసినందుకు రామ్ చరణ్ కు హిట్టు దక్కాల్సిన అవసరం ఎంతైనా ఉంది. సోలో హీరోగా వినయ విధేయ రామ తర్వాత మళ్ళీ స్క్రీన్ మొత్తం కనిపించబోయే సినిమా ఇదే. అందుకే ఇంత హైప్.

మరి తాను వదిలేసింది విజయ్ దేవరకొండకు ఎలాంటి ఫలితం ఇస్తుందో చూడాలి. గతంలో ఒక స్టార్ హీరో వద్దకున్నది మరో స్టార్ హీరో చేసి బ్లాక్ బస్టర్స్ సాధించిన సందర్భాలు చాలా ఉన్నాయి. పవన్ కళ్యాణ్ ఇలాగే ఇడియట్, అతడు, పోకిరిని మిస్ చేసుకున్నారు. ఇప్పుడు నిర్మాణంలో ఉన్న ఆర్సి 16 కన్నా ముందు దర్శకుడు బుచ్చిబాబు ట్రై చేసింది జూనియర్ ఎన్టీఆర్ ని. కానీ కుదరలేదు. ఈలోగా చరణ్ తో లాక్ చేసుకున్నాడు. రెండూ ఒకటే కథనా కాదానేది బయటికి రాలేదు. ఏదైతేనేం ఇంత జరిగిన దానికి గేమ్ ఛేంజర్ బ్లాక్ బస్టర్ అయితే అదే చాలనుకుంటున్నారు మెగాభిమానులు.




Printed & Published Owned by, B.Srinivas,H No:6-3-439,Kishan Nagar,Karimnagar, Telangana,505001.Printed at Sri Balaji Printing Press.
H No. 4-4-55, Tilak Road, Karimnagar.(TS). RNI No: APTEL/2006/19056, Cell : 63055 84064, Mail: tarajyothi999@gmail.com